# క్రాంతి

### లోపలి పేజీల్లో...


కేంద్ర బడ్జెట్.... 5
ఫీల్డ్ రిపోర్టులు... 12
పి.జి.ఎ. తొలి దాడి... 15
స్టాక్ కుంభకోణం... 18
బంగ్లా-ఇండో ఘర్షణలు... 26
మేడే ప్రదర్శనలు 32


**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక**

**సంపుటి : 25 సంచిక : 3** **మే-జూన్ 2001** **వెల : ఐదు రూపాయలు**


## చేనేత రంగాన్ని చావుదెబ్బ కొడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు !

## నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావులన్నీ ప్రభుత్వ హత్యలే !!

## ద్రోహి ద్రోణాచార్య పాత్రలో చంద్రబాబు - నేత కార్మికులు అమాయక ఏకలవ్యులు కాబోరు!!!

గడచిన మార్చి, ఏప్రిల్ మాసాలలో; ప్రత్యేకించి ఏప్రిల్ మాసంలో ఆంధ్ర రాష్ట్రంలో వరుసగా జరుగుతూ వచ్చిన చేనేత కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలతో రాష్ట్రంలో హాహాకారాలు చెలరేగాయి. అప్పటికి మరో రెండు మూడు మాసాల వ్యవధిలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయనే వార్తలు ధృవపడటంతో ఈ పరిస్థితికి శవ రాజకీయాలు తోడయ్యాయి. కేంద్ర రాష్ట్ర చట్టసభల్లో నేత కార్మికుల దుర్భర పరిస్థితులు చర్చనీయ అంశాలయ్యాయి. ఆంధ్ర రాష్ట్రంలో గడచిన 3 సం॥లలో చేనేత కార్మికుల ఆత్మహత్యలుగాని, ఆకలిచావులు గాని అసలు జరగనే లేదని కేంద్ర జౌళి శాఖామంత్రి కాశీరాం రాణా బాధ్యతా రహితంగా అబద్ధ ప్రకటనకి పాల్పడ్డాడు. నిజానికి నేత కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలు ఆంధ్ర రాష్ట్రంలో కొత్తేమీ కావు. 1990-91 సం॥లో 162 మంది నేత కార్మికులు ఆత్మహత్యలకో లేక ఆకలి చావులకో బలయ్యారని స్వయానా రాష్ట్ర చేనేత జౌళి శాఖామంత్రి పడాల భూమన్న ప్రకటించాడు. గడచిన దశాబ్దిలో ఈ చావులు నమోదు కాని సంవత్సరమంటూ లేనే లేదనేది అతిశయోక్తి ఏమీ కాదు. కాగా, గడచిన రెండు మూడు సంవత్సరాలుగా నేత కార్మికుల ఈ చావుల విస్తృతి, సంఖ్య బాగా పెరిగిపోయాయి. కుటుంబాలు కుటుంబాలు గానే సామూహిక ఆత్మహత్యలకి పాల్పడుతుండటం అనేది రాష్ట్ర చేనేత రంగంలో ఇటీవల ఏర్పడిన ఒక విషాదకర ధోరణి! గడచిన సంవత్సరం ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 40 మంది



నేతకార్మికులు ఆత్మహత్య చేసుకున్నట్లు 18-4-2001 నాటి 'ది హిందూ' ఆంగ్ల దినపత్రిక సంపాదకీయం పేర్కొంది. ఇక ఈ సంవత్సరం గడచిన ఏప్రిల్ మాసాంతం నాటికి కరీంనగర్ జిల్లాలో 47, గుంటూరు జిల్లాలో 16, నల్గొండ జిల్లాలో 5, అనంతపురం 4, ప్రకాశం 2, మెదక్ 2 చొప్పున నేత కార్మికుల ఆత్మహత్యలు నమోదయ్యాయి (అధికారికంగా). కరీంనగర్ జిల్లాలో చనిపోయిన 47 మందిలో 35 మంది ఒక్క సిరిసిల్లకి చెందినవారే! ఈ విషాదంపై పరిశీలనకు పూనుకుని సిరిసిల్లను సందర్శించిన, కాకతీయ విశ్వ విద్యాలయానికి చెందిన అధ్యాపకుల అధ్యయన బృందం ఆత్మహత్యలకు పాల్పడి అసువులు బాసిన 35 మంది నేత కార్మికుల భయంకర బతుకుబాధల వివరాలతో కూడిన నివేదికని విడుదల చేసింది.

''కుటుంబం నెత్తిన పడిన రుణభారం నుంచి కుటుంబాన్ని గట్టు ఎక్కించడానికి, ఇంకోపక్క తన కుటుంబానికి ప్రభుత్వం నుంచి లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా (నష్టపరిహారం) రాబట్టించుకోవడానికి చేనేత కార్మికులు 'ఆత్మహత్య' అనేదాన్ని ఒక సాహసోపేత పరిష్కార చర్యగా ఎంచుకు పాల్పడుతున్నారు. ఇది తగదని, ఇది ఎంతమాత్రం సాహసం కాబోదని వారికి నచ్చజెప్పాలి'' అని రాష్ట్ర చేనేత జౌళి శాఖామంత్రి సూక్తిముక్తావళి వల్లించాడు. ఇతడు, ఇతడి ఘనత వహించిన ప్రభుత్వం, లేక ఇతరులెవరైనాగాని ఇలాంటి శుద్ధులు, బుద్ధులు చెప్పకనేనా నేత కార్మికులింతటి విషాదకర ఆత్మహత్యలకి పాల్పడిపోతున్నది?! జీవితం విలువ

తెలీకనేనా వారు తమ జీవితాలని నిస్సహాయంగా బలిపెట్టు కుంటున్నది?! ఇకెలాంటి బతుకుదారి లేకనే బడుగు నేతపనివారు ఇలాంటి చావుల్ని ఎంచుకుంటున్నారనే కటిక నిజాన్ని ఒప్పుకునే దమ్ము లేని మంత్రి ప్రదర్శిస్తున్న ఈ మాటకారితనం వెగటు పుట్టించే వెటకారితనం తప్ప వేరు కాదు! ఈ ఆకలిచావులకి ఆత్మహత్యలకి తానూ, తన ప్రభుత్వం వహించాల్సి వున్న జవాబుదారీతనం నుంచి తప్పించుకుపోయే ప్రయత్నంగానే మంత్రి ఇలాంటి గంభీర ప్రకటనలను ఒలకబోస్తున్నాడు. నిజానికి ఈనాడు అటు పేదరైతు కుటుంబాలలోనూ, ఇటు బడుగునేత కార్మిక కుటుంబాలలోనూ ఆనవాయితీగా సాగిపోతున్న ఆకలిచావులు, ఆత్మహత్యలు అనేవి అన్నీ ప్రభుత్వ హత్యలే! అటు కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం చేనేత కుటుంబాల పాలిట హంతక ప్రభుత్వాలుగానే వుంటున్నాయి. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలనుసరించే విధానాల విష ఫలితమే అంతులేని ఈ హత్యాకాండ!

వ్యవసాయం తరువాత అత్యధిక జనాభాకి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగం దేశమంతటిలోనూ దయనీయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. దేశ వ్యాపితంగా 32 లక్షల 85 వేలకు పైగా చేనేత మగ్గాలున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 20 లక్షల జనాభాకి జీవనాధారం కల్పిస్తూ, 5 లక్షల 30 వేల చేనేత మగ్గాలుండగా వీటిలో 3 లక్షల 25 వేల మగ్గాలు సహకార రంగంలో 1104 చేనేత సహకార సొసైటీల పరిధిలో పనిచేస్తుండగా మిగతా 2 లక్షల 5 వేల మగ్గాలు ప్రైవేటు రంగంలో వున్నాయి. నేటి కనీవినీ ఎరుగని చేనేత సంక్షోభం కారణంగా ఈ మొత్తంలో 2 లక్షల 30 వేల మగ్గాలు మూలపడ్డాయి. రాష్ట్రంలో 40 వేల మరమగ్గాలుండగా వీటిలో సగానికి సగం ఒక్క కరీంనగర్ జిల్లాలోనే, ప్రధానంగా ఒక్క సిరిసిల్లలోనే వున్నాయి. కాగా, ప్రత్యక్షంగా 8 వేల కుటుంబాలకి, పరోక్షంగా మరికొన్ని వేల కుటుంబాలకి జీవనాధారం కల్పించగల సిరిసిల్లలోని 12 వేల మగ్గాలు మూలపడి తుక్కు కింద అమ్మకానికి సిద్ధంగా వున్నాయి.

దేశంలోని వ్యవసాయ రంగం లాగానే చేనేత రంగం కూడా దివాళా తీసేయడమనేది అదేదో ఒక రోజులోనో ఒక సంవత్సరంలోనో జరిగిపోయిన హఠాత్ పరిణామం ఏమీ కాదు. 1980వ దశకానికి ముందు ఈ రంగాన్ని అభివృద్ధి చేసే నిర్మాణాత్మకమైన ఆలోచనలు పాలక ప్రభుత్వాల ప్రక్కనుంచి లేకపోయినా పనిగట్టుకుని మరీ ఈ రంగాన్ని దెబ్బతీసే ఘాతుక చర్యలు మాత్రం ఇంత నగ్నంగా అంతవరకూ లేవని చెప్పవచ్చు! ప్రభుత్వం ప్రక్కనుంచి ఎంతటి అనాదరణ కొనసాగి పోతున్నా కూడా ఈ అనాథ శిశువు సొంతకాళ్లపై నిలబడ్డానికి శాయశక్తులా కృషి చేస్తూనే వచ్చింది. దేశంలో సహకార వ్యవస్థ వేళ్లూనుకొన్నది ఈ రంగంలోనే. సహకారోద్యమానికి స్ఫూర్తినిచ్చింది చేనేత రంగమనే చెప్పాలి. వందలాది స్థానిక, ప్రాంతీయ సహకార సంఘాలలో నేత కార్మికులంతా సమీకరణ అయి వుండేవారు. ఇలాంటి ఐకోఫ్యాక్ట్రిక్సు, రాయ్ ఫ్యాబ్రిక్సు, ఆంధ్ర సహకార సంఘం అనే మూడు ప్రాంతీయ సంఘాలు 1976లో 'ఆంధ్రప్రదేశ్ చేనేత సహకార సంఘం' (ఏ.పి.సి.ఓ.-ఆప్కో) గా విలీనం అయ్యాయి. ఈ 'ఆప్కో'కి అనుబంధంగా 1104 స్థానిక సహకార సంఘాలుండేవి. 'ఆప్కో' అండతో, సహకార స్ఫూర్తితో ఏదోమేరకి స్వయంపోషకంగాను, స్వయం సహాయకంగానూ వుంటుండిన చేనేత రంగానికి, 1985లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నూతన జౌళి విధానం'తో గడ్డురోజులు ప్రారంభమయ్యాయి. 1991 నుంచి ప్రారంభమైన సరళీకృత ఆర్థిక విధానాలు, సంస్థాగత సర్దుబాటు విధానాల దాడికి సన్నాహక కృషి, వాతావరణ కల్పన అనేవి 1980 వ దశకం నుంచే సాగుతూ వచ్చాయి. 1985 నాటి 'నూతన జౌళి విధానం' ఈ దాడి సన్నాహాలలో భాగమే! అంతవరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని 'పట్టించుకోక పోవడం' మాత్రమే జరిగింది! కాని, ఇకా తరువాత పనిగట్టుకుని మరీ ఈ రంగం 'పనిపట్టడం' ప్రారంభించాయి ప్రభుత్వాలు! 'హేండ్‌లూమ్ రిజర్వేషన్ చట్టం' ప్రకారం కొన్ని రకాల వస్త్రాలను (11 రకాలు) చేనేతకు రిజర్వ్ చేస్తూ, మరమగ్గాలను ప్రవేశింపజేయడంతో ఈ రంగంలో సంక్షోభం ప్రారంభమైంది. నిజం చెప్పాలంటే చేనేతకి సాంప్రదాయక మరమగ్గాలు హానికరమైన పోటీ ఏమీ కాదు. వీటిమధ్య సమన్వయం, సమతుల్యత, సహకారం అనేవి సాధ్యమే! కాని, చేనేత రంగాన్ని పనిగట్టుకు దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వ విధానాల పుణ్యమా అని మరమగ్గాలు చేనేతకు పోటీగా నిలిచాయి. ఇక ఆ తరువాత రంగప్రవేశం చేసిన జెట్‌లూమ్స్, ఆటోపవర్ లూమ్స్ చేనేతపై దెబ్బమీద దెబ్బతీసాయి. బడా వస్త్ర వ్యాపారుల, కంపెనీల, మిల్లుల ఉత్పత్తులైన టెర్లిన్, టెరీకాటన్, పోలియస్టర్ లాంటి వస్త్రోత్పత్తులు మార్కెట్‌లో వెల్లువెత్తడంతో చేనేత ఉత్పత్తులకి మార్కెట్ మాయలేడి అయిపోయింది. దీనికి తోడు చేనేత వస్త్రాల ఉత్పత్తి వ్యయం ఏటికేడు ఒకటికి పదిరెట్లు పెరిగిపోయింది. 1997 నాటికి చేనేత రంగానికి 70 లారీల దారం (యార్న్) సరఫరా అయేది, అలాంటిది ఈనాడది 40 లారీలకి మించడం లేదు. 1980ల నాటికి చేనేత వస్త్రాల అద్దకాలకి (డైయింగ్) వాడే రంగుల ధర కిలో 98 రూ॥లు వుండగా 1990లో అది 220-320 రూ॥లు; 2001 నాటికి 430 నుంచి 485 రూ॥లుగా పెరిగిపోయింది. 1980లో చేనేత వస్త్రాలపై సెంట్రల్ ఎక్సయిజ్ డ్యూటీ 1.75 రూ॥లు వుండగా అది 1990ల తరువాత రెండు విడతలుగా పెరిగి 2001 నాటికి 9.20 రూ॥లు అయి కూర్చుంది. ఇక విద్యుత్ ఛార్జీల పెరుగుదల గూర్చి చెప్పనే అక్కర్లేదు!

'సంస్కరణల' పుణ్యమా అని దేశం మొత్తంపైన చేనేత రంగం దుస్థితి ఇలా వుండగా ప్రపంచబ్యాంకు ఆదేశాలను అక్షరాలా పాటిస్తూ సంస్కరణల అమలుకి ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చేసిన చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోని చేనేతరంగం ఇంకే రాష్ట్రంలో కంటే కూడా దారుణంగా దెబ్బతిని పోయింది. బాబు ప్రభుత్వం పనిగట్టుకు మరీ 'ఆప్కో' పుట్టె ముంచేసింది. రాష్ట్ర వ్యాపితంగా వుండే ఆప్కో కేంద్రాలన్నింటినీ మూసేయించింది. మొదట్లో ఆప్కో టర్నోవర్ సాలీనా 500 కోట్ల రూ॥లుగా వుండేది. అదీనాడు కేవలం 60 కోట్లకి పడిపోయిందంటే దాని దీనావస్థ అర్థమవుతుంది. గతంలో ప్రభుత్వం దీనికి ఇస్తుండిన 20 శాతం రిబేట్‌ని తొలగించింది. 500 పైగా సిబ్బందిని ఆప్కో నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ పథకంతో ఇళ్లకు పంపేసింది (ఇది

స్వచ్ఛంద విరమణా? లేక నిర్బంధ విరమణా?) ఆప్కో షోరూంలన్నింటికీ తాళాలు వేయించేసింది. దీంతో చేనేత రంగంలో 5 లక్షల 30 వేలుగా వుంటుండిన మగ్గాలు 2 లక్షల 10 వేలకి పడిపోయాయి. ఆప్కో ద్వారా చేనేత కార్మికులకి ప్రభుత్వం చెల్లించాల్సిన 30 కోట్ల రూ॥ల బకాయీలని బాబు ప్రభుత్వం గడచిన 2, 3 సంవత్సరాలుగా చెల్లించకుండా తొక్కిపట్టింది. నేత కుటుంబాలలో ఆత్మహత్యలు, ఆకలిచావులు పెరిగిపోయి హాహాకారాలు చెలరేగడంతో చివరకు ఆ మొత్తం చెల్లింపుకి సిద్ధపడింది. నేత కార్మికుల పరిస్థితిని చక్కబెట్టడంలో ఈ బకాయిల చెల్లింపు అనేది కేవలం కన్నీటి తుడుపు చర్యే! నేత కార్మికుల బతుకులు దీంతో బాగుపడిపోయేవేమీ కాదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగంపై ప్రదర్శిస్తున్న దారుణ నిర్లక్ష్యం అర్థమవుతుంది. తమిళనాడు ప్రభుత్వం టెక్స్‌టైల్ రంగానికి 250 కోట్లు కేటాయించగా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కేవలం 18 కోట్లే కేటాయించింది. మహారాష్ట్ర ప్రభుత్వం ఒక్కోనేత కార్మిక కుటుంబం నుంచి నెలకు 150 రూ॥లు మాత్రమే విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తుంటే రాష్ట్రంలో బాబు హైటెక్ ప్రభుత్వం యూనిట్‌కి 5.50 రూ॥లు చొప్పున వసూలు చేస్తోంది. రాష్ట్రంలో ఆప్కో ద్వారా జరిగే వస్త్ర విక్రయాలు 61 కోట్ల నుంచి 19 కోట్లకి పడిపోయాయి. దేశ వ్యాపితంగా రెండువేల కోట్ల రూ॥ల విలువైన చేనేత వస్త్రాలు ఎగుమతి అవుతుంటే వాటిలో ఆంధ్ర నుంచి ఒక్కగానొక్క వస్త్రం సైతం లేదనేది అక్షర సత్యం!

1996-97వ సం॥లో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి 69.55 కోట్లు కేటాయించి అందులో 32.02 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. 1997-98 సం॥కి కేటాయింపే 38.83 కోట్లకి పడిపోగా, ఇక అందులో ఖర్చు చేసింది కేవలం 16.91 కోట్లే! 1998-99లో కేటాయింపు మరీ ఘోరంగా 11.90 కోట్లకి పడిపోయింది. 1999-2000కి కేటాయింపు 60.63 కోట్లకి పెరిగినా ఖర్చు దారుణంగా 5.58 కోట్లకి దిగజారింది. అంటే 10 శాతం ఖర్చన్నమాట! మగ్గాల ఆధునికీకరణ, నేత కార్మికుల శిక్షణ, కార్మికుల ఆరోగ్య సేవా పథకం, వర్క్ షెడ్ గృహ నిర్మాణం లాంటి నేత రంగంలోని వివిధ పథకాల కింద జరిగిన ఖర్చుల శాతాలు ఎలకతోక వాటంగా సన్నబడ్డాయి; కొన్నింటికి అసలు ఖర్చే కనబడదు. ఈ రకంగా చేనేత రంగాన్ని దివాళా తీయిస్తూ వచ్చిన ప్రభుత్వం 'ఆప్కో' కు మంగళం పాడేయడంతోను, ఆ తరువాత 'ఆప్టెక్సు' కి సైతం తాళాలు బిగించేయడంతో చేనేత రంగాన్ని చావుదెబ్బ కొట్టిందనే చెప్పాలి. పవర్‌లూమ్ ఉత్పత్తులకి మార్కెటింగ్ నిర్వహించే ఏకైక ప్రభుత్వ సంస్థ 'ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ కార్పొరేషన్' (ఆప్‌టెక్స్)! ఇది మూసుకుపోవడంతో కేంద్రం పవర్‌లూమ్స్ కోసం ప్రవేశపెట్టిన వివిధ పథకాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పక్కనుంచి నోడల్ ఏజెన్సీ అనేది ఏదీ లేకుండా పోయింది. చేనేత రంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం కావాలని చేసిన చర్యే ఇది. కేవలం చేనేత ఉత్పత్తుల క్రయ విక్రయాల మార్కెటింగ్ తప్ప పవర్‌లూమ్స్ ఉత్పత్తులకి సంబంధించిన పథకాల నిర్వహణ బాధ్యత తనవల్ల కాదని అప్పటికే శక్తిహీనమై పోయిన 'ఆప్కో' చేతులెత్తేసింది. ప్రపంచబ్యాంకు ఒత్తిడితోనే ఈ 'ఏ.పి. ఆప్టెక్సు' మూతపడింది. 2000 డిసెంబర్ 31లోగానే దీన్ని మూసేయాలని బ్యాంకు దొరవారు ఆజ్ఞాపిస్తే కేవలం 12 రోజులు లేటుగా సేవక చంద్రబాబు ప్రభుత్వం మూసేసింది.

దేశంలో వేగవంతం అవుతున్న, ఆంధ్ర రాష్ట్రంలో మరీ శరవేగంతో సాగిపోతున్న ఆర్థిక, పాలనా సంస్కరణల నేపథ్యంలోనే రాష్ట్రంలో చేనేత రంగం చావుని అర్థం చేసుకోగలం! ఈ నేపథ్యంలోనే, 1985 నాటి కేంద్ర జౌళి విధానాన్ని పునఃసమీక్షించే లక్ష్యంతో 1998లో 'సత్యం కమిటి' ఏర్పడింది. ఈ కమిటీ చేనేత రంగానికి మరణ శాసనం రాసేసింది. ఈ కమిటీ సిఫార్సుల పట్ల చేనేత కార్మికుల్లో తీవ్ర ఆందోళన చెలరేగింది. ఆంధ్ర రాష్ట్రంలో ఈ కమిటీ సిఫార్సులకు వ్యతిరేకంగా 1999 డిసెంబర్ 12న హైదరాబాద్‌లో 'ఆంధ్రప్రదేశ్ చేనేత ఐక్య కార్యాచరణ సమితి' ఆధ్వర్యంలో చేనేత రక్షణ సదస్సు జరిగింది. చేనేత కార్మికుల తీవ్ర వ్యతిరేకతకు గురైన సత్యం కమిటీ సిఫార్సులను ఆమోదించటం లేదని కేంద్ర జౌళి శాఖా మంత్రి ప్రకటించాడు గాని అది నిజాయితీ లేని అబద్ధ ప్రకటనగానే రుజువవుతూ దొడ్డిదోవలో సత్యం కమిటీ సిఫార్సుల స్ఫూర్తితోనే 'జాతీయ జౌళి విధానం' రూపు దిద్దుకుంది. చిలవల నూలు ఉత్పత్తిని నిలిపేయడం, 11 రకాల చేనేత వస్త్రాలపై వుంటుండిన రిజర్వేషన్ రద్దు చేయడం అనేవి ఈ జాతీయ జౌళి విధానంలోని కీలకాంశాలు కాగా ఈ రెండూ కూడా సత్యం కమిటీ చేసిన ప్రముఖ సిఫార్సులే! సంస్కరణలు ప్రారంభమై గడచిన పది సం॥లలో ఏయేటి కాయేడు నూలు, రసాయనాలు, రంగుల ధరలు పెరిగిపోతూ 2001 నాటికి అవి ఎకాయెకిన 200 రేట్లు పెరిగి కూర్చున్నాయి. ఫలితంగా నేత కార్మికులు నూలు కొనడానికి బహిరంగ మార్కెట్‌ని ఆశ్రయించక తప్పదు. బహిరంగ మార్కెట్‌లో వారి బతుకులతో బంతులాటలు సాగుతున్నాయి.

2001 ఏప్రిల్ నుండి 'ప్రపంచ వాణిజ్య సంస్థ'తో భారత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందపు షరతులు అమలులోకి రావడంతో చేనేత రంగం నిలువునా నీరుకారి పోయింది. ఈ ఒప్పందం ప్రకారం అన్ని రకాల విదేశీ వస్త్రాలు ఎలాంటి ఆంక్షలూ లేకుండా భారత మార్కెట్‌లోకి దిగుమతి కాడానికి రాజమార్గం ఏర్పడింది. 48 రకాల విదేశీ వస్త్రాలు దేశీయ మార్కెట్‌ని ముంచెత్తనున్నాయి, ముంచెత్తు తున్నాయి. బహుళజాతి సంస్థలు 100 శాతం పెట్టుబడులతో దేశంలో వస్త్రాల ఉత్పత్తికి విజృంభించాయి. బడా మిల్లుల యాజమాన్యాలు సాంకేతిక ఉన్నతీకరణ పథకాల కింద 5 శాతం వడ్డీ రాయితీతో 25 వేల కోట్ల రూపాయిల భారీ పెట్టుబడులతో వస్త్రాల ఉత్పత్తికి దిగాయి. పైగా ఈ వస్త్రాలపై ఎలాంటి పన్నులూ వుండవు. అవి మార్కెట్‌ని ముంచెత్తితే చేనేత చేతులెత్తేయక చేయగలిగేదేముంటుంది! ఆప్కో షోరూముల మూసివేత మరింత వేగం పుంజుకుంది, మార్చి 2001లో మరో 91 షోరూములు మూతపడ్డాయి. 16 శాతం అమ్మకం పన్ను రాయితీతో మరీ విదేశీ కంపెనీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ ఆహ్వానించాయి.

ఈ రకంగా జబ్బుపడి, చావు మూల్గులు మూలుగుతున్న రాష్ట్ర చేనేత రంగానికి తిరిగి జవసత్వాలు కలిగించడానికి వీలుగా

* ఆప్కోకి రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా 100 కోట్లు తాత్కాలిక సహాయం అందించాలని,
* రాష్ట్ర బడ్జెట్ ప్రస్తుత 19 కోట్లకి బదులు 200 కోట్లు ఈ రంగానికి కేటాయించాలని,
* చేనేతకు రిజర్వ్ చేసిన 11 రకాల వస్త్రాలపైని రిజర్వేషన్‌ని ఖచ్చితంగా అమలు చేయాలని,
* నూలుమిల్లులకు నిర్ణయించిన మేరకు చిలపలునూలు ఉత్పత్తి చేసి చేనేత రంగానికి సరసమైన ధరలకు విక్రయించాలని,
* మార్కెటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని,
* చైనా సిల్కు నూలు దిగుమతిపై సుంకాన్ని రద్దు చేయాలని,
* ఆప్టెక్సుని పునరుద్ధరించాలని,
* ఆప్కో మూసివేతని నిలిపేయాలని, మూసేసిన షోరూములన్నింటినీ తిరిగి తెరవాలని,
* నూలు, రంగులు, తదితర ముడిసరకులపై అమ్మకం పన్ను, ఎక్సయిజ్ పన్ను తదితర అన్ని రకాల పన్నులు రద్దు చేయాలని
* ఆప్కో తరహాలో ఒక కేంద్ర సంఘాన్ని ఏర్పరచాలని,
* సిరిసిల్లలో ఒక ప్రోసెసింగ్ యూనిట్‌ని ఏర్పరచాలని,
* చేనేత పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని చేనేత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇవన్నీ అతి సాధారణం, అత్యంత న్యాయబద్ధం అయిన కోర్కెలే! కానీ, ప్రపంచీకరణ నేపథ్యంలో, రెండోదశ సంస్కరణలు (సెకెండ్ జెనరేషన్ రీఫార్మ్స్) ప్రజలపై మరింత పెద్ద ఎత్తున దాడికి తలపడిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇవన్నీ కేవలం అసందర్భాలైపోయాయనే చేదు నిజాన్ని మనం గుర్తుంచుకోవాలి!

చేనేత రంగాన్ని పాతాళంలోకి తొక్కేసి మార్కెట్‌నంతటినీ మింగేయడానికి అర్రులు చాస్తున్న విదేశీ స్వదేశీ బడా కంపెనీలకి, బడా మిల్లర్లకి అపరిమిత రాయితీలని రక్షణలని అందించే

(తరువాయి 25వ పేజీలో...)

## తాగబుద్ధి గాలే...

కరీంనగర్ జిల్లా. సిరిసిల్ల శివారు గ్రామంలో... రాజీవ్ నగర్ కాలనీ. ఆరోజు శ్రీరామనవమి.. ప్రభుత్వ బొక్కసానికి కట్టవలసిన సొమ్ముతో భద్రాచలంలో రామాలయం నిర్మించాడు కంచెర్ల గోపన్న. ఆ నేరానికి ఆయనను బందీ చేశారు. గోపన్న రామభక్తి వల్ల అతడు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసినా రామదాసు అయ్యాడు. శ్రీరామ నవమి నాడు సీతారాముల కళ్యాణం జరిగింది. ఈనాడూ రాముడు ఇలవేల్పే. ప్రపంచబ్యాంక్ కనుసన్నల్లో మెలగే రాష్ట్ర ప్రభుత్వం రాములవారికి కళ్యాణానికి ప్రభుత్వ ఖజానాలోంచి భారీ కానుకలు సమర్పించింది. టీ.వీ.లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. సరిగ్గా ఆ సమయంలోనే....



కరీంనగర్ జిల్లా సిరిసిల్ల పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో పూటగడవని స్థితిలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మిక కుటుంబ సభ్యులు కిష్టయ్య, నర్సవ్వ, ఎల్లయ్య, భానుప్రియ

అక్కపేరు భానుప్రియ. చెల్లి పేరు శాంతిప్రియ. తాత. నాయనమ్మ. నాయన. అక్క పురుగుల మందు... విషం త్రాగారు. పవర్‌లూమ్ కార్మికుడైన కొండ క్రిష్టయ్య (32సం॥). అతని తండ్రి ఎల్లయ్య (70). తల్లి నర్సవ్వ (60) విస్కీలో పురుగుమందు పోసుకుని తాగగా. కిష్టయ్య తన కుమార్తెలు భానుప్రియ (8). శాంతిప్రియ (6)లకు పండ్ల రసంలో విషం కలిపి తాగించాడు. అయితే శాంతిప్రియ దానిని బయటకు ఉమ్మివేసి ప్రాణాలతో బయటపడింది. మిగిలినవారంతా కక్కుకుని. కక్కుకుని చనిపోయారు... పత్రికలవాళ్ళూ. టీవీల వాళ్ళూ వచ్చారు. శాంతిప్రియకు ఆరేళ్ళు. 'మరి నువ్వు విషం తాగలేదా' అనడిగాడొక విలేకరి. 'తాగబుద్ధి కాలే' ఆ చిన్నారి కంఠంలో దుఃఖం. జాయింట్ కలెక్టర్ వచ్చారు. పోలీసులూ వచ్చారు. 'పొద్దున్న చనిపోయిన్రు. శవాల్ని దీస్కపోయిన్రు' అని చెప్పింది. 'మరి నీకు భయం వెయ్యలేదా' అంటే . కన్నీళ్ళ చెరువులో తల ఊపింది శాంతిప్రియ... అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో పాలకవర్గాలు ఎవరికోసం పాలన సాగిస్తున్నాయి? మారినవి జెండాలు. పాలకవర్గాలు. ప్రజల కష్టాలు. కడగండ్లు మారలేదు. పేదరికం. అన్యాయం. లంచగొండితనం. అధికార దుర్వినియోగం. గూండాయిజం. ఫ్యాక్షనిజం. పెరిగి పెరిగి ఏ స్థాయికి వచ్చాయంటే. ప్రజల ధన. మాన. ప్రాణాలకు ఖాతరు లేదు. నోరు విప్పితే తుపాకులు పేలుతున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలమీద సైనిక గుర్రాలు కదం తొక్కాయి. కరెంటు ధరల పెరుగుదలకు నిరసన ఉద్యమంమీద తుపాకులు విరుచుకు పడ్డాయి. ఈ పరిస్థితి మారాలి. ఆకలి చావులన్నీ సామాజిక హత్యలే!

**('వార్త' సౌజన్యంతో...)**

కేంద్ర బడ్జెట్ : 2001 - 2002

# ఆత్మహత్యల బడ్జెట్

దేశ వ్యాప్తంగా ఆత్మహత్యల పరంపర ఇంకా సాగుతూనే వుంది. అయితే ఇంత విస్తృత స్థాయిలో ప్రజానీకం ఆత్మహత్యల బారిన పడిపోవటమన్నది మన దేశ చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరిగి వుండలేదు. ఇపుడు ఆత్మహత్యల బారిన పడుతున్నది సమాజంలోని అట్టడుగు స్థాయి నిరుపేదలు మాత్రమే కాదు, నిరంతరం పంటలు పాడుకావటం లేదా పంటల ధరలు పడిపోవటంతో నిరాశా నిస్పృహలకు గురవుతున్న వ్యవసాయ దారులు; భవిష్యత్తును చూడలేకపోతున్న నిరుద్యోగ యువత; సుదీర్ఘకాలం పనిచేశాక వున్నట్లుండి ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగులు; పెళ్ళిళ్ళ మార్కెట్‌లో వరకట్నం ఇచ్చుకోలేని యువతులు; చివరకు భద్రతను కోరుకుంటూ బ్యాంకుల దగావల్లో, లేక స్టాక్ మార్కెట్ అక్రమాల వల్లో జీవితకాలం పొదుపులు వున్నట్లుండి హరించుకు పోవటం కళ్ళారా చూస్తున్న మధ్యతరగతి... ఇలా సమాజంలోని అన్ని విభాగాల ప్రజలూ ఆత్మహత్యల బాటకు నెట్టబడుతున్నారు.

ఈ భయానక, భీభత్స పరిస్థితుల నడుమనే, ఈ ఆత్మహత్యా బడ్జెట్ కూడా కాలు పెట్టింది. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయటమే కాదు, మరికొన్ని లక్షల మంది ప్రజలను కూడా నిండా ముంచేస్తుంది. మాట వరసకైనా 'పేదలకు ప్రయోజనాలు కల్పించడం' అనే పదాన్ని సైతం ఈ బడ్జెట్‌లో ఎవరూ చూడలేరు. ఎలాంటి కపటత్వాలు, దొంగ నటనలూ దీంట్లో లేవు. ప్రజల వద్ద మిగిలివున్న కాసింత మొత్తాలను సైతం కొల్లగొట్టేందుకోసం ఈ బడ్జెట్ నగ్నంగా, బాహాటంగా, క్రూరంగా నడుం కట్టింది. **నిరుపేదలు, వ్యవసాయదారులు, కార్మికులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు, చివరకు చిన్న చిన్న వ్యాపారులు... వీరందరిపై ప్రత్యక్ష దాడే నేటి బడ్జెట్. అదే సమయంలో బడా వ్యాపార వర్గాలకు, విదేశీ పెట్టుబడికి, పలువురు సంపన్నులకు ఇది అపార మొత్తాలను అప్పనంగా అందిస్తోంది.** ఈ 'మెరుపుకలల బడ్జెట్'ని తమకందించిన బడితొత్తు కేంద్ర ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హాని బడా వాణిజ్య వర్గాలు ఉబ్బేస్తూ అతగాడికి 10కి 9 మార్కులను ఇచ్చారంటే ఆశ్చర్యపడాల్సింది లేదు.

నిజమే. ఈ బడ్జెట్ సంపన్నులకు ఓ 'మెరుపుకల' కాగా ప్రజలకు మాత్రం పీడకలే. అయితే, పార్లమెంట్‌లో 'తెహెల్కా' వుదంతం రేపిన రసాభాస నేపథ్యంలో దేశ రాజకీయ గణం మొత్తంగా ఈ బడ్జెట్‌ని కనీస చర్చ కూడా జరపకుండానే ఆమోదించేసింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు మొత్తం 55 రోజుల్ని కేటాయించగా పార్లమెంట్ 16 రోజులు మాత్రమే సమావేశమైంది. పైగా 'తెహెల్కా' తదితర కుంభకోణాలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ బడ్జెట్ వినాశకర ప్రభావాన్ని సమర్థవంతంగా మరుగున పెట్టేయటం జరిగింది. అయితే తెహెల్కా వుదంతంలో బయటపడింది చట్ట విరుద్ధ లూటీ కాగా బడ్జెట్ అనేది చట్టబద్ధమైన లూటీ. తెహెల్కా వ్యవహారం లక్షలతో ముడిపడగా, బడ్జెట్ వ్యవహారం వేలాది కోట్ల రూపాయలతో ముడిపడివుంది. చాటుమాటు ఒప్పందాల ద్వారా తెహెల్కా వుదంతం దేశ రక్షణనే ప్రమాదంలోకి నెట్టేయగా బడ్జెట్ అనేది దేశాన్ని బహిరంగంగానే విదేశీ పెట్టుబడికి ధారాదత్తం చేసేస్తోంది. రాజకీయ నాయకుల సైన్యాధికారుల విద్రోహపూరిత ఒప్పందాలను 'తెహెల్కా' బయటికి లాగింది. ఐ.యం.యఫ్., ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలలోని అంతర్జాతీయ బందిపోట్ల తరపున పనిచేస్తూ పార్లమెంట్‌లోనూ, నిరంకుశోద్యోగ వర్గంలోనూ బహిరంగంగా వ్యవహారం నడుపుతున్న పంచమాంగ దళాన్ని బడ్జెట్ బయటపెట్టింది.

ఇంతకీ ఈ బడ్జెట్ చేస్తున్న దేమిటి?

## ప్రజల కొనుగోలు శక్తిని హరించడం

ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించటం ద్వారా సరుకులకు దేశీయ మార్కెట్ కుంచించుకుపోయి అది పారిశ్రామిక స్తబ్ధతను పెంచుతోంది.

ఈ బడ్జెట్‌లో పోస్టల్ ఛార్జీలు పెరిగాయి. ప్రజలందరూ వాడే పలు సరుకులపై ఎక్సైజ్ డ్యూటీ రెట్టింపైంది. ప్రజా పంపిణీ వ్యవస్థ -పి.డి.యస్.- వాస్తవంగానే ముక్కచెక్కలై పోయింది. ఆహార ధాన్యాల సేకరణను ప్రైవేట్ వ్యాపారస్తుల పరం చేసేశారు. చివరకు మధ్యతరగతి ప్రజల పొదుపులు సైతం పెనుదాడి బారిన పడ్డాయి. వ్యవసాయదారులను, కార్మికులను అదే పనిగా లక్ష్యంగా చేసుకొన్నారు.

గత సం॥రం ఆహార ధాన్యాల ఉత్పత్తి కోటి టన్నులకు భారీ స్థాయిలో పడిపోయింది. వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడి క్షీణించటం, స్వేచ్ఛా వ్యాపారానికి, చౌక దిగుమతులకు దేశీ వ్యవసాయ మార్కెట్ తలుపులు తెరిచేయడంతో (ఈ బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని నామమాత్రంగానే పెంచారు) ఇప్పటికే కనీస మాత్రంగా వున్న గ్రామీణ జనాభాలోని చాలామంది ఆదాయం శరవేగంగా క్షీణిస్తోంది.

కార్మికులను ఇష్టానుసారంగా నియమించుకుంటూ, ఎప్పుడు పడితే అప్పుడు తొలగించే విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, కాంట్రాక్టు లేబర్‌ని నియమించుకోవటంలో సంపూర్ణ స్వేచ్ఛ కల్పించటం ద్వారా, కార్మికుల ప్రావిడెంట్ ఫండ్‌పై వడ్డీని భారీగా కోత కోయడం ద్వారా ఈ బడ్జెట్‌లో కార్మికులపై ప్రభుత్వం నేరుగా దాడిచేసింది.

అయితే ఈ దాడి కర్షకులు, కార్మికులకే పరిమితం కావటం లేదు. మధ్యతరగతిని, చిన్నతరహా వ్యాపారుల్ని సైతం ఈ బడ్జెట్

దారుణంగా దెబ్బతీసింది. మధ్యతరగతి సంపాదన, పొదుపు రెండూ దెబ్బతిని పోయాయి. చిన్న పొదుపు మొత్తాలపై భారీగా పన్ను విధించారు. రాయితీల్లో కోత ద్వారా ప్రత్యక్షంగానూ, వడ్డీరేట్లను తగ్గించటం ద్వారా పరోక్షంగానూ చిన్న పొదుపులను ఇలా దెబ్బతీశారు. పట్టణ మధ్యతరగతి ప్రజల నుండి పిండుకోవడానికి పన్నుల యంత్రాంగాన్ని భారీగా విస్తృత పర్చారు. చివరగా ప్రభుత్వ ఉపాధి కల్పన దారుణంగా పడిపోయింది.

చిన్నతరహా రంగంకి సంబంధించి చూస్తే బడ్జెట్ దీనిపై జంట దాడులకు దిగింది. మొదటగా ప్రభుత్వం వీటి రాయితీలపై కోత విధించి చాలా వాటిలో మూలధనాన్ని వెనక్కు తీసుకుంది. రెండోది; కస్టమ్స్ సుంకాన్ని తగ్గించటం ద్వారా, మరో 700 పైగా వస్తువులపై పరిమాణాత్మక ఆంక్షలను ఎత్తేయటం ద్వారా దేశంలోకి చౌక దిగుమతుల వెల్లువకుగాను ఈ బడ్జెట్ మరింతగా తలుపులు తెరిచేసింది. దీంతో వ్యాపారం నుండి వేలాది సంస్థలు బయటకు నెట్టేయబడి దివాలా తీసి లక్షలాదిమంది ఉద్యోగాల నుండి, పనుల నుండి తొలగించివేయ బడతారు. జనాభా మొత్తంగా దారిద్ర్యంలోకి నెట్టబడతారు.

**అందుచేత, వ్యవసాయదారుల, కార్మికుల, మధ్యతరగతి ప్రజల, చిన్నతరహా వ్యాపారుల జీవన ప్రమాణాలపై ఇంతటి భారీస్థాయి దాడి ద్వారా భారతీయ జనాభాలోని 85 శాతంపైగా ప్రజల కొనుగోలు శక్తి దారుణ స్థాయికి పడిపోతుంది. ఈ పతనం పారిశ్రామిక సరకులకు డిమాండ్‌ని తగ్గించి, భారతీయ ఆర్థిక వ్యవస్థను మరింతగా స్తబ్దతలోకి నెడుతుంది.**

## పెట్టుబడి సామర్థ్యతను క్షీణింపజేయటం

దేశీయ మార్కెట్‌ని కుదించి వేయటంతోపాటుగా ఈ బడ్జెట్ ఉత్పాదక పెట్టుబడి సామర్థ్యతను కూడా తగ్గించేస్తోంది.

ఉత్పాదక పెట్టుబడికి దేశీయ పొదుపు మొత్తాలు ఒక ప్రధాన వనరు. ఇవి శరవేగంతో పడిపోతుండటమేకాదు, మిగిలిన కాసింత మొత్తాల్ని సైతం ప్రభుత్వం చేసిన రుణాల చెల్లింపుల కోసం తోడేస్తున్నారు. ఇంకా చాలా భాగం సట్టా మార్గాల్లో తరలిపోతోంది.

గడచిన దశాబ్దంలో జి.డి.పి. - స్థూల దేశీయోత్పత్తి - లో 25 శాతంగా వున్న దేశీయ పొదుపు మొత్తాలు ఈ రోజుకి 21 శాతానికే పరిమితమై గణనీయంగానే పడిపోయాయి. ఈ బడ్జెట్ ఒకవైపు వడ్డీరేట్లను తగ్గించేసింది, మరోవైపు ప్రజల కొనుగోలు సామర్థ్యం పడిపోతున్న స్థితిలో దేశీయ పొదుపు మొత్తాలు మరింతగా పడిపోనున్నాయి.

ప్రభుత్వ రుణం ఈరోజు జి.డి.పి.లో 5 శాతంగా వుంటుండటంతో ప్రజల పొదుపు మొత్తాలలో అధిక భాగాన్ని ప్రభుత్వమే తోడేస్తోంది. గత దశాబ్దంలో పన్నుల రాబడి జి.డి.పి.లో 7.9 శాతం నుండి నేడు 6.6 శాతంకి పడిపోయింది. ఇది ఇలా నిరంతరం పడిపోతుండటంతో పరిస్థితి మరింతగా విషమిస్తుంది. పైగా మంత్రి వర్గంపై, ఎం.పి.లపై, బ్యూరోక్రాట్లపై పెడుతున్న దండగమారి భారీఖర్చుతో పాటు, వడ్డీరేట్లు, రక్షణ, పోలీసు బలగాలపై వ్యయం చుక్కలంటుతుండటంతో ఉత్పాదక పెట్టుబడికి మిగిలేది ఏమీలేదు.

1980లతో పోలిస్తే కేంద్ర పెట్టుబడి వ్యయం సగానికి పడిపోయిందంటే ఆశ్చర్యపడాల్సింది లేదు, రాష్ట్రాలు, ప్రభుత్వరంగ సంస్థలతో కలిపి మొత్తం ప్రభుత్వ పెట్టుబడి జి.డి.పి. దామాషా ప్రకారం చూస్తే గడచిన మూడు సం॥లలో బాగా పడిపోయింది. ఇలా కావటం 1960ల తర్వాత ఇదే మొదటిసారి.

ప్రైవేట్ పెట్టుబడి అడుగుపెట్టిన మేరకు సర్వీస్ రంగంలోనూ, సట్టా సంస్థలలోనూ అధిక రాబడులు లభ్యమవు తుండటంతో ఉపాధి కల్పనను సృష్టించే ఉత్పాదక పెట్టుబడుల వైపుగా పోతున్న మొత్తం ఏమంతగా లేదు.

## మీడియా తప్పుడు ప్రచారం

ఈ విధంగా దేశీయ మార్కెట్ వేగంగా పతనమవటం, మూల ధన వినియోగం పడిపోవటంతో ఆర్థిక వ్యవస్థ మరింతగా క్షీణించిపోక తప్పదు. పై రెండు రంగాలలోనూ ఈ పతన క్రమానికి ప్రస్తుత బడ్జెట్ ఒక ఉత్ప్రేరకంగా మాత్రమే పనిచేస్తుంది.

అయితే ఇక్కడే పారిశ్రామికాధిపతులూ, వారి 'ఆర్థిక వేత్తల'నబడే బడితొత్తులూ ముక్తకంఠంతో గీపెడతారు. ''*తప్పు, తప్పు... ఇది పూర్తిగా తప్పు; ఆర్థిక మూలాధారాలు ఎంచక్కగా సరళీకరణ యొక్క కాస్తంత బలమైన వూపు ద్వారా జి.డి.పి. పెరుగుదల రేట్లు త్వరలో 8 శాతంకి చేరుకుంటాయి*'' అన్నదే వారి ముక్తాయింపు. తమ వాదనను నిరూపించుకునేందుకుగాను వారు ఆర్భాటంగా ఇలా ప్రకటిస్తారు. ''డిమాండు పడిపోతుందని ఎవరంటున్నారు! జనాభాలో 85 శాతాన్ని మర్చిపోండిక. అంచెలంచెలుగా ఎగబాకుతున్న ఎగుమతులకేసి చూడండి. వీటితోపాటు, 5 శాతం మంది సంపన్నుల వద్ద పేరుకుపోయిన ధనరాసులు కలిసి అభివృద్ధిని ప్రేరేపిస్తాయి''. ఇక పెట్టుబడి లేమికి సంబంధించి వీళ్ళు సంభ్రమంతో ఇలా జవాబిస్తారు. ''*ఇక్కడ పెట్టుబడులు లేకపోతేనేం! పన్ను విరామం కల్పించడం ద్వారా, అత్యధిక లాభాలను అందించటం ద్వారా, సులభంగా పెట్టుబడులను వెనక్కు తీసుకోగల సౌకర్యాలందించటం ద్వారామేం విదేశాల నుండి ప్రతి సం॥రం 10 బిలియన్ డాలర్లను ఆకర్షించ గలుగుతాం*'' ఇది చాలదన్నట్లుగా ''*పది బిలియన్లేం ఖర్మ... మీరలా చూస్తూ వుండండి చాలు మేం మరిన్ని మొత్తాలను సాధిస్తాం*''. ఈ ఒక్క విషయంలో మాత్రం సందేహమే వలదు. అమెరికన్ల బూట్లు నాకటం, గరిష్ట లాభాలార్జించే ప్రభుత్వరంగ సంస్థలను మూడణాలకు, నాలుగణాలకు ధారపోస్తూ పెట్టుబడులను హరించేయటం, మూల ధన ఖాతాపై రూపాయి మార్పిడికి అవకాశం కల్పించటం. ఇవన్నీ విదేశీ పెట్టుబడులను భారీగా ఆకర్షించనీయక చస్తాయా మరి!!

పెద్ద మనుషులారా! ఇది ఎంచక్కగా వుంది. అరగాసి ఫలితాన్నీ ఇవ్వకున్నా మీరు గత దశాబ్ది పొడవునా ఈ సరళీకరణ మంత్రాన్నే పదే పదే జపిస్తూ వచ్చారు. ఎగుమతులు పెనుగంతు వేసినప్పటికీ గత సం॥రం జి.డి.పి. పెరుగుదల రేటు మరింతగా పడిపోయింది.

అంటే 1998-99లోని 6.6 శాతం నుండి 2000-2001లో 6 శాతానికి పడిపోయింది. పైగా మీ అడ్డగోలు వాదనలన్నీ డబ్బు సంచుల రాయుళ్ళ చిలకపలుకుల ఆధారంగానే తప్ప సవ్యమైన ఆర్థిక సూత్రాల మీద ఆధారపడటం లేదు. దేశావసరాలు, దేశ ప్రజల సంక్షేమం కాకుండా డబ్బు సంచులు మీకు పారేస్తున్న భారీ ఫీజులే మీ తర్కాన్ని మొత్తంగా నిర్దేశిస్తున్నాయి.

మొదటగా, ఎగుమతులపై మీ ఆర్భాటం పూర్తిగా పక్కతోవ పట్టింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని ప్రస్తుత క్షీణత దాని అభివృద్ధిని మరింతగా కుంగదీస్తుంది. పైగా రాన్రానూ రూపాయి విలువ మరింతగా కుంగిపోవటం, విదేశాలలో గొంతు కోసుకునే పోటీ, వ్యాపార నిబంధనలు సామ్రాజ్యవాద దేశాలకు అనుకూలంగా భారీగా మొగ్గుదల చూపడం వంటి వాటిని బట్టి చూస్తే, ఎగుమతుల నుండి లాభాలు అనేవి వట్టి భ్రమ మాత్రమే. ఇక సమాజంలో అత్యున్నత స్థానంలోని 5 శాతం మంది ప్రేరేపించగల అభివృద్ధి మాటకొస్తే... వారి వ్యయమంతా ప్రధానంగా విలాస వస్తువులపైనే వుంటుంది. ఇపుడు వినియోగదారీ మార్కెట్లోని అన్ని రంగాల్లో చౌక దిగుమతులు వెల్లువెత్తుతుండటంతో ఈ సంపన్నుల వ్యయంలో చాలా భాగం విదేశీ సరకులకు మార్కెట్‌ని మరింతగా పెంచేందుకే తప్ప మరెందుకూ పనికిరాదు. ఇక దేశీయ ఉత్పత్తులనేవి దేశీయ బక్కప్రాణుల వినియోగానికే పరిమితమవుతాయి.

ఇక, పెట్టుబడిని ప్రోత్సహించే విదేశీ పెట్టుబడి విషయానికొస్తే, అటువంటి విదేశీ పెట్టుబడిలో అధిక భాగం సట్టా పెట్టుబడుల వైపుకు, లేక వునికిలో వున్న పరిశ్రమల కొనుగోలు కోసం తరలిపోతూ వచ్చిందని, ఈ రెండింటిలో ఏదీ కూడా ఉపాధి కల్పనని సృష్టించలేక పోయిందని గత దశాబ్ది తేల్చి చెప్పేసింది. అందుకు భిన్నంగా విదేశీ సంస్థలు పెనులాభాలు ఆర్జించి వాటి పెట్టుబడులకు మించిన అపార మొత్తాలను దేశం నుండి బయటకు తరలించాయి. నిరంతరం ద్రవ్యోల్బణాన్ని, భారీ ఎత్తున సర్వీస్ ఛార్జీలను పెంచుతున్న విదేశీ రుణం సైతం పెట్టుబడిని సృష్టించటం మాట అటుంచి మన వనరులు పూర్తిగా హరించుకు పోయేలా చేస్తోంది. పైగా, దేశీయ పెట్టుబడిలా గాక, విదేశీ పెట్టుబడికి మరో ప్రధాన ప్రతిబంధకముంది. మనదేశం లోపల డబ్బు చలామణిని తొలగిస్తూ విదేశీ పెట్టుబడి ఆర్జించే రాబడులు, లాభాలు మరో దేశంలో జమవుతాయి.

కాబట్టి, మీ వాదనలు పసలేనివే కాదు. మీ యజమానులు డిమాండు చేస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణలకు రాజబాట పరిచేందుకోసం అబద్ధాలతో, అర్ధసత్యాలతో, కపటత్వంతో మీ వాదనలు కూడి వుంటున్నాయి. ప్రస్తుత బడ్జెట్ ప్రజారాసులకు ఏ మాత్రమూ 'మెరుపుకల' కాదు. ప్రజల జీవన ప్రమాణాలపై దాని ప్రభావ కోణంలోంచి మాత్రమే అది పీడకల కాదు. సైన్యానికి, పారామిలటరీ, పోలీస్ బలగాలకు అపార మొత్తాలను కేటాయించిన దాని ఫాసిస్ట్ సారాంశం నుండి చూసినా ఈ బడ్జెట్ ప్రజారాసుల పాలిటి పీడకలలాగే వుంది.

మరింత స్పష్టమైన చిత్రణ కోసం ఈ బడ్జెట్ వివరాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

## ప్రజలపై పెనుదాడి

ముందే చెప్పినట్లుగా భారతదేశ జనాభాలో 85 శాతంగా వుంటున్న వ్యవసాయదారుల, కార్మికుల, మధ్యతరగతి ప్రజల, చిన్న వ్యాపారులపై ఓ క్రమపద్ధతిలో జరుగుతున్న దాడిని ఈ బడ్జెట్‌లో చూస్తాం. ఎలాగంటే...

**తపాలా :** మరోసారి తపాలా పన్నులను 25 నుండి 100 శాతం దాకా భారీగా పెంచారు. పేదవారి అసలు సిసలు తపాలాగా పేరుపడ్డ పోస్ట్‌కార్డుల రేటును 50 పైసలకు గరిష్టంగా పెంచారు.

**గ్రామీణ పెట్టుబడి :** ఇప్పటికే దారుణం అనిపించదగ్గ రీతిలో, వినియోగం కాకుండా వృధాగా వుంటున్న 'గ్రామీణ పెట్టుబడి' ఈ బడ్జెట్‌లో వాటా మరింతగా పడిపోయింది. గత సం॥రం వాస్తవంగా మంజూరయింది కేవలం 30 శాతమే కాగా అలా మంజూరయిన పెట్టుబడి నిధి పంపిణీ మరింత తక్కువగా వుంది.

**ఆహార ధాన్యాల పంపిణీ ప్రైవేటీకరణ :** ఆహార ధాన్యాల సేకరణ, పంపిణీ విధానాన్ని ఎత్తేయ్యాల్సిందిగా ఈ బడ్జెట్ ప్రతిపాదించింది. ఇపుడు భారత ఆహార సంస్థ (యఫ్.సి.ఐ.) ఒక కోటి టన్నుల మేరకు ధాన్యం ముందస్తు నిల్వ (సెక్యూరిటీ రిజర్వు) ను కొనసాగించడానికి అవసరమైన ధాన్యాన్ని మాత్రమే సేకరిస్తుంది. ఇప్పటికే యఫ్.సి.ఐ. వద్ద 5 కోట్ల టన్నుల భారీస్థాయిలో ధాన్యం పేరుకుపోయి వుండటం చూస్తే రాబోయే కొద్ది సం॥లలో ధాన్య సేకరణ అస్సలుండదనే అర్థం. పైగా, దేశ వ్యాప్తంగా ఆహార ధాన్యాల తరలింపు, పంపిణీని నిబంధనల నుండి విముక్తం చేసి ప్రైవేట్‌పరం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన వుండే వారికి సబ్సిడీల కోసం 'ఆర్థిక సహాయం' అందించే రాష్ట్రాలకే ప్రజా పంపిణీ వ్యవస్థ (పి.డి.యస్.) సేవా నిర్వహణ లక్ష్యాన్ని వదిలేశారు. అంటే పి.డి.యస్.ని ప్రాథమికంగానే రద్దు చేసినట్లే దీనర్థం. అదే సమయంలో పి.డి.యస్.లను స్వాధీనపర్చుకునే ప్రైవేట్ ఏజెంట్లకు భారీగా రాయితీలు ఇస్తారు. ఇప్పటికే పి.డి.యస్. నుంచి జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ళు గత మూడు సం॥లలో 50 నుంచి 70 శాతానికి పడిపోయాయి. ఇది మరింతగా క్షీణిస్తుంది కూడా.

పైగా, ఆహార ధాన్యాల సేకరణ ప్రైవేటీకరణ అనేది దురాశాపరులైన వ్యాపారుల దయాదాక్షిణ్యాల విష వలయంలోకి వ్యవసాయదారులను నెడుతుంది. ఇప్పటికే గత సీజన్‌లో యఫ్.సి.ఐ. సహాయ నిరాకరణ వల్ల ధాన్యం ధరలు పడిపోయి రైతులు విలవిలలాడారు. ఇదే భారీగా వరుస ఆత్మహత్యలకు దారితీసింది. ధాన్య సేకరణను మొత్తంగానే ప్రైవేట్ వర్తక రాబందుల చేతిలో పెడితే జరిగే వినాశకర ఫలితమేమిటో ఎవరయినా ఊహించుకోవచ్చు.

**కార్మికులు : ఉద్యోగులు**

కార్మిక వర్గంపై, ఉద్యోగులపై ఈ బడ్జెట్ వరుసదాడులు మొదలు పెట్టేసింది.

మొదటగా, బడ్జెట్ భారీ స్థాయిలో ఉద్యోగాల తొలగింపుకు

పథకమేసింది. బ్యాంకింగ్ సర్వీసుల రిక్రూట్‌మెంట్ బోర్డు రద్దయి పోయింది. రాబోయే 5 సం॥లలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను 10 శాతం మేరకు తగ్గించడం ద్వారా ప్రతి సం॥రం కేంద్ర ప్రభుత్వోద్యోగాలలో 2 శాతం కోత కోయడానికి అది పథకమేసింది.

రెండు. బడ్జెట్ నూతన కార్మిక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానం పరిశ్రమలను మూసివేయడానికి, ఉద్యోగులను తొలగించడానికి, లాభదాయకం కాని విభాగాల మూసివేతకు సంపూర్ణ స్వేచ్ఛను కల్పిస్తోంది. గతంలో 100 మంది కార్మికులను నియమించుకున్న కంపెనీలకే ఈ విధానాన్ని అనుమతించి వుండగా, ఈ బడ్జెట్ 1000 మంది కార్మికులున్న కంపెనీలకు కూడా దీన్ని వర్తింపజేసింది. అంటే వాస్తవంగానే పారిశ్రామిక సంఘటిత రంగంలో 95 శాతంపైగా కంపెనీలన్నింటికీ ఈ విధానం వర్తించబడుతుంది.

మూడు. ఈ బడ్జెట్ బయటనుండి విస్తృతంగా కార్మికులను తెచ్చుకోవడానికి, కాంట్రాక్టు లేబర్‌ని విచక్షణా రహితంగా ఉపయోగించుకోవడానికి కంపెనీలకు అనుమతిస్తోంది.

నాలుగు. పారిశ్రామిక వివాదాల చట్టాన్ని సైతం సవరిస్తామంటూ కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించాడు.

ఐదు. ఈ బడ్జెట్ ప్రావిడెంట్ ఫండ్‌పై వడ్డీని 1.5 శాతం మేరకు భారీగా తగ్గించి వేసింది. (గత సం॥రం తగ్గించిన 1 శాతం కంటే ఇది ఎక్కువ). ఇక దీనిపై వడ్డీరేటుని 9.5 శాతంకు కుదించి వేసింది. ఇది ప్రభుత్వం ప్రకటిస్తున్న వార్షిక ద్రవ్యోల్బణం కంటే కొంచెం ఎక్కువ. ఇది ఒక కోటిమంది కార్మికుల పొదుపు మొత్తాలను దెబ్బతీస్తుంది. ఈ తగ్గింపుతో వీరు తమ 70,000 కోట్ల రూ॥ల పొదుపు మొత్తంలో 1,750 కోట్ల రూ॥లను కోల్పోనున్నారు. ఈ ప్రావిడెంట్ ఫండ్‌పై వడ్డీరేట్లను నిర్ణయించడాన్ని భవిష్యత్తులో నిపుణుల కమిటీకి వదిలివేయటం జరుగుతుందని తన బడ్జెట్ ఉపన్యాసంలో పేర్కొనటం ద్వారా ఆర్థికమంత్రి ఈ వడ్డీరేట్లు మరింతగా పడిపోనున్నాయని హెచ్చరించాడు.

ఆరు. ప్రభుత్వరంగ సంస్థల నుండి పెట్టుబడులను పెద్ద ఎత్తున ఉపసంహరించుకోవటం వల్ల కార్మిక శక్తిని భారీగా తొలగించి, కాంట్రాక్ట్ లేబర్‌ని మరింతగా తీసుకురావటం జరుగుతుంది. ఈ సం॥రంలోనే పి.ఎస్.యు.ల నుండి 12,000 కోట్ల రూ॥ల మేరకు పెట్టుబడిని ఉపసంహరింప జేయడానికి బడ్జెట్ పథకమేసింది.

**చిన్నతరహా పరిశ్రమపై దాడి**

ఆటబొమ్మలు, తోలు వస్తువులు, చెప్పులతోపాటు 14 అంశాలను చిన్నతరహా పరిశ్రమల పరిధిలోంచి తప్పించేశారు. కోటి రూ॥ల దాకా అమ్మకాలు జరిపే చిన్నతరహా పరిశ్రమ యూనిట్‌పై వున్న పన్ను మినహాయింపును ఎత్తేశారు. పత్తి దారం బాల్/రోలర్ బేరింగ్, ఆయుధాలు, మందుగుండులకు సంబంధించిన పారిశ్రామిక యూనిట్లు ఈ పరిధిలోకి వస్తాయి. పైగా, చిన్నతరహా పరిశ్రమకు రాయితీలను పూర్తిగా ఎత్తేయాలని, ఖాయిలాపడ్డ పారిశ్రామిక సంస్థల చట్టాన్ని తొలగించాలని, పారిశ్రామిక, ఆర్థిక పునర్నిర్మాణ సంస్థని ముదరచుట్టేయాలని ప్రభుత్వ 'ఆర్థిక సర్వే' సూచించింది.

**మధ్యతరగతి మూలగల్ని పీల్చేయటం**

అనేక ప్రత్యక్ష, పరోక్ష మార్గాల గుండా మధ్యతరగతి ఆదాయాలు, పొదుపులపై దాడి జరుగుతూ వస్తోంది.

మొదటగా సం॥నికి లక్ష రూ॥ల పైన సంపాదిస్తున్న వారికి మరిన్ని పన్ను అలవెన్సులు కల్పిస్తూ అంతకు తక్కువ సంపాదన వున్న వారికి నామమాత్రంగా పన్ను తగ్గింపులను కల్పించటం.

రెండు. అధికాదాయ గ్రూపులకు పన్నును మరింతగా తగ్గిస్తూ, బడా వ్యాపారులు బ్యాంకులను నిలువునా ముంచేయడాన్ని, భారీస్థాయి నల్ల ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా నిర్లక్ష్యం చేస్తూ ఈ బడ్జెట్ పట్టణ మధ్యతరగతికి చెందిన అతిచిన్న స్థాయి ఆదాయపరుడిని సైతం పన్నుల వలయంలోకి తీసుకురావాలని చూస్తోంది. అన్ని పట్టణ ప్రాంతాలకు వన్ బై సిక్స్ విధానాన్ని ఈ బడ్జెట్‌లో వర్తింప జేయటమైంది. ఆదాయ పన్నుల కేటగిరీలోకి ప్రజలను విస్తృతంగా తీసుకురావడానికి ప్రభుత్వం ఎన్నుకున్న విధానమే ఈ ఒకటి బై ఆరు విధానం. దీని ప్రకారం టెలిఫోన్, లేక సొంత ఇల్లు కలిగివున్న ప్రతి వ్యక్తి ఇక నుండి పన్నుల అధికార్ల పీడన బారిన పడక తప్పదు. పన్నులు చెల్లించాల్సి వున్నా, పన్నులు చెల్లించనవసరం లేకున్నా ఈ కేటగిరీలోని వారంతా ఇపుడు తప్పనిసరిగా ఆదాయపన్ను పత్రాలను పూర్తిచేసి పంపాల్సి వుంటుంది.

మూడు. పోస్టాఫీసు, బ్యాంక్ డిపాజిట్ల వంటి ఆల్‌టైమ్ డిపాజిట్ల పైని వడ్డీలపై పన్నును మినహాయించారు. ఇతర ప్రభుత్వ పొదుపు పథకాలన్నింటిపై వడ్డీని 1.5 శాతం దాకా తగ్గించారు. ఇది మధ్యతరగతి ప్రజల, పదవీ విరమణ చేసిన ప్రజల చిన్న పొదుపు మొత్తాలను బాగా దెబ్బతీస్తుంది. ఉదా॥ ఈ పథకాలలో నాలుగు లక్షల రూ॥ల పరిధిలో పొదుపు పెట్టిన వ్యక్తి వడ్డీ రీత్యా సం॥కి 8,000 రూ॥లను నష్టపోవాల్సి వస్తుంది. అంటే వారి గత ఆదాయంలో దాదాపు 2) శాతాన్ని కోల్పోతారు.

నాలుగు. హేతుబద్ధీకరణ పేరిట ఈ బడ్జెట్ అనేక విలాస వస్తువులపై ఎక్సైజ్ పన్నును తగ్గిస్తూనే, ప్రధానంగా మధ్యతరగతి ప్రజలను దెబ్బతీసేలా సాధారణ వాడకానికి సంబంధించిన అనేక వస్తువులపై ఎక్సైజ్ పన్నును రెట్టింపుకి అంటే 8 నుంచి 16 శాతం వరకు పెంచేసింది. ఇలా పెంచిన పన్ను ద్వారా కేవలం ఒక సం॥ర కాలంలోనే 4,677 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని వారినుండి లాగవచ్చు.

**ద్రవ్యోల్బణం :** అంతిమంగా ద్రవ్యోల్బణంలో పెనుగంతు విస్తృత ప్రజారాసుల నిజ ఆదాయాన్ని దారుణంగా హరించి వేసింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 1999-2000తో పోలిస్తే ద్రవ్యోల్బణ రేటు 2000-2001 సం॥లో రెట్టింపైంది. అంటే 3.9 నుంచి 8.3 శాతానికి అమాంతంగా పెరిగిపోయింది. అయితే వాస్తవంగా ద్రవ్యోల్బణ రేటు ప్రత్యేకించి నిరుపేద వర్గాలకు సంబంధించి చూస్తే మరింత అధికంగానే వుంటుంది.

## సంపన్నులకు భారీ నజరానాలు

ప్రజారాసులకు సంబంధించిన పరిమిత ఆదాయ వనరులను సైతం పీక్కుంటూనే మరోవైపున బడ్జెట్ సంపన్నులకు, ప్రత్యేకించి విదేశీ పెట్టుబడికి దానితో అంటకాగుతున్న బడా బూర్జువా వర్గానికి వెండిపళ్ళెంలో పెట్టి మరీ లెక్కలేనన్ని బహుమతులను అందిస్తోంది. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించటం, పెట్టుబడి మార్కెట్లను (ఉదా॥ స్టాక్ ఎక్చేంజ్) ప్రోత్సహించటం, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చటం అనే పేరుతో ఇదంతా జరుగుతోంది.

**ఆదాయ/కార్పొరేట్ పన్నుల తగ్గింపు**

ఆదాయ/కార్పొరేట్ పన్నులపై నున్న 15 శాతం అదనపు పన్నును రద్దు చేయటం ద్వారా, పన్ను ఛార్జీలో తగ్గింపు ద్వారా సంపన్న వర్గాలకి ఈ బడ్జెట్ 5,500 కోట్ల రూ॥లను అప్పనంగా అందించింది. ఆదాయం ఎంత అధికంగా వుంటే అంత ప్రయోజనాన్ని చేకూర్చే ఏర్పాటే ఇది. ఉదా॥కు 10 లక్షల రూ॥ల ఆదాయం కల్గిన వారికి పన్ను తగ్గింపు ద్వారా నెలకు 3,500 రూ॥లు అదనంగా మిగులుతుంది.

**వ్యవసాయ వాణిజ్యానికి రాయితీల జల్లు**

* పండ్లు, కూరగాయల ఆధారంగా తయారయే అన్ని ఆహార పదార్థాలపైనా ఎక్సైజ్ పన్నుని పూర్తిగా మినహాయించేశారు. ఊరగాయలు, పచ్చళ్ళు, టమోటా సాస్, పళ్ళరసాలు మొదలైన విస్తృత స్థాయి ఉత్పత్తులకు కూడా ఇది వర్తిస్తుంది.

* నాణ్యమైన నిల్వ సౌకర్యాల నిర్మాణానికి ప్రోత్సాహం వుంటుంది.

* ఏ రకమైన కొనుగోలు, అమ్మకాల పన్నులు లేకుండా రైతుల నుండే నేరుగా ధాన్యం కొనేందుకు బడా ఆహార ధాన్యాల కంపెనీలకు అనుమతిచ్చారు. ఇక ఆహార ధాన్యాల నిర్వహణ, నిల్వ, రవాణా రంగాల్లో పెట్టుబడులు పెట్టిన వారికి పన్ను రాయితీలుంటాయి. ఆహార పంపిణీ వ్యాపారంలో ప్రవేశించడానికి పొంచుకుని వున్న కార్గిల్ వంటి బడా ఆహార ధాన్య కంపెనీల ఆదేశాలతో ఇదంతా జరుగుతోంది.

* ప్రైవేట్ విత్తన కంపెనీలను భూ పరిమిత చట్టాల నుండి మినహాయించే ప్రతిపాదన కూడా వుంది. దేశ విత్తన వ్యాపారంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించిన మాన్‌శాంటో లాంటి బహుళజాతి కంపెనీలకు ఇది నేరుగా మేలు చేకూరుస్తుంది.

* చక్కెర పంపిణీ, మార్కెటింగ్‌లపై గల నియంత్రణలన్నింటినీ రద్దు చేయాలనే ప్రతిపాదన కూడా బడ్జెట్‌లో చేరింది.

**కార్ల పరిశ్రమకు రాయితీలు**

శక్తివంతమైన బహుళజాతి సంస్థల ఆధిపత్యంలో వున్న ఈ పరిశ్రమ భారీ ఎత్తున రాయితీలను పొందింది.

* ఎక్సైజ్ పన్నును 24 నుండి 16 శాతానికి తగ్గించారు.

* నూతన వాణిజ్య వాహనాలపై 50 శాతం త్వరిత తరుగుదల (పన్ను నుంచి మినహాయింపు కోసం కొన్ని కొత్త యంత్ర సామాగ్రి విలువను తీసివేసి వార్షిక లాభాలను లెక్కకట్టి చూపటం) ను ఒక సం॥కి అనుమతించటం. దీనివల్ల ప్రస్తుత సం॥రంలో ప్రజలను కార్లు కొనేలా ప్రోత్సహించటం.

దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్న యం.యస్.సి.ల ప్రయోజనాలు కాపాడేందు కోసం కార్ల, స్కూటర్ల దిగుమతిపై కస్టమ్స్ పన్నును 35 నుంచి 60 శాతానికి పెంచివేయటం.

**విదేశీ పరోక్ష పెట్టుబడుల చొరబాటును ప్రోత్సహించటం**

ఇది రెండు రకాలుగా జరుగుతుంది. పోర్ట్‌ఫోలియో (వాటా) పెట్టుబడులపై పరిమితిని పెంచటం ద్వారా, కేపిటల్ మార్కెట్స్ (స్టాక్ ఎక్చేంజీలు)లోని పెట్టుబడులకు భారీస్థాయిలో పన్ను రాయితీని కల్పించటం ద్వారా ఇది జరుగుతుంది.

* పోర్టుఫోలియో మదుపు మార్గంలో, భారతీయ కంపెనీలలో గరిష్ఠ వాటా మొత్తాన్ని 40 నుంచి 49 శాతానికి పెంచుకునేందుకు విదేశీ పరోక్ష పెట్టుబడులకు అనుమతి కల్పించటం జరుగుతుంది. ఈ విధంగా విదేశీ పెట్టుబడి భారతీయ పరిశ్రమలను (దళారీ లేక ఇతర పరిశ్రమలు) కొనేసేందుకు ఈ బడ్జెట్ మరింతగా వీలు కల్పిస్తున్నది.

* డివిడెండ్ల రూపంలోని ఆదాయంపై పన్నును 20 నుండి 10 శాతంకి అంటే సగానికి తగ్గించారు.

* ప్రాథమిక మార్కెట్‌లో (అంటే స్టాక్ ఎక్చేంజ్‌లోకి వచ్చిన నూతన షేర్లు) తిరిగి మదుపుపెట్టిన పెట్టుబడి లాభాలపై పన్ను పూర్తిగా ఎత్తేశారు.

* విశ్వాసాన్ని కల్గింపజేసే చర్యల్లో భాగంగా ఈ బడ్జెట్ కంపెనీల అమెరికన్/గ్లోబల్ డిపాజిట్ రిసీప్ట్‌ల (ఏ.డి.ఆర్.లు, జి.డి.ఆర్.లు) మార్పిడీని రెండు రకాలుగా అనుమతించింది. దీని ప్రకారం భారతీయ సంస్థల వాటాలు ఇపుడు విదేశీ మార్కెట్లలో నమోదయిన ఏ.డి.ఆర్. లేక జి.డి.ఆర్.ల రూపంలో మార్చబడతాయి.

* మౌలిక సదుపాయాల కల్పనలో నిమగ్నమై వున్న సంస్థల వాటా పెట్టుబడులలో పెట్టిన మదుపులకు ప్రోత్సాహకాలు అందజేయటమైంది.

ఈ చర్యలన్నీ భారతీయ పరిశ్రమలు, వాణిజ్యంలోకి విదేశీ పెట్టుబడుల (ఈరోజు ఇవి భారత స్టాక్ ఎక్చేంజ్‌లలో ఆధిపత్యం కలిగి స్టాక్ మార్కెట్‌ని నిర్దేశిస్తున్నాయి) విస్తృత చొరబాటుకు ప్రాథమికంగా వీలు కల్పిస్తున్నాయి.

**దిగుమతి పన్నులపై భారీ కోత**

ఈ బడ్జెట్ విదేశీ పెట్టుబడి చొరబాటుకు వీలు కల్పించటమేగాక, దిగుమతి పన్నులను తగ్గించటం ద్వారా భారతీయ మార్కెట్‌లోకి విదేశీ సరకులు వెల్లువెత్తడానికి పూర్తిగా

తలుపులు తెరిచేసింది. ఆర్థికమంత్రి వచ్చే మూడేళ్ళలో దిగుమతి పన్ను గరిష్ఠ రేటు ప్రస్తుతమున్న 35 శాతం నుండి కేవలం 20 శాతంకి కుదిస్తామని చెప్పేంత వరకూ పోయాడు. ఈ బడ్జెట్‌లోనే 10 శాతంగా వున్న అదనపు సుంకాన్ని తొలగించేశారు. అందుచేత గరిష్ఠ రేటు 38.5 నుంచి 35 శాతానికి పడిపోయింది. పైగా నేత పని యంత్ర సామాగ్రి; పట్టు, నూలు సామాగ్రి; సింథటిక్ ఫైబర్ - తయారీలో వాడే డి.ఎమ్.టి., పి.టి.ఏ. కాప్రోలాక్టమ్; సోడాయాష్; ముడి వజ్రాలు; సానబెట్టిన రత్నాలు; ఎల్.ఎన్.జి.; చిత్ర నిర్మాణ సామాగ్రి వంటి వాటిపై పన్నులను 10-15 శాతం మేరకు తగ్గించటం ద్వారా విదేశీ వుత్పత్తిదారులకు 2,128 కోట్ల రూ॥ల భారీ బహుమతిని అప్పగించేశారు.

**పెప్సీ, కోకాకోలాలకు రాయితీలు**

శీతల పానీయాలపై, శీతల పానీయ ద్రావణాలపై, వెండింగ్ మిషన్లపై ఎక్సైజ్ పన్నును 24 నుంచి 16 శాతానికి తగ్గించారు.

**పన్ను రాయితీలు**

అనేక రకాల పరిశ్రమలకు పన్ను రాయితీలను కల్పించారు.

* రోడ్లు, హైవేలు, రైల్వేలు, జలశుద్ధి, సరఫరా, సాగునీరు, పారిశుద్ధ్య రంగం విమానాశ్రయాలు, ఓడ రేవులు, జలమార్గాలు, పారిశ్రామిక కేంద్రాలు, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా; ప్రత్యేక ఆర్థిక మండలుల అభివృద్ధి వంటి అత్యంత ప్రధానమైన మౌలిక సదుపాయాల రంగానికి 10 సం॥ల పన్నురాయితీ కల్పించారు.

తిరిగి, ఈ పన్ను రాయితీల వల్ల విదేశీ పెట్టుబడిదారులు, వాటితో ముడిపడివున్న బడా దళారీలే ప్రాథమికంగా లాభపడతారు. ఎందుకంటే ఇటువంటి కీలక రంగాల్లోకి ప్రవేశించగల స్థాయి పెట్టుబడి వీరి సొంతమే మరి.

**సమాచార సాంకేతిక రంగం - రాయితీలు**

* కస్టమ్స్ సుంకం 25 నుంచి 15 శాతంకి కుదించారు.

* కేవలం 5 శాతం ప్రాథమిక కస్టమ్స్ సుంకంతో దిగుమతి చేసుకోదగిన యంత్రాలు, యంత్ర సామాగ్రి జాబితాలో మరో 33 వస్తువులను చేర్చారు.

* టెలికమ్యూనికేషన్స్ రంగానికి మార్చి 2000 నాటికి ముగిసిన 5 సం॥ల పన్ను రాయితీని 2003 మార్చి వరకు పొడిగించారు.

* పలు ప్రభుత్వ విభాగాలను, శాఖలను 2003 మార్చి నెల నాటికి కంప్యూటరీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కంప్యూటర్ హార్డ్‌వేర్ పరిశ్రమకు భారీ మార్కెట్‌ని సృష్టిస్తుంది.

దిగుమతి పన్నుల తగ్గింపు ఇప్పటికే దిగుమతుల తాకిడికి నలిగిపోతున్న దేశీయ హార్డ్‌వేర్ ఉత్పత్తిదారులను తీవ్రంగా దెబ్బతీస్తుంది.

పైగా, ఈ ప్రధాన బహుమతులకు తోడు, ఆర్థికమంత్రి ఈ బడ్జెట్‌లో అనేక ఇతర రాయితీలను కల్పించడమేగాక, బడా వ్యాపారులు బలంగా డిమాండ్ చేస్తూ వస్తున్న పలు భవిష్యత్ పథకాలను సైతం ప్రకటించాడు. మందులపై ధరల నియంత్రణలను ఎత్తివేయటం, పెట్రోలియం రంగంలో నిర్వహణా ఛార్జీల తొలగింపుకు పథకం వంటివి వీటిలో కొన్ని.

**పేదల, ధనికుల మధ్య పెరుగుతున్న అంతరం**

ధనికులకు, పేదలకు మధ్య సంపద విషయంలో ఇటువంటి భయంకరమైన అతిచర్యలను ప్రోత్సహించేలా బడ్జెట్ తయారై వున్నందువల్ల సహజంగానే రాజ్య యంత్రాంగాన్ని బలోపేతం చేసేందుకై బడ్జెట్ భారీ నిధుల్ని కేటాయించింది కూడా. ప్రజల్లో రేగే బలమైన తిరుగుబాట్లను అణచడానికి ప్రజారాసుల ఆగ్రహం నుంచి ధనవంతులను రక్షించడానికి ఈ భారీ నిధులు అవసరం ఎంతైనా వుంది మరి.

## ఫాసిస్టు బడ్జెటు

ఒకవైపున సంక్షేమ రంగంపై వ్యయాలు పూర్తిగా కుదింపబడుతుండగా, మరోవైపు రక్షణ, పారామిలటరీ బలగాలకు, రాష్ట్రాల పరిధిలోని పోలీస్ యంత్రాంగానికి కేంద్ర సహాయం పేరిట నిధులు భారీగా పెరుగుతున్నాయి.

రక్షణ రంగ వ్యయంలో పెరుగుదల నిరాఘాటంగా సాగిపోతున్నది. గత సం॥రం కంటే ఈ సం॥రం ఈ వ్యయం 14 శాతం పెరిగి 62,000 కోట్ల భారీ స్థాయికి చేరుకుంది. దీంట్లో 56 శాతం సైన్యానికే పోతోంది. సైన్యం దేశ రక్షణ కోసం గాక భారత ప్రజలకు వ్యతిరేకంగా సాగిస్తున్న కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కార్యకలాపాలకే దీన్ని ప్రధానంగా వాడుతోంది. ఈ మొత్తం వ్యయంలో 20,000 కోట్ల రూ॥లను అధునాతన హై-టెక్ సామాగ్రి కొనుగోలుకే వెచ్చిస్తున్నారు. ప్రత్యేకించి పైలెట్ లేని నిఘా విమానాలు థర్మల్ కెమెరాలు వంటి భారీ ఖర్చుతో కూడుకున్న పరికరాల కొనుగోళ్ళకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ తరహా పరికరాలన్నీ తీవ్రవాద వ్యతిరేక చర్యల్లోనే ప్రధానంగా వాడతారు.

ఇక పారామిలటరీ బలగాలపై వ్యయం 12 శాతంకి అంటే 651 కోట్లకి పెరిగి ఈ రంగం మొత్తం వ్యయం 6,500 కోట్లకు చేరుకుంది. స్పెషల్ బలగాలు, కమాండోలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, జమ్మూ కాశ్మీర్ లైట్ ఇన్‌ఫ్రాంటీ వంటి బలగాలకు కేటాయించబడుతున్నవి దీంట్లోకి రావు. మొత్తం కలిపితే పారా మిలటరీపై వ్యయం వాస్తవంగా 8,000 కోట్ల రూ॥లకు చేరుకుంటుంది.

ఇక, పోలీస్‌శాఖ రాష్ట్రాల జాబితాలో వుండి, దాని ఖర్చులు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జరుగుతున్నప్పటికీ ప్రజలపై పోలీస్‌శాఖ దాడిచేసే శక్తిని పెంచేందుకోసం ఈ సం॥రం కేంద్ర బడ్జెట్‌లో 2,432 కోట్ల రూ॥లు కేటాయించారు. ప్రజల ఆగ్రహావేశాల నుండి పాలక వర్గాన్ని కాపాడేందుకు బరిలో నిలబడేది ముందుగా పోలీస్ శాఖే. పోలీస్‌శాఖ ఆయుధ శక్తిని పెంచేందుకోసం 'ఆధునీకరణ' పేరిట బడ్జెట్ మరో 1,000 కోట్ల రూ॥లను కేటాయించింది. 'రాష్ట్రాలకు ప్రత్యేక సహకారం' పేరిట మరో 743

కోట్ల రూ॥లను కేటాయించింది. ఇక పోలీసులకు నివాసం కోసం 3,294 కోట్ల రూ॥లను, పోలీస్‌లకు భవనాల నిర్మాణానికి 305 కోట్ల రూ॥లను బడ్జెట్ కేటాయింపులు జరిపింది. ఈ కేటాయింపులు గత సం॥రం కంటే ఈసారి 32 శాతం మేరకు భారీగా పెరిగాయి.

## ప్రత్యామ్నాయం ఏమిటి?

2001-2002 బడ్జెట్ ఒక సంపూర్ణ ప్యాకేజీయే. ప్రజలను చావుదెబ్బతీస్తూ, బడా వ్యాపారులకు, ఉన్నత వర్గాలకు అపార లాభాలందిస్తూ, అసమానతల నుంచి పుట్టుకొస్తున్న ప్రజల తీవ్ర అసమ్మతిని అణచివేయడానికిగాను రూపొందిన సర్వ సమగ్ర పథకమే ఈ బడ్జెట్. సారాంశంలో సరళీకరణ దశ మొదలైన తర్వాత అన్ని బడ్జెట్ల స్వభావం ఇలాగే వుంది. ఈ బడ్జెట్లన్నింటిలో సంక్షేమ రంగంపై వ్యయాల్ని, పేదలకు సబ్సిడీలను పథకం ప్రకారం తొలగిస్తూ వచ్చారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌కి, గతంలోని వాటికి తేడా అల్లా ఏదంటే పై చర్యలన్నింటిలో ఇది పెనుగంతు వేసింది. సామ్రాజ్యవాదులు నిర్దేశించిన రెండో విడత ఆర్థిక సంస్కరణలను నేటి బడ్జెట్ వాస్తవంగానే తలకెత్తుకున్నది.

అయితే ఈ బడ్జెట్ ప్రకటించుకున్న ఉద్దేశ్యాలబట్టి చూసినా సరే అదొక అసమర్థపు జీవయాత్రలాగే తేలిపోయింది. బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన వెనువెంటనే స్టాక్ ఎక్ఛేంజ్ ధరలు కుప్పగూలిపోవటం మనం చూశాం.

ప్రస్తుత ఆర్థిక సంస్కరణలు దేశానికి వినాశకరమే. అయితే సరళీకరణ దశ కన్నా వెనకటి కాలానికి పోవటమన్నది సమాధానం కాదు. మౌలిక మార్పు ఒక్కటే పరిష్కారం. ప్రజారాసుల కొనుగోలు శక్తిని పెంచి, విదేశీ పెట్టుబడి వెల్లువను ఆపి పనికిరాని, అనుత్పాదక వ్యయానికి అంతంపలికే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవడమే సరైన పరిష్కారం.

ఈరోజు ఈ బడ్జెట్‌కి సంబంధించిన దుష్ప్రభావం సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్న గెరిల్లాజోన్లలో ఏ మాత్రం కానరావటం లేదు. ఇక్కడ ప్రజలు సంఘటితమయ్యారు. వారి సాయుధశక్తే వారు బేరమాడేందుకు ప్రధానశక్తిగా పనిచేస్తోంది. ఈ సాయుధశక్తే అక్కడ ఆర్థిక విధానాల అమలును నిర్దేశిస్తోంది తప్ప ప్రభుత్వ అధికారం కాదు. వేతనాల రేట్లు, వ్యవసాయం, ఇతర సరకుల ధరలు వంటివి అక్కడి ప్రజల సాయుధ శక్తి ద్వారా నిర్ణయింపబడుతున్నాయి. ఇక వ్యవసాయం, అభివృద్ధి కార్యక్రమాలు వంటివి ప్రభుత్వ ఉదారం వల్ల కాక ప్రజల సహకార ప్రయత్నాల మీద ఆధారపడుతున్నాయి. ఇక్కడ ప్రజలు క్రమంగా తమ భవిష్యత్తును తమ చేతుల్లోకే తీసుకుంటూ, గెరిల్లాజోన్లను విముక్తి ప్రాంతాలుగా నిర్మించటం ద్వారా ఈ దోపిడీ వ్యవస్థ పీడనను పారద్రోలుతున్నారు. అప్పుడు మాత్రమే నేడు కొనసాగుతున్న వ్యవస్థకు అసలైన ప్రత్యామ్నాయంగా ఒక నిజమైన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ ప్రారంభం అవుతుంది.

## భారీ అమ్మకం

ఈ బడ్జెట్ విదేశీ పెట్టుబడికి దేశాన్ని పూర్తిగా అమ్మేయదగినంత శక్తి లేనప్పటికీ, మే 9న కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగ ఉత్పత్తులు, బ్యాంకింగ్ వంటి అత్యంత కీలక రంగాలను సైతం విదేశీ ఆజమాయిషీకి భారీస్థాయిలో వదిలిపెడుతున్నట్లు ప్రకటించింది.

**ఈ నూతన విధానం ప్రకారం....**

* 26 శాతం విదేశీ వాటాలు కల్గిన ప్రైవేట్ పరిశ్రమకు రక్షణ సామాగ్రిని ఉత్పత్తి చేయడానికి అనుమతించటమైంది. ఇది వాస్తవంగానే దేశ మందుగుండు కర్మాగారాలను కొనేయడానికో, లేక వాటిని దివాళీ తీయించడానికో దారి తీయిస్తుంది.

* బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడికున్న పరిమితిని అసాధారణ రీతిలో 20 నుండి 49 శాతంకి పెంచారు. దీంతో అనేక దేశీయ బ్యాంకులను విదేశీ బ్యాంకులు కొనేయటానికి వీలు చిక్కింది.

* మందుల, ఔషధాల తయారీ రంగంలో, వైమానిక రంగం, పట్టణాభివృద్ధి, హోటళ్ళు, టూరిజం, కొరియర్ సర్వీసులు, భారీస్థాయి ప్రజా రవాణా రంగం వంటి వాటిలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించేశారు. అంటే ప్రజారవాణా వంటి కీలకమైన సేవారంగం సైతం విదేశీ పెట్టుబడి పరమై పోయింది.

* ఇంటర్నెట్ సర్వీస్‌ని అందించే సంస్థలు (ఐ.యస్.పి.లు) రేడియో పేజింగ్, బాండ్‌విడ్త్ వంటి రంగాల్లో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించారు.

* విదేశీ మారకద్రవ్యాన్ని పూర్తి స్థాయిలో స్వదేశానికి పంపించుకునేందుకు ప్రవాస భారతీయులకు అనుమతించారు.

ఇలా ఒకటీ, రెండూ అని కాదు... సామ్రాజ్యవాదులకు దేశాన్ని తెగనమ్ముతుండటంలో పాలకవర్గాలకు హద్దుల్లేకుండా పోతున్నాయి. బడ్జెట్‌ని ఆమోదించి పక్షం రోజులు కూడా కాకముందే పై నూతన చర్యలన్నింటినీ ప్రభుత్వం దొడ్డిదారిన ప్రవేశపెట్టింది. ❑

# గెరిల్లాజోన్ సన్నాహక దశ కర్తవ్యాలను పూరించుకునే దిశలో సాగుతున్న రాయలసీమ డివిజన్

అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలతో ఏర్పడిన రాయలసీమ డివిజన్ 2000 సెప్టెంబర్‌లో తన మొదటి మహాసభను విజయవంతంగా జరుపుకొంది. గెరిల్లాజోన్ సన్నాహక దశ కర్తవ్యాలను పూరించుకోవాలనే లక్ష్యం నిర్దేశించుకొని ఆ దిశగా పయనిస్తోంది. అందుకోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ ప్రజాపునాదిని పెంచుకొంటూ, నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, పి.జి.ఏ. బలోపేతం చేసే కార్యక్రమాలు చేపడుతూ, ముందుకు నడుస్తున్నది. క్రాంతి పత్రికకు అందిన ఆ రిపోర్టును పాఠకులకు అందిస్తున్నాం.

## ప్రజా పోరాటాలు

### తీవ్ర నిర్బంధంలో భూస్వాముల పట్టా భూముల ఆక్రమణ

అనంతపురం జిల్లా ఉద్యమం ప్రారంభం నుండి భూపోరాటాలు అనేకం నిర్వహిస్తూ, శివాయిజమా, దేవునిమాన్యం భూములను ఆక్రమించి ప్రజలు పంచుకొంటున్నారు. ఈ క్రమంలో 1997లో జె.ఆర్.సి. (ఉమ్మడి రీజియనల్ కమిటీ) పట్టాభూములను ఆక్రమించాలని పిలుపునివ్వడంతో అనంతపురం లో ప్రజలు భూస్వాముల పట్టా భూములను ఆక్రమించటం మొదలైంది. పయ్యావుల కేశవ, పరిటాల రవి పట్టాభూములతో పాటు భూస్వాముల పట్టాభూములు ఆక్రమించకుండా బతుకులేదని నిర్బంధంలో సైతం పట్టాభూముల ఆక్రమణ కొనసాగిస్తున్నారు. 2000 సంవత్సరం కోనాపురం వి.ఆర్.సి.యస్., వి.యం.యస్.ల నాయకత్వంలో భూపోరాట కమిటీ ఏర్పరచుకొని గోపాల్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నారాయణరెడ్డి పట్టాభూముల్ని 60మంది ప్రజలు ఎర్రజెండాలతో ఊరేగింపుగా వెళ్ళి భూమిని ఆక్రమించారు. తర్వాత భూస్వాముల డి.యస్.పి. రాజశేఖర్‌తో మంతనాలాడి ఊరిపై మూకుమ్మడిగా వెళ్ళి భూమిని ఆక్రమించారు. దీనితో భూస్వాముల భూముల జోలికి పోవద్దని, పార్టీకి, సంఘ నాయకులకు సహకరించవద్దని నిబంధనలను పెట్టారు. దీనికి సంఘం గట్టిగా నిలబడి ప్రజలకు భూపోరాట అవసరాన్ని అర్థం చేయిస్తూ భూస్వాములను హెచ్చరిస్తూ బహిరంగ మీటింగ్ పెట్టింది. నిర్బంధానికి నిరసనగా భూస్వాముల మొత్తం భూములను హెచ్చరిస్తూ బహిరంగ మీటింగ్ పెట్టింది. భూస్వాముల మొత్తం భూములను బంద్ పెట్టడంతో దిగివచ్చిన భూస్వాములు గోపాల్‌రెడ్డి-14 ఎకరాలు, రామక్రిష్ణారెడ్డి-14 ఎకరాలు, నారాయణ రెడ్డి-20 ఎకరాలు వదులుతాం అని ప్రజలముందు ఒప్పుకున్నారు. నిర్బంధం వల్ల 2000 సం॥ పంపిణీ చేసుకోలేక 2001 సంవత్సరంలో పంపిణీ చేసుకున్నారు. మొత్తం 48 ఎకరాలు భూమిలేని 24 కుటుంబాలు పంచుకున్నారు.

తల్లిమడుగులో భూస్వామి తెలుగుదేశం నాయకుడు అయిన వేపకుంట రాజన్న ప్రజలను మోసం చేస్తూ ప్రజలపై ఆధిపత్యం చెలాయించేవాడు. రైతుకూలీ సంఘం బలపడే కొద్దీ వాడి అవినీతి అక్రమాలపై ప్రజలలో విచారణ చేసి నిలదీయడంతో ఊరు విడచి వెళ్ళిపోయాడు. అక్కడినుండి పోలీసులతో దాడులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలోనే 2001 ఏప్రిల్‌లో వాని 10 ఎకరాల పట్టాభూమిని 40 మంది వ్యవసాయ కూలీలు ఎర్రజెండాలతో ఊరేగింపుగా పోయి భూమిని ఆక్రమించారు. ఇంకా పంపిణీ కాలేదు.

2001 జనవరిలో ముత్తువకుంట్ల టి.డి.పి. రాజకీయ నాయకుడి 25 ఎకరాల పట్టాభూమిని ఆక్రమించారు. ఇందులో ఇతని తమ్ముళ్ళది కొంత భూమి వుంది. దానిని వదిలేయాలని నిర్ణయించు కోవటం జరిగింది.

## ప్రజా పంచాయితీలు

**జి.కె. రాసుపల్లి బోర్ పంచాయితీ :** జి.కె. రాసుపల్లి భూస్వామి, వ్యాపారస్తుడు కత్తి భాస్కర్, సుబ్బరాయుడు మరొకరు కలిసి గవర్నమెంట్ బోర్ ప్రక్కనే మరింత లోతుగా మూడు బోర్లు వేశారు. దాంతో గవర్నమెంట్ బోర్‌లో నీళ్ళు రాక 1000 ఇండ్లు వున్న ఆ పల్లె ప్రజలకు తీవ్ర త్రాగునీటి సమస్య ఏర్పడింది. ప్రజలు ఆ బోర్లను తీయమని అడిగితే, తాము బీడు భూములకైనా నీరు వదులుతాం కానీ మీకు నీరిచ్చేది లేదని అనడంతో ప్రజలంతా యం.ఆర్.ఓ. ఆఫీసు ముందు ధర్నా చేశారు. భూస్వాములు యం.ఆర్.ఓ.కు కూడ లంచం ఇవ్వడంతో యం.ఆర్.ఓ. ఆ సమస్య గురించి పట్టించుకోలేదు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, ఆ సమస్య పరిష్కారం కాలేదు. ప్రజలు ఈ సమస్యను దళం దృష్టికి తెచ్చారు. దళం 300 మందితో 2000 ఏప్రిల్‌లో ప్రజా పంచాయితీ నిర్వహించి ప్రజల డిమాండ్ మేరకు ఆయా బోర్లు వెంటనే తీసివేయాలని చెప్పడంతో సమస్య పరిష్కారం అయింది.

### కరువు వ్యతిరేక పోరాటం

**బియ్యం పంపిణీ :** పంట పండక, చేయడానికి పనిలేక తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటూండగా ప్రభుత్వం మొసలి కన్నీరు కార్చడం తప్ప, ఉపాధి పనులు కల్పించక పోవడం వలన పూట గడవడం కష్టమైన ప్రజలకు తక్షణ సహాయం చేయటం కొరకు పాపాఘ్ని దళం ఏరియాలో కాంట్రాక్టర్లు మొదలైన వాళ్ళ నుండి కరువు నిధులు సేకరించారు. వాటితో 50 క్వింటాళ్ళ బియ్యం కొని సంఘ సభ్యులు ఇతరులు కలిసి బియ్యం పంపిణీ కమిటీని ఏర్పరచారు. సంఘం ఆధ్వర్యంలో దిగువ గొట్టు వీడు, కంచరపల్లి, ఏపిలంకపల్లి, మాధవరం, చెంచురెడ్డి పల్లి గ్రామాల్లో పంపిణీ చేశారు. పంపిణీ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఆ గ్రామాల్లో సభలు పెట్టి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వివరిస్తూ స్థానిక భూస్వాములు, పెత్తందార్లు, కాంట్రాక్టర్లు మొదలగు వారినుండి

కరువు నిధులు రాబట్టుకోడానికి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం 2000 జనవరి నెలలో జరిగింది.

### పంట నష్టపరిహారం, పంపిణీలో అవక తవకలపై యం.ఆర్.ఓ.ను నిలదీసిన రైతాంగం

కరువు కాటకాలు, వరదలు, తుఫానులు ప్రజలకు అశనిపాతం లాంటివికాగా, భూస్వాములు, పెత్తందారులు, పైరవీకారులు, రెవిన్యూ అధికారులు మాత్రం వాటిని జేబులు నింపుకునే అవకాశంగా భావించి శవాల్ని పీక్కుతినే రాబందుల్లాగా తయారవుతాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రకటనలకే తప్ప, కరువు సహాయ నిధులు మంజూరు చేసింది నామమాత్రం. రైతాంగం నష్టపోయిన దానికే ప్రభుత్వం ప్రకటించిన దానికి పొంతనే లేదు. అతికొద్దిగా ఇచ్చి కంటితుడుపు చర్యగా చేపట్టింది. దాన్ని కూడా అందనివ్వకుండా (రైతాంగానికి) భూస్వాములు, పెత్తందార్లు, పైరవీకారులు, రెవిన్యూ అధికారులు మోసానికి దిగారు. పాపాఘ్ని ఏరియాలోని రాయచోటి, గాలివీడు మండలాల్లో కూడా ఈ అవక తవకలు పెద్దఎత్తున జరిగాయి. ఉదాహరణకు నూలివీడు గ్రామంలో చిన్నరెడ్డన్నకు 5 ఎకరాలకుగాను 2000 రూ॥లు నష్టపరిహారంగా వస్తే 500 రూ॥లే ఇచ్చారు. చలపతి అనే రైతుకు 3 ఎకరాలకు 100 రూ॥ మాత్రమే ఇచ్చారు. ఇంకొక రైతుకు 10 ఎకరాలకు 5 వేలు రావలసి వుండగా 2 వందలే ఇచ్చారు. సబ్సిడీపై వచ్చిన వేరుశెనగ విత్తనాలు ఉన్నా అవి రైతులకి అందకుండా భూస్వాములు పెత్తందారులే పంచుకున్నారు. రైతాంగానికి జరుగుతున్న ఈ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడనిదే సమస్యలు పరిష్కారం కావని దళం గ్రామగ్రామాన ప్రచారం చేయడం జరిగింది. అలాగే రైతాంగాన్ని సంఘటితం చేయడం జరిగింది. నీటి సమస్యపై యం.ఆర్.ఓ.ను నిలదీయాలని నిశ్చయించుకున్న రైతాంగం 13, మే 2000న గాలివీడు మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. నూలివీడు నుండి 100 మంది; తూముకుంట నుండి 70 మంది; బురుజుపల్లి నుండి 30 మంది; గుండ్ల చెరువు నుండి 40 మంది; గుంటిమడుగు నుండి 30 మంది; కొప్పులోల్ల పల్లి, కడుపోల్ల పల్లి నుండి 30 మంది; మాధవరం, చెంబారెడ్డిగారి పల్లె నుండి 50 మంది; మూల నుండి 30 మంది; చాకిబండ గ్రామాల నుండి మొత్తం 800 మంది రైతాంగం ప్రదర్శనలో పాల్గొన్నారు. పంపిణీలో జరుగుతున్న అవకతవకలకు ఎం.ఆర్.ఓ.కు వ్యతిరేకంగా నినాదాలివ్వడం జరిగింది. ఊరేగింపు తర్వాత యం.ఆర్.ఓ. ఆఫీసుకు వెళ్లి, యం.ఆర్.ఓ.ను ప్రజల మధ్యకు తెచ్చి నిలదీశారు. యం.ఆర్.ఓ. సరైన సమాధానం చెప్పకపోతే ఆగ్రహించిన రైతాంగం ఎం.ఆర్.ఓ.ని కొట్టారు. అనంతరం 20 నిముషాల పాటు రాస్తారోకో చేశారు.

**మాధవరం గ్రామంలో :** జూలై 28న దళం ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. సభకు ముందు దాదాపు ఒక గంట పాటు 350 మందితో ''అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం'', ''ప్రభుత్వ దాడిని ఓడిద్దాం'' వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు తాత్కాలికంగా నిర్మించిన స్థూపాన్ని ఆవిష్కరించారు. ఆ సభలో కొయ్యూరు అమరుల గురించి, గుట్టపల్లి అమరుల గురించి యాక్షన్ టీం అమరుల గురించి, వారి ఆశయాల్ని కొనసాగించడానికిగాను ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడం గురించి వక్తలు (దళసభ్యులు, సంఘ సభ్యులు) మాట్లాడారు. సభానంతరం పాటలతో పాటు నర్సబ్బరీ బిడ్డలు ఒగ్గుకథను దళ సభ్యులు చెప్పి అమరవీరులు ప్రజల కోసం నడిపిన పోరాటాలను, చేసిన త్యాగాలను ప్రజల కళ్ళముందు నిలిపారు. సభను విజయవంతం చేసిన ప్రజలు ఆ పోరాటాలను, త్యాగాలను మననం చేసుకుంటూ అక్కడినుండి కదిలారు.

**ఫించా దళం ఏరియాలో...**

ఫించాదళం ఏరియాలో స్థానిక భూస్వాములను, వ్యాపారస్తులను కరువు సహాయ నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసి 50 వేల రూ॥లు సేకరించడం జరిగింది. ఈ డబ్బులతో బియ్యం కొని మడితాడు, మాదిగపల్లి, మాతమ్మ మాదిగపల్లి, బోడెప్పగారి పల్లి, కోమటిపల్లి, తూర్పు మాలపల్లి, మల్లప్పగారిపల్లి, కొత్తగుంట, టెక్కం, గుంటపల్లి, మాదిగపల్లి, మూలలో ఇంటికి 20 కిలోల చొప్పున జనవరి, ఫిబ్రవరి నెలల్లో (2000 సం॥రం) పంచారు.

### రైతాంగానికి విత్తనాల పంపిణీ

పంటలుపోయి, కరువును ఎదుర్కొంటున్న రైతాంగంకు తిరిగి పంట పెట్టుకోవడానికి విత్తనాల సమస్య తీవ్రంగా ముందుకొచ్చింది. ప్రభుత్వం పట్టించుకోకపోతే విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజాసంఘాలు, మండల కార్యాలయం వద్ద జూన్ 2000న ధర్నా నిర్వహించారు. దాదాపు 300 మందితో ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి రైతుకూలీ సంఘం కూడా కృషి చేసింది. కానీ ప్రభుత్వం నుండి రైతాంగానికి ఎటువంటి సహాయం అందక, తిరిగి పంట వేసుకోలేని సంకట పరిస్థితిలో పడ్డారు. ఈ స్థితిలో ప్రజల సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఎత్తిచూపుతూ పోరాడవలసిన అవసరాన్ని తెలియజేస్తూనే, తక్షణం రైతుల ముందుకొచ్చి విత్తనాల సమస్యను ఒక మేరకు పరిష్కరించడానికి దళం కార్యక్రమం తీసుకుంది. భూస్వాముల నుండి, వ్యాపారస్తుల నుండి కరువు సహాయక నిధులు వసూలు చేసి వాటితో శెనక్కాయలు కొని విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వసూలైన లక్షా అరవై వేల రూపాయలతో శెనక్కాయలు కొని స్థానికంగా విత్తనాల పంపిణీ కమిటీ ఏర్పాటు చేసి, దాని ఆధ్వర్యంలో ఇంటికి రెండు మూటల చొప్పున వానరాజుపల్లె, వానరాజుపల్లె బిడికి, మాలా మాదిగపల్లె, కొలిమిమిట్ట, బోడెప్పగారిపల్లె, మెల్లప్పగారి పల్లె, తూర్పు మాలపల్లె, పూజారోండ్లపల్లి, కొత్తగుంట మాదిగపల్లి, ఎర్రగుట్ట మాదిగపల్లి, కోలెం మాదిగపల్లి, దూది మాదిగపల్లి మొత్తం 12 పల్లెల్లో పండిన పంటలో నుండి ఈ శెనక్కాయలు తిరిగి ఇస్తే భవిష్యత్‌లో ఏర్పాటు చేసుకునే సహకార సంఘాల నిధులలో జమ చేసుకొని అవసరమైనప్పుడు ప్రజలు ఉపయోగించుకొనే వీలుంటుందని వివరించారు.

### ప్రభుత్వ గోడౌన్‌పై కరువుదాడి

రాయలసీమ అంటేనే కరువు కాటకాలకు నిలయం, రాళ్ళు రప్పలు తప్ప రతనాలు లేవనే వాస్తవాన్ని ఇప్పటి వరకు వచ్చిన 30

కరువులు రుజువు చేశాయి. అయినా ఏ పాలక పార్టీలు ప్రజలకు మాటలు చెప్పడం తప్ప కరువు నివారణ ప్లాన్ రూపొందించి అమలు చేసింది లేదు. పీపుల్స్‌వార్ నాయకత్వంలో వి.ఆర్.సి.యస్, వి.యం.యస్., సహకార సంఘాలు, కరువు నివారణ కోసం అనేక పోరాటాలు చేపట్టడంతోపాటు భూస్వాముల, వ్యాపారుల, కాంట్రాక్టరుల నుండి బియ్యం, జొన్నలు, వేరుశెనగ విత్తనాలు, రసాయనిక ఎరువులు వసూలు చేసి పంపిణీ చేస్తున్నాయి. ఇవి చేస్తూనే ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ ఊరేగింపులు ధర్నాలు చేస్తున్నా పేదల కడుపుమంటల బాధలు తెలియని చంద్రబాబు (పాలకవర్గాలు) చెరువుల పూడికతీత, వాటర్‌షెడ్ పనులు అంటూ కాంట్రాక్టర్ల జేబులు నింపేలా ప్రొక్లైన్‌లు, బుల్‌డోజర్లు పెట్టి వ్యవసాయ కూలీలకున్న కూలిపనులు కూడా లాక్కునేలా చేస్తున్నారు యంత్రాలతో పనులు ఆపి కూలీలకు పనులు కల్పించాలని సంఘాల నాయకత్వంలో ప్రజలు పోరాటాలు చేశారు. ఇవి ఎన్ని చేసినా ప్రజల ఆకలిబాధలకు కారణం భూస్వాములు, పాలకవర్గాలే కారణం అంటూ వాళ్ళ ఆస్తులపై దాడులు చేయడం జరిగింది.

అందులో భాగంగా 2000 సం॥ జూన్ నెలలో పార్టీ నాయకత్వంలో గెరిల్లాదళంతో పాటు 300 మంది పేద వ్యవసాయ కూలీలు కదిలి (ఇందులో 30 మంది మహిళలు) ఉరవకొండలోని ప్రభుత్వ గోడౌన్‌పై దాడిచేసి 800 బస్తాల బియ్యం, 200 బస్తాల చక్కెర వెంట తెచ్చుకున్న 10 వాహనాలలో తరలించుకు పోయారు. దీనితో బెంబేలెత్తిన ప్రభుత్వం వెంటనే స్పెషల్ పోలీసులతో కూంబింగ్ మొదలుపెట్టి బియ్యం పంపిణీ జరగకుండా స్వాధీనం చేసుకుంటూ అనేక దాడులు చేస్తూ ఇంట్లో కంట్రోల్ బియ్యం కనబడితే ఎత్తుకెళ్లడం, డీలర్స్‌కి ఒక్కొక్కరు ఇన్నిన్ని మూటలు ఇవ్వాలని ఒత్తిడి చేసి అలా వసూలు చేసిన 250 మూటల వరకు రికవర్ చేసినట్లు చెప్పుకున్నాడు. మిగతా 750 మూటల బియ్యం, చక్కెరను పోలీసు దాడులకు భయపడక ప్రజలు పంపిణీ చేసుకున్నారు. దీనితో ప్రజల్లో ఉత్సాహం పెరిగింది భూస్వాములకు ప్రభుత్వాలకు ఇదే సరయిన మందని నిరూపించారు.

### పోరాడి పని సాధించుకున్న ప్రజలు

ప్రజలు కరువు వల్ల పనులు లేక అల్లాడి పోతుంటే మరొక ప్రక్క కాంట్రాక్టర్లు ప్రొక్లెయినర్లతో పనిచేయిస్తూ ప్రజల ఉపాధికి గండి కొడుతున్నారు. చంద్రబాబు నాయుడు కరువు ప్రాంతాల్లో ప్రొక్లెయినర్ల ద్వారా పనులు జరగనివ్వనని ప్రకటనల వరకే చేస్తున్నాడు. రాష్ట్రమంతా ఇదే తంతు నడిచింది. సుండుపల్లి మండలంలో కూడా కాంట్రాక్టర్ ప్రొక్లెయినర్ ఉపయోగించి పగులగొట్టిన గుండ్లను ఎత్తేయిస్తున్నాడు. దీనివల్ల ఉపాధి కోల్పోతున్న స్థానిక ప్రజలు కదిలివెళ్లి 2000 సం॥రం జూలై నెలలో ప్రొక్లయినర్‌తో పనిని అడ్డుకున్నారు. ప్రజల డిమాండ్‌ను అంగీకరించి కంట్రాక్టర్ ప్రొక్లయినర్ పని ఆపేసి వీళ్ళకు పనిఇవ్వక తప్పలేదు.

### క్రాప్‌లోన్ల కోసం ధర్నా

పంటవిత్తే సీజన్ వచ్చినా ప్రభుత్వం పంట రుణాలు ఇవ్వక పోవడంతో సుండుపల్లె మండలం కొలింమిట్ట గ్రామ రైతాంగం 70 మంది విప్లవ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రానికి వెళ్ళి యం.ఆర్.ఓ. ఆఫీసు దగ్గర ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు.

### తునికాకు రేట్ల పెంపు

ఒక ప్రక్క తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని తక్కువ కూలీరేట్లు ఇచ్చి అధిక లాభాలు గుంజుకునే కుట్ర చేశారు. ఫించాదళం ఏరియాలోని ఒక కాంట్రాక్టర్ దాదాపు 15 గ్రామాల ప్రజలు తునికాకు కూలీలుగా వెళ్ళారు. ఏ పనీ దొరకని ప్రజలు తక్కువ కూలీరేట్లు ఇచ్చినా తీసుకుంటారు కదా అనే దుర్బుద్ధితో కాంట్రాక్టర్ గత ఏడాదిలా 50 పైసలు కాకుండా 35-40 పైసల కంటే ఎక్కువ ఇవ్వనని పేచీ పెట్టాడు. లేకపోతే తునికాకు తెంపేది లేదని బెదిరించాడు. కడుపు మండిన కూలీలు సంఘాల ఆధ్వర్యంలో సంఘటితపడి కాంట్రాక్టర్‌ని గ్రామానికి పిలిచి రేట్లు పెంచకపోతే తునికాకు తెంపేదిలేదని హెచ్చరించారు. దానితో తన కుయుక్తులు చెల్లవని గ్రహించిన కాంట్రాక్టర్ 50 నుండి 55 పైసల వరకు పెంచడానికి ఒప్పుకున్నాడు. అంతేగాక కరువు సహాయక నిధులు 60 వేల రూ॥లు వసూలు చేశారు.

## ప్రతిఘటన

### పరిటాల రవి అనుచరుడు గూండా విజయ్‌కి గ్రామ రక్షక దళం నాయకత్వంలో దేహశుద్ధి

1991లో పార్టీలో వచ్చిన సంక్షోభం వల్ల అనంతపురం రామగిరి ఏరియాలో పార్టీ రెండుగా చీలిపోయింది. అప్పటి ఏరియాలో పరిటాల రవి ఏజెంట్లైన కె.యస్. గ్రూపు, ప్రజలపై దాడులు చేస్తూ, దళాన్ని దెబ్బ తీయాలని ప్రయత్నిస్తూ వచ్చింది. ముఠా నాయకుడు పరిటాల రవి ఆధిపత్యాన్ని నిలబెట్టాలని చూస్తూ వచ్చారు. ప్రజలలో ఏర్పడిన గందరగోళాన్ని పోగొట్టి ప్రజలను పార్టీ వైపు నిలబెట్టాలనే లక్ష్యంతో మన దళం ‘92లో గాదికుంట గ్రామం దగ్గరకు వస్తే పరిటాల రవి ముఠా, దళంపై దాడి చేసింది. అందులో సామాన్య ప్రజలుండటంతో దళం ప్రతిఘటించలేదు. గూండా, పెత్తందారుడైన విజయ్ దళాన్ని చెప్పుతో కొట్టి ఇతరులతో కొట్టించాడు. గతంలో దళం కొండలో మకాం వుంటే పరిటాల రవి గూండాలు దళాన్ని చుట్టుముట్టి గుట్టకు నిప్పు పెట్టారు. అందులో వీడు ఒకడు. అప్పటి నుండి గ్రామాల్లో వీడు, వీడి అన్న బైటిన్ పెత్తనం చెలాయించేవారు. అప్పటినుండి వీడు ప్రజలకు, పార్టీకి వ్యతిరేకంగా వుంటున్నాడు. క్రమంగా మన సంఘం బలపడింది. డిసెంబర్ 2000లో మన గ్రామరక్షక దళం 30 మంది సాంప్రదాయక ఆయుధాలతో దాడిచేసి వీడిని చితకతన్నారు. పార్టీపై, ప్రజలపై దాడులు చేస్తే ప్రజాకంటకులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

### పోలీస్ ఇన్ఫార్మర్ పేపర్ శీనుకు దేహశుద్ధి

రామగిరి ఏరియా రామగిరిలో రైతుకూలీ సంఘం అనేక

# తొలి దెబ్బలోనే శత్రువుని బెంబేలెత్తించిన పి.జి.ఏ.

పీలేరు, యర్రావారిపాలెం రహదారిలో యల్లమంద గ్రామం మధ్యలో పంచాయితీ ఆఫీసు, దాని ప్రక్కనే భూస్వామి యశోదమ్మ ఇంట్లో యస్.టి.యఫ్. పోలీస్ ఔట్‌పోస్టు వుంది. గ్రామ ప్రజలు సాయంత్రం వేళ బజార్లో నిలబడి ముచ్చట్లలో వున్నారు. దూరంగా గ్రౌండ్‌లో యస్.టి.యఫ్. పోలీసులు, గ్రామ యువకులతో కలిసి వాలీబాల్ ఆడుతున్నారు. ఔట్‌పోస్ట్ మిద్దెపైన పహారా కాస్తూ ఇద్దరు పోలీసులు. ఇంతలోనే గ్రామంలోకి 2 జీపులు దూసుకువచ్చాయి. అందులో నుండి సివిల్ దుస్తుల్లో తుపాకులు చేతబూని యువతీ, యువకులు ఒక్క వుదుటున దిగారు. గ్రామ ప్రజలు, సెంట్రీ, పోలీసులు ఎవరా అని చూస్తుండగానే జీపులోనుండి దూకిన ''అస్సాల్ట్ టీం''



కమాండర్ కాషన్ ఇవ్వగానే అడ్వాన్స్ అవుతూ ధనధనమని, పోలీసు ఔట్‌పోస్ట్‌పై గుండ్ల వర్షం కురిపించ సాగింది. సమయం 2001 మార్చి 5వ సాయంత్రం 6.20 గం॥ల మునిమాపువేళ.

కేంద్రకమిటీ నాయకులు కా॥ శ్యాం, మహేష్, మురళీలు అమరులైన డిసెంబర్ 2వ, భారతదేశ పీడిత ప్రజల ఆశయాలు నెరవేర్చటానికి సాగుతున్న విప్లవోద్యమంలో గుణాత్మక మార్పుగా ఆవిర్భవించిన పి.జి.ఏ. (ప్రజాగెరిల్లా సైన్యం) ఆంధ్ర రాష్ట్రంలో శత్రుబలగాలపై చేసిన మొదటి దాడి అది. రాయలసీమలో 'స్టేట్‌పై' చేసిన మొదటి దాడి కూడా.

ఊహించని ఉత్పాతానికి మిద్దెలోని పోలీసులు మిద్దెమీదికి పరిగెత్తారు. అప్పటికే ఆ మిద్దె మీద వున్న సెంట్రీతో పాటు వీళ్ళు కూడా కవర్ తీసుకుని 20 తూటాలు కాల్చి ప్రతిఘటించడానికి ప్రయత్నించారు. గెరిల్లా సైన్యం ధాటికి తాళలేక, తూటాలు, బాంబులు వాళ్ళ గుండెలను బెంబేలెత్తిస్తుంటే తుపాకులు అక్కడే వదిలి, అమాంతం మిద్దెమీది నుండి వెనకకు దూకి ప్రాణాలు అరచేత బట్టుకుని పారిపోయారు. ఆ కాల్పుల శబ్దం విని గ్రౌండ్‌లో పోలీసులు అటునుండి అటే పరిగెత్తారు.

అప్పటిదాక కాల్పులు చూసి గందరగోళ పడుతున్న ప్రజలు, పోలీసుల మీద కాల్పులు చూసి, వచ్చింది గెరిల్లాలని అర్థమై, ఉత్సాహంతో, సాదరంగా ఆహ్వానించారు.

పీలేరు, ఎర్రావారిపాలెం రహదారిమీద ప్రయాణీకులతో వస్తున్న బస్సులను, జీపులను 2 స్కాట్ పార్టీలు ఆపి దాడి గురించి, పి.జి.ఏ. గురించి వివరించారు. అది జరుగుతుండగానే, ఔట్‌పోస్ట్ నుండి పోలీసులు పారిపోగా సీజింగ్ గ్రూప్ అడ్వాన్స్ అయి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం మొదలు పెట్టింది. సీజింగ్ కార్యక్రమం అవుతుండగానే, డిమోలేషన్ బ్యాచ్ ఔట్‌పోస్ట్ వున్న మిద్దెను, పంచాయితీ ఆఫీసును, ఎక్స్‌ఛేంజీని జెలిటిన్ స్టిక్స్ అరేంజ్ చేసి వైరు కనెక్షన్ ఇచ్చారు. సీజింగ్ చేసుకున్న ఆయుధాలు, ఇతరాలను హెడ్ క్వార్టర్స్ దగ్గరకు తీసుకొచ్చిన తరువాత, బ్యాటరీ కనెక్షన్‌తో 'బ్లాస్ట్' చేయగా భూస్వామి మిద్దె పంచాయితీ ఆఫీసులు, ఎక్స్ఛేంజీ కుప్పగూలిపోయాయి.

ఆ రెయిడ్‌లో స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ఏ.కె.-47 ఒకటి, యస్.యల్.ఆర్. లు–2, 7.62 రైఫిల్స్–2, సబ్‌మిషన్ గన్స్–3, 9.యం.యం. పిస్టల్–1, బాయ్‌నెట్‌లు–2, ఒక బుల్లెట్ ప్రూఫ్ జాకెట్. యస్.యల్.ఆర్. మ్యాగజైన్‌లు 8 (262 తూటాలు), ఏ.కె. మ్యాగజైన్లు 2 (60 తూటాలు), సబ్‌మిషన్‌గన్ మ్యాగజైన్లు 6 (191 తూటాలు), 7.62 ఛార్జర్స్ 28, 303 చార్జర్స్ 3, కెమెరా ఇతర రికార్డ్సు స్వాధీనమైనాయి.

45 నిముషాలలో విజయవంతంగా తన మొదటి దాడిని ముగించుకున్న పి.జి.ఏ. మరిన్ని దాడులకు సిద్ధపడుతూ దిక్కులు పిక్కటిల్లేలా విప్లవ నినాదాలు చేస్తూ, ప్రజల నుండి వీడ్కోలు తీసుకొంటూ వెనుతిరిగింది

యల్లమంద పోలీస్‌స్టేషన్‌పై రెయిడ్ జరిగిన తరువాత తన బలగాల మొరాలిటీ దెబ్బతినడంతో పోలీస్ అధికార యంత్రాంగం, పోయిన పరువును నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. ఇది జరిగిన కొద్ది రోజులకే ప్రక్కనే వున్న కడప జిల్లాలోని వీరబల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పైకి పి.జి.ఏ. దాడి చేసినట్లు, దానిని పోలీసులు వీరోచితంగా ప్రతిఘటించినట్లు ఒక కట్టుకథ అల్లారు. దానికోసం పాపం పోలీసు అధికారులు పగడ్బందీ వ్యూహరచన చేశారు. రాత్రివేళ పి.జి.ఏ. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసినట్లుగా, స్టేషన్‌లో పోలీసులు కాల్పులు జరుపుతుండగా కడపనుండి పోలీస్ ఉన్నతాధికారులు అదనపు బలగాలతో వీరబల్లి చేరుకున్నారు. స్థానిక పోలీసులకు సహాయం చేయడానికి అన్నట్లు నిజంగా అక్కడొక దాడి జరిగిందని ప్రపంచాన్ని నమ్మించడానికి మరునాడు పెద్ద ఆర్భాటంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 4 గంటలపాటు వీరోచితంగా ప్రతిఘటించి, నక్సలైట్లను తరిమినట్లు ప్రకటనలిచ్చారు. అయితే ఆ బూటకపు ప్రతిఘటన గురించి ప్రజలకు వెంటనే అర్థమైంది. పత్రికలు కూడా ''పోలీసుల హైడ్రామా'' అంటూ వార్తలు రాయటంతో పోలీసులు అభాసుపాలయ్యారు.

పోరాటాలు నిర్వహించింది. శత్రు నిర్బంధం పెరిగి సంఘ నాయకత్వం అరెస్టులు కావడంతో సంఘం బలహీనపడింది. అప్పటి వరకు శీను సంఘంకు అనుకూలంగా వుంటూ చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ వుండేవాడు. పోలీసులు వీడితో కలుస్తూ వివిధ రకాల ఆశలు చూపి ఇన్ఫార్మర్‌గా మార్చుకున్నారు. అప్పటి నుండి గ్రామంలో సంఘ కార్యక్రమం ఏది జరిగినా వెంటనే ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చేవాడు. వీడే కాకుండా ఇంకా ఒకరిద్దరిని ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకున్నాడు. దీనితో సంఘ కార్యక్రమాలు పూర్తిగా స్తంభించి పోయాయి. 2000 డిసెంబర్‌లో దళంలోని మహిళా కామ్రేడ్ నాయకత్వంలో 17 మంది మిలిటెంట్లు రాత్రి దాడిచేసి వాన్ని చితక్కొట్టి వాడి ఫోన్ పీకివేసి హెచ్చరించారు. ఇంకా ఇన్‌ఫార్మర్ ప్రసాద్‌ను హెచ్చరించారు. పోలీసు స్టేషన్‌కు సమీపంలోనే కొట్టడంతో ప్రజలు ఎంతో ఉత్సాహపడినారు.

### గ్రామ పెత్తందారు, పోలీస్ ఇన్ఫార్మర్ కమ్మ నారాయణ స్వామికి దేహశుద్ధి

రామగిరి ఏరియా కనగానపల్లి మండలం కోనాపురంలో విప్లవ రైతుకూలీ సంఘం, విప్లవ మహిళా సంఘాల నాయకత్వంలో ప్రజలు అనేక పోరాటాలు చేసి వందలాది ఎకరాల భూస్వాముల భూములను ఆక్రమించుకొని పంచుకొన్నారు. అప్పటి వరకు అగ్రకులమైన కమ్మ భూస్వాముల మాటకు తిరుగులేని స్థితి నుండి రైతుకూలీ సంఘం నాయకత్వంలో పీడిత ప్రజలది పైచేయిగామారి గ్రామ రాజ్య లక్ష్యం వైపు సాగుతుంది. పెత్తందారుడైన కమ్మ నారాయణ స్వామికి తన పెత్తనం పోవడంతో 1985లోనే మన సంఘ నాయకుల్ని పోలీసులకు పట్టించి నడిబజారులో బట్టలు లేకుండా కొట్టించాడు. అప్పటి నుండి సంఘంకు వ్యతిరేకంగా వుంటూ ఏ.పి.యస్.పి. పోలీసులను రహస్యంగా కలుస్తూ మన దళ, సంఘ సమాచారంను అందవేసేవాడు. ఇంతేగాకుండ భూస్వాముల కొడుకులను చేరదీసి మన సంఘానికి వ్యతిరేకంగా గ్యాంగ్‌ను నడుపుతూ మన సంఘ నాయకుడి వేరుశెనగ కట్టె వామికి నిప్పు పెట్టారు. మోటార్లు, పైపులు ధ్వంసం చేస్తూ పోలీసులతో సంఘ నాయకుల ఇండ్లను, ధ్వంసం చేయించేవాడు. వీడిని గతంలో హెచ్చరించినా తన వైఖరిని మార్చుకోక పోవడంతో గెరిల్లా దళం నాయకత్వంలో 50 మంది మిలిటెంట్లతో (ఇందులో 5 మంది మహిళా మిలిటెంట్‌లు) దాడిచేసి వాడి కాళ్ళు, చేతులు విరగ్గొట్టి హెచ్చరించారు.

### భూస్వామి, పోలీస్ ఇన్ఫార్మర్ రవీందర్‌రెడ్డికి దేహశుద్ధి

పెన్నహోబిళం ఏరియా గార్లదిన్ని మండలం ముకుందాపురంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు జరిగి, జీతాల రేట్లు, కూలీరేట్లు పెంచుకోవడం, భూస్వాముల భూమిని పంచుకోవడంతో రైతుకూలీ సంఘం బలపడింది. దీని ప్రభావంతో ఎర్రగుంట్లలో రైతుకూలీ సంఘం పెట్టుకోవాలని వ్యవసాయ కూలీలు సిద్ధం కావడంతోనే మన పార్టీ గ్రామంలోకి వస్తే వాళ్ళ ఆధిపత్యం పోతుందని మొదటినుండి సంఘానికి వ్యతిరేకంగా వుంటున్నాడు. గ్రామంలోని స్కూలు స్థలాన్ని వీడు ఆక్రమించుకుంటే సంఘం వదలమని చెప్పినా, వదలకుండా పోలీసులకు మన సంఘ నాయకులకు పట్టించి తీవ్రంగా కొట్టించాడు. అప్పటి నుండి మరింత దురుసుతనంతో గ్రామంలో పెత్తనం చేస్తూ సంఘాన్ని, దళాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నాడు. అందువల్ల గ్రామంలో బహిరంగ మీటింగ్ పెట్టి తన వైఖరి మార్చుకోవాలని హెచ్చరించినా మానుకోలేదు. దానితో డిసెంబర్ 2000లో గెరిల్లా దళం 10 మంది మిలిటెంట్లతో దాడిచేసి వాడికి దేహశుద్ధి చేయడం జరిగింది.

### భూస్వాములు ఆనందప్ప, జానకి రామయ్యల ఇండ్లపై దాడి

వజ్రకరూర్ మండలం కడమలకుంట గ్రామంలో గతంలో సంఘ నాయకత్వంలో 30 ఎకరాల పట్టాభూమిని ఆక్రమించినారు. అప్పటినుండి పెరిగిన నిర్బంధం వల్ల ప్రజలు పంట పెట్టలేకపోయారు. 2000 ఆగస్టు 2న కనుంపల్లి దగ్గర పెన్నహోబిళం దళంపై శత్రువు మాటుగాసి చేసిన దాడిలో కమాండర్ కా॥ మల్లికార్జునతో పాటు ముగ్గురు కామ్రేడ్స్ అమరులు కావడంతో ఏరియాలో శత్రువు తాత్కాలికంగా పైచేయి సాధించాడు. ఎన్‌కౌంటర్‌తో ఏరియాలో భూస్వాములు పాత ఆధిపత్యాన్ని కొనసాగించాలని ఉవ్విళ్ళూరారు. దీనితో భూస్వామి ఆనందప్ప గతంలో మనం ఆక్రమించిన భూమిలో పంట పెట్టినాడు. జనవరి 2001లో భూస్వాముల ఇండ్లపై గెరిల్లాదళంతో పాటు 40 మంది మిలిటెంట్‌లు దాడిచేసి వారి ఇంట్లో సామానులు, ట్రాక్టర్‌ను ధ్వంసం చేసి హెచ్చరించారు. దీనితో ఆనందప్ప ఊరు వదిలిపోయాడు, పంట కూడా వదిలేసినాడు.

### ఇన్‌ఫార్మర్‌ల గుట్టురట్టయిన సంఘటన

కూడేరు మండలం చెరువు మరుట్ల ప్రాంతంలో గెరిల్లా దళం మకాం వేసింది. దళం దగ్గరకు ఏకుల రమేష్ అనేవాడు వచ్చి దళాన్ని చూసి పోలీసులు అనుకొని పార్టీ సంఘ నాయకుల గురించి చెప్పడం మొదలు పెట్టాడు. ఆ క్రమంలో వీడు ఇన్‌ఫార్మర్ అనే అనుమానంతో తాళ్ళతో కట్టి ఇంటరాగేషన్ చేయడంతో చెరువు మరుట్లలో పరమేషు, రామాంజిలకు పోలీసులు లాకెట్‌కీలు, రివాల్వర్ ఇచ్చి దళాన్ని, మిలిటెంట్‌లను పట్టివ్వమని ప్రోత్సహించారని తెలిసింది. అంతే కాకుండ వీళ్ళకున్న ముఠాతత్వంను ఉపయోగించుకొని మన సంఘ నాయకున్ని చంపమని ప్రోత్సహించడంతో వాళ్ళు రెండు గ్రూపులుగా మాటుగాసినారు. రమేష్‌ను కొట్టడంతో ఇన్‌ఫార్మర్‌ల గుట్టు రట్టయింది.

### తలకోన దళం మాజీ దళసభ్యుడు లోకనాథ్‌కు దేహశుద్ధి

లోకా (వెంకటరమణ) రెండున్నర సంవత్సరాలు తలకోన దళసభ్యునిగా పనిచేశాడు. స్త్రీ పురుష సంబంధాల విషయంలో తప్పుడు పద్ధతులు అవలంభిస్తూ, మార్చుకోవడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయకుండా, కనీస క్రమశిక్షణ కూడా పాటించక పోవటంతో పార్టీ నుండి బయటికి పంపడం జరిగింది. ఇంటికి

వెళ్ళిన దగ్గర నుండీ భూస్వాములతోనూ, పోలీసులతోనూ సంబంధాలు కొనసాగిస్తూ సానుభూతిపరుల, మిలిటెంట్ల, సంఘ నాయకుల పేర్లు చెప్పి కొట్టించడం, వీడే స్వయంగా బెదిరించడం, ప్రతిరోజూ పీలేరు, ఎర్రావారిపాలెం, యల్లమంద స్పెషల్ పోలీసులతో తిరగడం, త్రాగడం, టౌన్ సెంటర్లలో దళ సభ్యులు వస్తారని కాపు కాయడం, దళం పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడం, పంచాయితీలు చేయడం వాడి రోజువారీ కార్యక్రమంగా వుంది. వాడు వుంటున్న గ్రామానికి దళం పోయి వచ్చిన వెంటనే పోలీసులు వచ్చి ప్రజలను కొట్టడం, బెదిరించడం, దళం కోసం ఆ చుట్టుప్రక్కల ప్రాంతం అంతా గాలిస్తారు. దళాన్ని పట్టించి పోలీసుల దగ్గర డబ్బు తీసుకోవాలని, దళం ఆచూకీ చెప్పడం చేస్తున్నాడు. వీడి ప్రజా వ్యతిరేక చర్యలపట్ల అనేకసార్లు హెచ్చరించినా, ప్రచారం చేసినా పద్ధతులు మార్చుకోకపోగా, ఇంకా ఎక్కువ అవడంతో 2000 ఏప్రిల్‌లో దళం వీడికి దేహశుద్ధి చేసింది.

## భూస్వామి ధనంజయ రెడ్డికి దేహశుద్ధి

యర్రావారి పాలెం మండలం, గుండాలబైలు గ్రామం కోటకాడపల్లి భూస్వామి అయిన ధనుంజయ రెడ్డి గత నాలుగు సంవత్సరాలుగా పార్టీ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడు. వీడు ప్రతిరోజూ స్పెషల్ పోలీసులతో కలవడం, సానుభూతిపరుల, సంఘ నాయకుల, మిలిటెంట్ల పేర్లుతో చెప్పడంతో పాటు, వీడు స్వయంగా పోలీసు డ్రస్సువేసుకుని పోలీసులకు దారులు, డొంకలు, వంకలు, వాగులు అడవిలో నీళ్ళున్న ప్రాంతాలు చూపించడం, భోజనాల ఏర్పాట్లు చేయడం, షెల్టర్ ఇవ్వడం చేస్తూ, మన మిలిటెంట్లను బెదిరించడం చేస్తున్నాడు. వీడి ప్రజా వ్యతిరేక చర్యలు మానుకోవాలని అనేకసార్లు పోస్టర్స్, వాయిస్ ద్వారా, నేరుగా హెచ్చరించినప్పటికీ మానకపోవడంతో; 2000 ఆగస్టులో దళం, మిలిటెంట్లతో కలిసి ఇంటిమీద దాడిచేసి, ఇంట్లో వున్న ఫర్నీచర్, కలర్ టీ.వీ.ని కిరోసిన్ పోసి తగలబెట్టి వాడికి దేహశుద్ధి చేయడం జరిగింది. దాంతో వీడు ప్రజల ముందుకు వచ్చి తన తప్పులను ఒప్పుకొని, ప్రజలమీద అక్రమ కేసులు పెట్టించి వేధించినందుకుగాను నష్టపరిహారంగా 20వేల జరిమానా కట్టడానికి ఒప్పుకున్నాడు.

## పెత్తందారు, భూస్వామి ఏజెంట్ అస్సాన్ సాహెబ్‌కు దేహశుద్ధి

అస్సాన్ సాహెబ్ నాలుగు సం॥లుగా ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడు. వీడు మనం చేసిన భూపోరాటంలో వచ్చిన 5 ఎకరాల భూమిని భూస్వాములైన జయమ్మ, రామక్రిష్ణారెడ్డిలతో కుమ్మక్కై కొన్నాడు. భూపోరాటాన్ని నీరుగార్చటానికి భూపోరాటంలో వున్న మన సంఘాన్ని బెదిరించడం, పోలీసులకు పేర్లు చెప్పి కొట్టించటం, దళం ఊరిలో మీటింగ్ పెట్టినప్పుడు క్యాసెట్ చేసి పోలీసులకు ఇవ్వడం, 15 ఎకరాల భూమి ప్రజల స్వాధీనమై పంటపెట్టి ధాన్యం ఇంటికి తెచ్చే సమయంలో పోలీసులను తీసుకువచ్చి, ప్రజలను విపరీతంగా కొట్టించి సగం పంటను స్వాధీనం చేసుకున్నాడు. వీడి దుర్మార్గాలకు వ్యతిరేకంగా వాయిస్‌లు, ఊర్లలో పోస్టర్ల ద్వారా ప్రచారం చేసినా, స్వయంగావెళ్ళి హెచ్చరించినా మార్పు రాకపోవటంతో; 2000 ఆగస్టులో వీడిని, వీడి కొడుకుని దేహశుద్ధి చేసి ప్రజల్లోకి తీసుకువస్తే చేసిన తప్పులను ఒప్పుకొని, ప్రజలకు జరిగిన నష్టానికి 10 వేల రూ॥లు జరిమానా కట్టడానికి ఒప్పుకున్నాడు.

## భూస్వామి బాబురెడ్డికి దేహశుద్ధి

సుండుపల్లి మండలం, దిన్నెల గ్రామ భూస్వామి బాబురెడ్డి కుటుంబంలో తాతల కాలం నుండి ఇప్పటి వరకు వీళ్ళకు వ్యతిరేకంగా మాట్లాడితే ఊరు వదిలిపెట్టి వెళ్ళాల్సిందే. ఇలా వీళ్ళ దౌర్జన్యాలకు అడ్డూ ఆపూ వుండదు. అలా వీళ్ళ దౌర్జన్యాలకు గ్రామంలో చాలా కుటుంబాలు ఊరువదిలి పోయారు. దళం ఊరికి వచ్చిన తరువాత ప్రజలకు వీడికి మధ్య వున్న కరెంట్ సమస్యను (కరెంట్ వేయిస్తానని 40 వేల రూ॥లు వసూలు చేసి వాడి ఇంటికే వేయించుకున్నాడు.) ప్రజల సమక్షంలో పంచాయితీ చేసి ప్రజలకు కరెంట్ సమస్యను పరిష్కరించడం జరిగింది. దీనిని సాకుగా తీసుకొని స్పెషల్ పోలీసులకు మన సానుభూతిపరుల పేర్లు చెప్పటం, కొట్టించడం, అరెస్టులు చేయించడం, కేసులు పెట్టించటం, పోలీసులకు భోజనాలు ఏర్పాటు చేయడం, షెల్టర్ ఇవ్వడం వీడి దినచర్యగా వుంది. '98లో యల్లమంద మహేశ్వర్ రెడ్డి ఇల్లు పేల్చేసిన తరువాత మన మిలిటెంట్‌ను డైరెక్టుగా పోలీసులను తీసుకొచ్చి పట్టించాడు. వీడి ఇల్లు స్పెషల్ పోలీసులకు పేకాట కేంద్రం, ఇదే ఊర్లో స్పెషల్ యస్.ఐ. సురేష్ కుమార్ ఒక స్త్రీతో సంబంధాలు కొనసాగిస్తూ రోజంతా వీడి ఇంట్లోనే వుంటాడు. ప్రజా వ్యతిరేక చర్యలు మానుకోవాలని అనేకసార్లు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో జనవరి 2001లో ప్రజల ముందర దేహశుద్ధి చేస్తే తప్పులను ఒప్పుకున్నాడు.

## వానరాసుపల్లి భూస్వామి, పోలీసు ఏజెంటు రమణారెడ్డికి దేహశుద్ధి

కడప జిల్లా, సుండుపల్లి మండలం, మడితాడు గ్రామం వానరాసుపల్లి భూస్వామి, పోలీసు ఏజెంటుగా వుంటున్న రమణారెడ్డి పీడిత ప్రజలకు ప్రధాన శత్రువైన తెలుగుదేశం పార్టీ నాయకుడు రవీందర్ రెడ్డికి అనుచరుడుగా వుంటూ 1999 నుండి ప్రజా వ్యతిరేక, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. పోలీసుల సంబంధాల్లో వుంటూ, వాళ్ళకు ఆశ్రయం కల్పించడం, భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు స్థానిక సంఘ నాయకత్వం గురించి పోలీసులకు చెప్పి అరెస్టు చేయించి అక్రమ కేసులు బనాయించడంలో ఇతను కీలక పాత్ర పోషించాడు. ప్రేమ పేరుతో ఒక అమ్మాయిని మోసం చేసి పెండ్లి చేసుకోవడానికి నిరాకరించిన ఇతని కొడుకును పెండ్లి చేసుకోవాలని నిలదీసిన పేద కుటుంబంపై అనేకసార్లు దౌర్జన్యాలకు పాల్పడ్డాడు. ఇలా తన ప్రజా వ్యతిరేక, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్థి చెప్పాలని అనేకసార్లు హెచ్చరిస్తూ ప్రచారం చేసినా తన పద్ధతులు మార్చుకోక పోవడంతో ఫించా దళం వీడికి దేహశుద్ధి చేసింది. దీంతోనిర్బంధ బాధితులకు 20 వేల రూ॥ల నష్టపరిహారం ఇస్తానని ఒప్పుకొన్నాడు. ❑

# స్టాక్ కుంభకోణం : అవధులు మీరిన దారిదోపిడీ...

కలకత్తాకి చెందిన 22 సం॥ల సబ్ బ్రోకర్ అభిషేక్ బంకా పరవళ్ళు తొక్కుతున్న నదిలోకి దూకి కొట్టుకు పోయాడు... ఆ మరుసటి దినం అతడి భార్య బహుళ అంతస్తుల భవంతి మీద నుండి కిందికి దూకేసింది... ఢిల్లీలో స్టాక్ ఎక్ఛేంజ్‌లో ఏ ఒకటి రెండుసార్లో మదుపు పెట్టిన వ్యక్తి తన పిల్లలిద్దరినీ చంపేసి, తర్వాత భార్యతోపాటు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సం॥రం మార్చి నెలలో పత్రికల నిండా ఇలాంటి ఆత్మహత్యల వార్తలే. ముంబై నగరం కుర్లాలోని 'ఫ్రెండ్స్ కో ఆపరేటివ్ బ్యాంకు' బయట, తమ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలనే ఆశ, ఆదుర్దాలతో ప్రతిరోజూ ఉదయం వందలాదిమంది వరసగట్టి నిలబడేవారు. గుజరాత్‌లోని మాధవ్‌పుర వాణిజ్య సహకార బ్యాంకుకి తక్షణం 500 కోట్ల రూ॥ల ఆర్థిక సహాయం అందివ్వకపోతే ఆ బ్యాంకులో 1,100 కోట్ల రూ॥లు మదుపుపెట్టిన వేలాది చిన్న డిపాజిటర్లు తమ డబ్బును మొత్తంగా కోల్పోనున్నారు. ఇక ప్రుడెన్షియల్ ఐ.సి.ఐ.సి.ఐ.లో డిపాజిట్ చేసిన మదుపర్లు తమ పెట్టుబడిలో సగాన్ని కోల్పోయారు. స్టాక్ మార్కెట్ పతనం వల్ల లేక రుణాల ఎగవేతవల్ల వందలాది చిన్నా చితకా బ్యాంకులు తమ పెట్టుబడులను కోల్పోయి పతనమవుతుండటంతో ఇంకా లక్షలాదిమంది ఇతరులు తమ డిపాజిట్లనే మొత్తంగా కోల్పోనున్నారు.

మార్చి నెల మధ్యలో లక్షలాదిమంది పట్టణ మధ్యతరగతి మదుపుదార్ల దీనావస్థ ఇంత భయానకంగా తయారైంది. కేంద్ర బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో కొత్తగా బద్దలయిన స్టాక్ మార్కెట్ కుంభకోణంవల్ల తాము మదుపుపెట్టిన వేలాది కోట్ల రూ॥ల విలువైన పొదుపు మొత్తాలు రాత్రికి రాత్రే హుష్‌కాకీ లాగా మాయమైపోవడం వీరందరి అనుభవంలోకి వచ్చింది. మరోవైపున విదేశీ పరోక్ష పెట్టుబడులకు సంబంధించిన ద్రవ్య సంస్థలు, వాటి ఏజెంట్లు కలిసి స్టాక్ మార్కెట్‌ని మాయజేయటం ద్వారా భారీ లాభాలు దండుకున్నారు. స్టాక్ ఎక్ఛేంజ్ పతనం గురించి ప్రజలకు కనీస ఊహ కూడా లేని దశలో 'మెరుపు కలల బడ్జెట్' ప్రవేశపెట్టిన వెంటనే స్టాక్ ఎక్ఛేంజ్‌లపై మెరుపుదాడి- ఆంబుష్- చేసింది ఈ ద్రవ్య సంస్థలే. కేంద్ర ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా బడ్జెట్‌లో మార్కెట్ కాపిటలైజేషన్ (కంపెనీ విలువ : కంపెనీ జారీ చేసిన వాటాల సంఖ్యను, వాటాల మార్కెట్ ధరతో గుణించగా వచ్చే విలువే ఆ కంపెనీ విలువ)కి భారీగా రాయితీలు ప్రకటించడంతో మరుసటి దినమే బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ సూచిక 170 పాయింట్లు పెరిగింది. స్టాక్ మార్కెట్లు విజృంభించనున్నపుడు విదేశీ సంస్థాగత మదుపుదార్లు బేర్ కార్టెల్స్ (ధరలు పడిపోతాయనే ఊహతో వాటాలను అప్పుడున్న ధరలకే అమ్మేసే స్టాక్ వ్యాపారుల సిండికేట్లు) భారీ స్థాయిలో వాటాలను అమ్మేయడం ద్వారా స్టాక్ మార్కెట్‌ని ఆంబుష్ చేశారు. ఇది మార్చి 2న స్టాక్ మార్కెట్ పతనానికి దారితీసింది. అయితే వీళ్ళు మంచి ధరలు వున్నపుడే వాటాలను అమ్మేసి భారీ లాభాలు కొల్లగొట్టారు. ఈ లాభాల్లో అధిక భాగం దేశం నుండి బయటపడి, పన్నుల్ని భారీగా తగ్గించి పెట్టుబడులను ఆకర్షించే మారిషస్‌కి తరలిపోయింది.

వాస్తవంగా చూస్తే, మధ్యతరగతి ప్రజలకి చెందిన కోట్లాది రూపాయల పొదుపు మొత్తాలు రాత్రికి రాత్రే వేళ్ళమీద లెక్కపెట్టదగిన ఎఫ్.ఐ.ఐ.ల, వారి ఏజెంట్ల జేబుల్లోకి వెళ్ళిపోయాయి. నిజంగా ఇది చంబల్‌లోయ బందిపోటు దొంగలకే పిచ్చెక్కించేసేంత భారీ దోపిడీ మరి. ఇది బందిపోట్లు కొల్లగొట్టగలిగే మొత్తానికి వందరేట్లకు మించిన లూటీ మాత్రమే కాదు, పైగా ఇది చట్టబద్ధమైన దోపిడీ, నాగరిక దోపిడీ, అత్యంత సమర్థవంతంగా చేసే దోపిడీ. ఆత్మహత్యల్ని మినహాయిస్తే, ఇది రక్తం చిందించనట్టి దోపిడీ. దీనిలో ఎటువంటి గందరగోళాలూ వుండవు. అంత నాగరికంగా, నాజూగ్గా, గౌరవనీయంగా ఇది జరిగిపోతుంది. పైగా బందిపోట్లు తమ దోపిడీలకుగాను మారుమూల అడవుల్లో అష్టకష్టాలు పడాల్సి వుంటుంది కానీ ఈ నాగరిక దోపిడీదార్లు తామార్జించిన దాంతో స్టార్ హోటళ్ళలో విలాసంగా బతుకుతారు.

## కుంభకోణాల స్వరూపం :

### ఎ. వికాసదశ :

2000 సం॥రం పొడవునా స్టాక్ ఎక్ఛేంజ్‌లో భారీ స్థాయిలో కొనుగోళ్ళు జరపటం ద్వారా స్టాక్ మార్కెట్ ధరలను కృత్రిమంగా పెంచేశారు. ఈ స్టాక్ కొనుగోళ్ళ వ్యవహారంలో అందరికంటే ముందు పీఠిన నిలబడ్డవాడు కేతన పరేఖ్ అనే స్టాక్ బ్రోకర్. బ్రోకర్లు, కంపెనీలు, ఏజెంట్లుతో కూడుకున్న విస్తృత యంత్రాంగం ద్వారా ఇతడు వ్యవహారాలు నడిపాడు. కార్పొరేట్ సంస్థల యజమానులు (సమాచార సాంకేతిక రంగం, కమ్యూనికేషన్లు, వినోద రంగం వంటివి), బ్యాంక్ అడ్వాన్సులు, కొనుగోళ్ళు, మ్యూచువల్ ఫండ్స్ (ప్రత్యేకించి యు.టి.ఐ.కి చెందినవి) పెట్టుబడులు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులకు (యఫ్.ఐ.ఐ.) సంబంధించిన అపార మొత్తాలు వంటి పలు వనరుల ద్వారా స్టాక్ మార్కెట్‌లోకి డబ్బు గుమ్మరించబడింది. ఈ కొనుగోళ్ళన్నీ కేతన్ పరేఖ్ ముందుకు నెట్టిన కొన్ని సంస్థల వాటాలకే పరిమితమైనాయి. ఇవే కె.10 కంపెనీలుగా పేరుపడ్డాయి. ఇన్ఫోసిస్ టెక్నాలజీస్, హెచ్.యఫ్.సి.యల్., జీ టెలీ ఫిల్మ్స్, డి.కె.క్యు సాఫ్ట్‌వేర్, గ్లోబల్ టెలిసిస్టమ్స్, సైబర్‌స్పేస్, సత్యం వంటి కంపెనీలు వీటిలో కొన్ని. (వీటిలో హెచ్.యఫ్.సి.యల్. అనేది అప్పటి టెలికామ్ మంత్రి సుఖ్‌రామ్ ప్రారంభించిన హిందూస్థాన్ ఫ్యూచరిస్టిక్ కంపెనీ లిమిటెడ్‌గా పేరుమోసింది. ఈ కంపెనీ డైరెక్టర్లకు సందేహాస్పదమైన సంబంధాలుండేవి. ఈ మధ్యనే ఆస్ట్రేలియా కోటీశ్వరుడు కెర్రీపాకర్ ఈ కంపెనీలో 9 శాతం షేర్లు కొన్నాడు).

కార్పొరేట్ యజమానులు తమ కంపెనీల షేర్ల ధరలను పెంచేందుకోసం స్టాక్‌బ్రోకర్లకు, ప్రత్యేకించి కేతన్ పరేఖ్‌కి అపార మొత్తాలను రుణంగా ఇచ్చారు. ఉదా॥కి దినేష్ దాల్మియా ప్రమోట్ చేసిన డి.యస్.క్యు. సాఫ్ట్‌వేర్ కంపెనీ షేర్లు భారీగా పెరిగాయి.

ఇతగాడు స్టాక్‌బ్రోకర్లకు 208 కోట్ల రూ॥లు రుణాలు ఇచ్చాడు. స్టాక్ మార్కెట్ కుంభకోణం జరగడానికి మూడు నెలల ముందు కేతన్ పరేఖ్‌కి హెచ్.యఫ్.సి.యల్. కంపెనీ 425 కోట్ల రూ॥లను, జీ కంపెనీ 340 కోట్ల రూ॥లను ఇచ్చింది (ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఒక వ్యక్తికి వందల కోట్ల కంపెనీ రుణాలు) ఈరోజు వరకు కూడా వెలుగులోకి వచ్చిన విషయాలు ఇవే. కానీ ఈ వ్యవహారంలో ఇంతకు మించే చాలామంది పాల్గొని వున్నారు.

ఇక బ్యాంకుల వంతు.... ఇవి కేతన్‌పరేఖ్‌కి 1,200 కోట్ల రూ॥ల రుణాలనిచ్చాయి. మాధవపుర వాణిజ్య సహకార బ్యాంకు ఒక్కటే ఇతడికి 800 కోట్ల రూ॥లను ఇవ్వగా గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ 256 కోట్ల రూ॥ల రుణాలను అందించింది.

మ్యూచువల్ ఫండ్స్ విషయానికొస్తే, యు.టి.ఐ. కంపెనీ ఈ కె-10 గా పేరుపడిన కంపెనీలలో భారీగా మదుపు పెట్టింది. వాస్తవానికి గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్-జి.టి.బి.-ప్రమోటర్ రమేష్ గెల్లి, కేతన్ పరేఖ్‌లు 2000 అక్టోబర్/నవంబర్ మాసాల్లో షేర్ల ధరలను మాయజేశారు. జి.టి.బి. కంపెనీ యు.టి.ఐ.తో విలీనమవుతున్నట్లుగా ప్రకటనకు రావడానికి ముందు ఇది జరిగింది. 23 వ్యాపార దినాల్లో జి.టి.బి. షేర్ల ధరలు 68 శాతం పెరిగాయి. నిజంగా ఈ రెండు కంపెనీల విలీనం జరిగివుంటే ఈ షేర్ల ధరల్లో మాయలమరాటీ తంత్రాల ద్వారా యు.టి.ఐ. వాటాదారులు భారీ మొత్తాలను కోల్పోయేవారు. యు.టి.ఐ. ఛైర్మన్‌కి సైతం ఈ వ్యవహారంలో ప్రమేయముంది. జి.టి.బి. కంపెనీకి చెందిన 20 శాతం వాటాలను కేతన్ పరేఖ్ నిర్మా కంపెనీ ఓనర్ కర్సన్‌బాయి పటేల్‌తో జతగట్టి రహస్యంగా కొనేశాడు. ఇలా పెంచబడిన ధరలకు జి.టి.బి. వాటాలను యు.టి.ఐ. కొనేయగానే కేతన్‌పరేఖ్, అతడి జతగాళ్ళు తమ షేర్లను ఆ రేటుతో వదిలించుకుని అపార లాభాలను కొల్లగొట్టారు. ఇది జి.టి.బి. షేర్ విలువ కుప్పగూలేందుకు దారితీసింది. మొత్తానికి ఈ సందర్భంలో జి.టి.బి. కంపెనీ వాటాలను మార్కెట్‌లో వేలం వెర్రిగా కొనుక్కున్న యు.టి.ఐ. కంపెనీ వాటాదార్లే భారీగా నష్టపోయారు. పైగా యు.టి.ఐ. కూడా అనేక అనుమానాస్పదమైన వాటాలలో భారీ మొత్తాలను మదుపు పెట్టింది. ఇలా వేల్స్‌పన్ ఇండస్ట్రీస్ (రిజర్వ్ బ్యాంక్ అప్పటికే దీన్ని పక్కా పన్నుల ఎగవేతదారుగా గుర్తించి పక్కన బెట్టింది) ఎమ్టెక్స్ ఇండస్ట్రీస్ (దీనికి వ్యతిరేకంగా అప్పటికే ఒక పిటీషన్ కూడా వుంది) వగైరా కంపెనీలలో యు.టి.ఐ. మదుపు పెట్టింది.

అయితే మారిషస్‌లో నెలకొన్న విదేశీ కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో పరోక్షంగానూ పాశ్చాత్య దేశాల నుండి ప్రత్యక్షంగానూ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కొద్దిమంది విదేశీ సంస్థాగత మదుపుదార్లే ఈ భారీ కుంభకోణంలో ప్రధాన పాత్రధారులు. మోర్గాన్ స్టాన్లీ, లజార్డ్ ఫిన్, డ్యూచ్ (Deutsche) ఇంటర్నేషనల్, క్రెడిట్ స్యూసీ ఫస్ట్ బోస్టన్ ఇంకా మరికొన్ని భారీ మదుపు బ్యాంకర్లు కూడా దీంట్లో భాగం. 2000 సం॥రం ప్రారంభం నుండి ఈ విదేశీ సంస్థాగత మదుపుదార్ల లావాదేవీల విలువ 1,47,000 కోట్ల రూ॥ల భారీ మొత్తానికి చేరుకుంది. దీంట్లో చాలా భాగం కేతన్ పరేఖ్ ద్వారా కె-10 సంస్థల వాటాల్లోకి ప్రవేశించింది.

ఇంత భారీస్థాయి మొత్తాలు వచ్చిపడినందువల్ల స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రత్యేకించి 2000 సం॥రం మొదట్లో తారాస్థాయిలో పైకెగిసిందంటే ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. 2000 సం॥రంలో 5,000 వద్ద మొదలైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచి ఫిబ్రవరి 15 నాటికి 6,150 కి పెరిగింది. అంటే కేవలం 6 వారాల్లో, 2 లక్షల కోట్ల రూ॥ల విలువకు పెరిగింది. ఇదే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచి 2001 మార్చిలో 3,096 పాయింట్లతో కుప్పగూలి పోయింది.

**బి. స్టాక్ పతనం :**

మోర్గాన్ స్టాన్లీ కంపెనీ తన వాటాలను భారీ ఎత్తున వదిలించుకోవటం... అంటే అమ్మెయ్యడం ద్వారా మార్చి 1న, స్టాక్ పతనానికి నాంది పలికింది. యఫ్.ఐ.ఐ.లతో కూడిన వాటా కొనుగోలుదార్ల సిండికేటు వారి భారతీయ ఏజెంట్లు ఓ పథకం ప్రకారం స్టాక్ మార్కెట్‌ని బాదడం మొదలెట్టారు. ఉదా॥ జె.ఎమ్. మోర్గాన్ స్టాన్లీ కంపెనీకి చెందిన 130 కోట్ల రూ॥ల విలువైన వాటాలు మార్చి 1న, మరో 50 కోట్ల రూ॥ల విలువైన సెక్యూరిటీలు మార్చి 2న అమ్మేయబడ్డాయి. ఇవన్నీ సత్యం కంప్యూటర్స్, ఇన్ఫోసిస్, హెచ్.యఫ్.సి.యల్., జీ మొదలైన కె-10గా పేరుపడ్డ సంస్థల వాటాలే. ఇన్ఫోసిస్ కంపెనీ షేర్ల విలువలు ఒకే ఒక రోజులోనే 350 రూ॥ల మేరకు భారీగా పడిపోయాయంటే ఎంత పెద్ద ఎత్తున షేర్ల అమ్మకాలు జరిగాయో అర్థమౌతుంది. ఆ ఒక్క రోజులోనే ఇన్ఫోసిస్ మొత్తం షేర్లలో 5 శాతం అమ్మివేయబడినాయి.

2001 మార్చి 1 నుంచి 13 దాకా 8 వ్యాపార సెషన్‌లలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ దాదాపు 700 పాయింట్లను కోల్పోయింది. 2,000 సం॥రం ఫిబ్రవరి నుండి 2001 సం॥రం మార్చి మధ్యకాలంలో బి.ఎస్.ఇ. 2 లక్షల కోట్ల రూ॥ల మార్కెట్ విలువను కోల్పోయింది.

స్టాక్ మార్కెట్ ఏ మేరకు పైకెత్తబడిందో క్రింది పట్టిక చిత్రణ ఇస్తుంది.

| కంపెనీలు | ఇండెక్స్ విలువ | |
|---|---|---|
| | ఫిబ్రవరి 2000 | మార్చి 2001 |
| ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ | 8,902 | 4,709 |
| డి.యస్.క్యు. సాఫ్ట్‌వేర్ | 1,651 | 67 |
| సిల్వర్‌లైన్ టెక్నాలజీస్ | 985 | 61 |
| సత్యం కంప్యూటర్ సర్వీసెస్ | 5,050 | 190 |
| విప్రో | 6,600 | 1,594 |
| హెచ్.యఫ్.సి.యల్. | 1,693 | 194 |
| జీ | 1,022 | 127 |

(తరువాయి 22వ పేజీలో...)

# మెజారిటీ ప్రజల ప్రయోజనాల

పదో పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన చైనా కమ్యూనిస్టు పార్టీ నిబంధనావళి చాలా స్పష్టంగా ఇలా ప్రకటిస్తోంది. 'చైనాలోని, ప్రపంచంలోని విస్తృత మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసమే కమ్యూనిస్టులు పనిచేయాలి'.

ఈ డిమాండ్‌కు అనుగుణంగా చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరూ తమ ప్రాపంచిక దృక్పథాన్ని తిరిగి మల్చుకోవడం కోసం కష్టించి పనిచేయాలి. విస్తృత మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం పార్టీని నిర్మించే లక్ష్యం కోసం పట్టుదల చూపాలి. శ్రామికవర్గ నియంతృత్వం కింద విప్లవాన్ని కొనసాగించడంలోనూ చైనా ప్రజలకు, ప్రపంచ ప్రజలకు హృదయపూర్వకంగా సేవ చేయటంలో, ఛైర్మన్ మావో విప్లవ పంథాను అంటి పెట్టుకుని వేగంగా పురోగమించడంలో వారు దృఢమైన వీరయోధులుగా వుండాలి.

### పార్టీ నిర్మాణంలో శ్రామికవర్గ లక్ష్యం :

#### విస్తృత మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయటం

మన పార్టీని నిర్మించే క్రమంలో, ఛైర్మన్ మావో చైనా ప్రజల, ప్రపంచ ప్రజల్లోని విస్తృత మెజారిటీ ప్రయోజనాల కోసం పనిచేసే పార్టీని నిర్మించే ఉద్దేశ్యాల గురించి పార్టీ సభ్యులందరికీ నిశితంగా బోధిస్తూ వచ్చాడు.

కా॥ మావో ఇలా చెప్పాడు. **''కమ్యూనిస్టు పార్టీ ఒక రాజకీయ పార్టీ. అది దేశ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తుంది. దానికెలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేవు''.... ''ప్రజల్లోని విస్తృత మెజారిటీ ప్రయోజనాల కోసం, చైనా ప్రజల, ప్రపంచ ప్రజల్లోని విస్తృత మెజారిటీ ప్రయోజనాల కోసం మనం పనిచేయాలి. కొద్దిమంది వ్యక్తుల కోసం, దోపిడీ వర్గాల కోసం, బూర్జువాల కోసం, భూస్వాముల కోసం, ధనిక రైతుల కోసం, విప్లవ ప్రతీఘాతకుల కోసం, దుష్టుల కోసం, మితవాదుల కోసం మనం అస్సలు పనిచేయ కూడదు.''**

శ్రామికవర్గ రాజకీయ పార్టీ స్వభావం, దాని చారిత్రక లక్ష్యాల రీత్యా ఛైర్మన్ మావో ఇచ్చిన ఈ సూచనలు పార్టీ నిర్మాణ లక్ష్యాన్ని దృఢంగా వ్యక్తీకరిస్తున్నాయి.

కార్మికవర్గం అనేది కడు దూరదృష్టి కలిగి, అత్యంత నిస్వార్థంగా వుంటూ మానవ చరిత్రలోకెల్లా అత్యంత సమగ్రమైన విప్లవకర వర్గం. మానవజాతి మొత్తాన్ని విముక్తం చేసినపుడు మాత్రమే కార్మికవర్గం అంతిమంగా తన్ను తాను సైతం విముక్తం చేసుకోగలదు. అందుచేత, కార్మిక వర్గానికి, జనాభాలోని అత్యధిక మెజారిటీగా వున్న ప్రజారాసులకు మధ్య నెలకొన్న ప్రయోజనాలకు ఒక మౌలిక ఏకత్వం వుంది.

### పార్టీ నిర్మాణంలో బూర్జువా వర్గ లక్ష్యం :

#### కొద్దిమంది ప్రయోజనాల కోసం పనిచేయడమే

చెన్ టూ షి నుండి మొదలుకుని మన పార్టీలోని సకల అవకాశవాద పంథాల నేతలందరూ విస్తృత మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయడాన్ని వ్యతిరేకించినవారే. 'పర్వత ప్రాంత తత్వా'న్ని కల్గివుంటూ, ఒంటెత్తువాదం (ఉలిపికట్టె ధోరణి)లో మునిగి తేలుతూ, వీరు మన పార్టీ కార్మికవర్గ స్వభావాన్ని మార్చి, కార్మికవర్గ పార్టీని కొద్దిమంది దోపిడీదారుల ప్రయోజనాలకు ఉపయోగపడే సాధనంగా మార్చే ప్రయత్నంలో అవకాశవాద పంథాలను ముందుకు తీసుకు వచ్చారు.

లెనిన్ ఇలా చెప్పాడు. **''వాస్తవంలో, కార్మికవర్గ పార్టీల్లో అవకాశవాదుల లాంఛనప్రాయమైన సభ్యత్వం, ఏ రకంగానూ వారు వస్తుగతంగా బూర్జువా వర్గ రాజకీయ విభాగంగా, దాని ప్రభావాన్ని మోసుకుపోయేవారుగా, కార్మికోద్యమంలోని తొత్తులుగా వుంటున్న వాస్తవాన్ని కప్పిపుచ్చలేదు.''**

స్వార్థపూరితమైన, లాభాలు దండుకునే దోపిడీ వర్గం, పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గాన్ని ఇతర శ్రామిక ప్రజలను దోపిడీ చేసి బానిసలుగా చేసుకుని ఇతరుల శ్రమ ఫలితాల ఆధారంగా తన సంపదలను పెంచుకుంటుంది. వివిధ అవకాశవాద పంథాల నేతల యొక్క బూర్జువా వర్గ స్వభావం వారు మైనారిటీ ప్రయోజనాల కోసం పార్టీని నిర్మించేందుకు మొండి పట్టుదలతో వుండేలా నిర్దేశిస్తుంది. అవకాశవాద, రివిజనిస్టు పంథాలను ప్రోత్సహించడం ద్వారా వీరు కార్మికవర్గాన్ని, ప్రజారాసులను బూర్జువావర్గపు వివిధ గ్రూపుల, పార్టీల వ్యక్తిగత ప్రయోజనాలకు లోబర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

బూర్జువా వర్గ ప్రతినిధులుగా బడా పెట్టుబడిదారులే వుండి తీరాల్సిన అవసరం లేదని చారిత్రక అనుభవాలు మనకు తెలియజేస్తున్నాయి. కృశ్చేవ్, బ్రెజ్నెవ్, లిషావ్‌చీ, లిన్‌పియావో వంటి పేరుకు మాత్రమే కమ్యూనిస్టులుగా వున్నవారు వాస్తవంగా బూర్జువా వర్గ ప్రతినిధులు. సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా, వారి జీవన విధాన పరంగా కూడా వీరు సంపూర్ణంగా బూర్జువాలుగానే మారిన పక్కా రివిజనిస్టులు. భూస్వాములు, పెట్టుబడిదారులు తమకు తాముగా నేరుగా బరిలోకి దిగటం కన్నా, విప్లవ శ్రేణుల నుండి బయటకు లాగిన తమ ఏజెంట్లను, లేక విప్లవ శ్రేణులలోకి చొరబడిన శత్రువులను 'కమ్యూనిస్టుల' ముసుగులో తమకోసం పనిచేసేలా ఏర్పాటు చేసుకోవడమే వారికి చాలా అనుకూలమైనట్టిది. సమాజంలో అప్పటికే భూస్వాములు, పెట్టుబడిదారులు బహిర్గతమై ప్రజల అసహ్యానికి గురై వున్న పరిస్థితుల్లో పై పద్ధతి మరింత సందర్భోచితంగా వుంటుంది. ఈ

# కోసమే కమ్యూనిస్టులు పనిచేయాలి

**- హుంగ్‌యాన్**

వర్గ పోరాట స్వభావ సూత్రాల్ని, సోషలిస్ట్ దశలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని మనం గుర్తించి తీరాలి. మన జాగరూకతను పెంచుకోవాలి. **''మార్క్సిజాన్ని పాటించండి, రివిజనిజాన్ని కాదు; ఐక్యంగా వుండండి చీలిపోవద్దు; దాపరికం లేకుండా నిష్కల్మషంగా వుండండి; కుట్రలు, కుతంత్రాలకు తావీయకండి.''** అంటూ ఛైర్మన్ మావో ముందుకు తెచ్చిన మూడు మౌలిక సూత్రాలను మనం ఎత్తిపెట్టాలి.

### పార్టీ మౌలికపంథాను అమలు పర్చడం

పార్టీ మౌలిక పంథా నుండి వైదొలగటం అంటే ప్రజల దీర్ఘకాలిక, మొత్తం ప్రయోజనాల నుండి వైదొలగడమే. ప్రస్తుత సోషలిస్ట్ విప్లవాన్ని, సోషలిస్ట్ నిర్మాణాన్ని అనుసరించాల్సిన మౌలిక సూత్రాల నుండి, విధానాల నుండి పక్కకుపోతే విస్తృత ప్రజానీకం ప్రయోజనాల కోసం పనిచేయటం అసాధ్యమే అవుతుంది. ఎప్పుడైనా, ఎక్కడైనా పార్టీ మౌలిక పంథాను దృఢంగా కొనసాగించినంతవరకు విప్లవమూ, నిర్మాణమూ రెండూ సవ్యమైన మార్గంలోనే పురోగమించాయని, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కార్యాచరణ బాగా జరిగిందని ఆచరణలో పదే పదే రుజువైంది. ఇందుకు వ్యతిరేకంగా పోతే విప్లవం, నిర్మాణం రెండూ సమగ్ర దృష్టిని, సరైన మార్గాన్ని కోల్పోయి, కార్యాచరణ వెనుకపట్టు పట్టడమేగాక ప్రజా ప్రయోజనాలకు ఆటంకాలు ఎదురవుతాయని కూడా విప్లవాచరణ నిరూపించింది.

పార్టీ మౌలికపంథాను అమలుపర్చడమనేది తీవ్రమైన వర్గపోరాట క్రమంతో ముడిపడి వుంటుంది. దేశంలోని, విదేశాల్లోని వర్గ శత్రువుల ప్రతిఘటనతో పాటు తప్పుడు పంథాల, ధోరణుల జోక్యాన్ని, కుట్రలను ఎదుర్కోవాల్సి వుంటుంది. అందుకని, దేశంలోని కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రతి సభ్యుడూ/ సభ్యురాలూ సర్వవేళలా చైనాలోని, ప్రపంచంలోని విస్తృత మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయడానికి పట్టుదలతో వుండాలి. పంథామీద, మొత్తం పరిస్థితి మీద చూపు సారిస్తూనే, ఒక పార్టీ సభ్యుడు/సభ్యురాలు ఎల్లవేళలా ప్రజా ప్రయోజనాలను మనసులో వుంచుకుని ఏటికి ఎదురీదడంలోని విప్లవ స్ఫూర్తిని ప్రదర్శిస్తుండాలి. అతడు/ఆమె సరైన దానికి దృఢంగా అంటి పెట్టుకుని తప్పుడు విషయాన్ని వ్యతిరేకించి, ప్రతిఘటించాలి. అన్నిరకాల తప్పుడు పంథాలూ, ధోరణులూ కొద్దిమందిగా వున్న దోపిడీ వర్గాలకే మేలు చేకూరుస్తూ విశాల ప్రజానీకానికి హాని చేకూరుస్తాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడటం అంటే పార్టీ మౌలిక పంథాని పరిరక్షించటం, వాస్తవాచరణ ద్వారా ప్రజల ప్రయోజనాలను ఎత్తిపట్టడమే అవుతుంది. అయితే ఈ పోరాట క్రమంలో సరైన, తప్పుడు పంథాల మధ్య విభజన రేఖను జాగ్రత్తగా, ఖచ్చితంగా నిర్ణయించుకోవాలి. అప్పుడు మాత్రమే రెండు పంథాల మధ్య, రెండు సిద్ధాంతాల మధ్య పోరాటాన్ని సరిగానూ, క్రియాశీలంగానూ నిర్వహించడానికి వీలవుతుంది.

కొంతమంది కామ్రేడ్స్ విషయానికి వస్తే వారు సరైన పంథాకు, తప్పుడు పంథాకు, ధోరణులకు మధ్య తేడాలను గమనించలేక పోవటమనేది పెద్ద సమస్యగా లేదుకానీ, **తమ సొంత ప్రయోజనాలు ఎక్కడ దెబ్బతింటాయో అనే భయంతో తప్పుడు పంథాకి, ధోరణికి వ్యతిరేకంగా పోట్లాడటానికి సాహసించక పోవడమే అసలైన సమస్యగా వుంటోంది. ఇటువంటి కామ్రేడ్స్ సమస్యను దాటేయడానికే అనుకూలంగా వుంటారు. వీరు కీలక సమస్యలపట్ల నిబద్ధులై వుండరు.** ఇలాంటి వైఖరిని కమ్యూనిస్టులు ఏ మాత్రం చేపట్టకూడదు.

### విస్తృత మెజారిటీ ప్రజలతో ఐక్యం కావటం

దేశంలో, కార్మికవర్గ అంతర్జాతీయతను బలోపేతం చేసి, సోషలిజాన్ని నిర్మించడానికి మెజారిటీ ప్రజలను ఐక్యపర్చాలి. ఇక అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదాన్ని, రివిజనిజాన్ని, ప్రతీఘాతుకాన్ని వ్యతిరేకించి, ప్రపంచ ప్రజల విప్లవ పోరాటాలను బలపర్చేందుకోసం ప్రపంచంలోని మెజారిటీ ప్రజలను ఐక్య పర్చాల్సిన అవసరం కూడా వుంది.

కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మనం ఒక చిన్న ముఠా ప్రయోజనాల కోసం పార్టీ, ప్రజల ప్రయోజనాలను ఎన్నటికీ బలిపెట్టరాదు. 'పర్వత ప్రాంత మనస్తత్వం' కల్గి వుంటూ ఒంటెత్తువాదాన్ని ఆచరిస్తున్న వారు కొద్దిమంది సంకుచిత ప్రయోజనాల కోసమే కట్టుబడి పార్టీ, ప్రజల మొత్తం ప్రయోజనాలను చూడలేక పోతున్నారు. ఇది కొనసాగితే వారు ఒంటెత్తువాదాన్ని పార్టీకంటే పై స్థాయిలో నిలిపి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను సాగించడంలో కుమ్మక్కై చరిత్ర హీనులై పోతారు.

**మన పార్టీ శ్రేణులలో భిన్నాభిప్రాయాలు వుండటం చాలా సహజం. అయితే భిన్నాభిప్రాయాలకు సంబంధించి ఏ వైఖరిని చేపట్టాలన్నదే అసలు సమస్య.**

కొంతమంది తమ దృక్పథాలనే కల్గివుంటున్న వారితో అతి సన్నిహితంగా వుంటారు. తమకు భిన్నమైన అభిప్రాయాలు కల్గిన వారి పట్ల విముఖత కల్గి వుంటారు. ఈ భిన్న దృక్పథాలూ, భావాలూ మార్క్సిస్ట్ సూత్రాలకు, ప్రజల ప్రయోజనాలకు, కార్మికవర్గ పార్టీ స్ఫూర్తికి, పార్టీ విధానానికి అనుగుణంగా వున్నాయా లేదా అనే దాంతో నిమిత్తం లేకుండా పై విధంగా వ్యవహరిస్తుంటారు. కొన్ని సందర్భాలలో వీరు ఇతరులను మించి పనిచేయడానికి మాత్రమే ప్రయత్నిస్తుంటారు. ఇవన్నీ మొత్తం ప్రయోజనాలను పూర్తిగా లక్ష్యపెట్టని తరహా వ్యక్తీకరణలే. వీరు విస్తృత మెజారిటీ ప్రజలను ఐక్యం చేసే లక్ష్యానికి నష్టం కల్గిస్తూ, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వుంటుంటారు.

### కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని పెంచుకోవటం

ముఖ్యంగా చెప్పాలంటే, ఎవరి ప్రయోజనాలకు పని

చేయాలన్నది ప్రాపంచిక దృక్పథానికి సంబంధించిన సమస్య. తన ప్రాపంచిక దృక్పథాన్ని పెంచుకుని సొంతానికి సంబంధించిన ఎలాంటి ఆలోచనలూ లేకుండా సంపూర్ణంగా ఇతరుల కోసమే అంకితమయ్యే కమ్యూనిస్టు స్ఫూర్తిని కలిగి వున్నపుడు మాత్రమే కమ్యూనిస్టు పార్టీ సభ్యులు మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం తమ్ముతాము అర్పించుకోగలరు. గడచిన విప్లవ యుద్ధాలలో మన పార్టీ సభ్యులు పలువురు యుద్ధరంగంలో సాహసోపేతంగా పోరాడి, రక్తం ధారపోసి అసువులు బాశారు. అనేకమంది కరకు కత్తుల బారిన పడి సడలని ధైర్యంతో మృత్యువును ఎదుర్కొన్నారు. పలువురు అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో చైతన్యపూరితంగా పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ, విప్లవకర ఆశావాదంతో నిర్భయంగా పనిచేశారు. సాధారణ పనికి సంబంధించిన స్థానాల్లో వుండి అత్యంత విశ్వసనీయంగా పనిచేస్తూ వారు ప్రజలకు గణనీయంగా సహాయపడినారు. తమ కార్యాచరణకు మార్గదర్శిగా పనిచేసిన వారి ప్రాపంచిక దృక్పథమే వారు ఇంత కఠిన శ్రమకోర్చి పనిచేయగలిగేలా చేసింది.

ఛైర్మన్ మావో ఇలా చెప్పాడు. **''కాస్తంత మంచిని తలపెట్టడం ఎవరికైనా ఏమంత కష్టం కాదు. కానీ జీవితం పొడవునా మంచే చేస్తూ పోవటం, ఎన్నటికీ చెడు తలపెట్టక పోవటం, ప్రజా రాసుల, యువజనుల, విప్లవ ప్రయోజనాల కోసం దృఢంగా నిలబడి పనిచేయటం, దశాబ్దాల తరబడి కఠిన తరమైన పోరాటంలో నిమగ్నమై వుండటం అనేదే కష్టమైనది. ప్రపంచంలో అన్నిటికంటే కష్టమైనది ఇదే''.**

విధ్వంసం లేనిదే నిర్మాణం లేదు. కార్మికవర్గ దృక్పథాన్ని పెంచుకోవాలంటే బూర్జువా ప్రాపంచిక దృక్పథంపై మినహాయింపులు లేని విధంగా విప్లవ విమర్శను సాగించి తీరాలి. బూర్జువా ఉత్పత్తి సంబంధాల ఫలితమే బూర్జువా ప్రాపంచిక దృక్పథం. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి సాధనాల ప్రైవేట్ యాజమాన్యానికే సేవ చేస్తుంది. కొద్దిమంది ప్రయోజనాల కోసం పార్టీని నిర్మించే సైద్ధాంతిక మూలం ఇది. బూర్జువా భావాలతో వున్న వ్యక్తికి మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయటం అసాధ్యమని పార్టీలోని అంతర్గత పోరాటాచరణ తేల్చి చెప్పింది.

ప్రతి కమ్యూనిస్టూ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, ఛైర్మన్ మావోల రచనల్ని బుద్ధిపూర్వకంగా అధ్యయనం చేయాలి. గతితార్కిక, చారిత్రక భౌతికవాద శక్తితో సాయుధం కావడానికి శ్రమించాలి. రివిజనిజాన్ని, బూర్జువా ప్రాపంచిక దృక్పథాన్ని విమర్శించాలి. కార్మికవర్గపు పురోగామి శక్తిగా తన పాత్రను సంపూర్ణంగా పోషించాలి. చైనాలోని, ప్రపంచంలోని విస్తృత మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోసం జరిగే మహత్తర పోరాటానికి నూతన సహకార మందించాలి.

**(- 'పెకింగ్ రివ్యూ' నెం.49, డిసెంబర్ 1973 సంచిక నుండి....)**

---

(19వ పేజీ తరువాయి...)

అనుకోకుండా స్టాక్ మార్కెట్ పతనం మధ్యలోనే మార్చి 12నే తెహెల్కా డాట్‌కామ్ బయటపెట్టిన రక్షణశాఖ గుట్టుమట్లు వెల్లడయాయి. దీంతో వాటా కొనుగోలుదార్ల సిండికేట్‌కి మరింతగా ప్రయోజనం కల్గిస్తూ షేర్ల విలువలు ఇంకా పడిపోయాయి. ఈ సందర్భంగా, బాంబే స్టాక్ ఎక్చేంజ్‌లోని వాటా కొనుగోలుదార్ల సిండికేట్‌లో ముఖ్య బ్రోకర్ శంకర్ శర్మకి తెహల్కా. కామ్‌లో 15 శాతం వాటాలున్నాయని తెలియటం ఆసక్తి గొలుపుతుంది.

**సి. లూటీ**

చెప్పా పెట్టకుండా తమవద్దనున్న షేర్లను అమ్ముకుని వదిలించుకున్నవారు అపార లాభాలను చేజిక్కించుకోగా, షేర్లను కొని వుంచుకున్నవారు తమ షేర్ల విలువ కొద్దిరోజుల్లోనే దారుణంగా పడిపోవటం గమనించి గుండెలు బాదుకోవటం షేర్ల మార్కెట్లో పరిపాటే.

ఇటీవల సెబి (భారతీయ సెక్యూరిటీ మరియు ఎక్చేంజ్ బోర్డు) ఇచ్చిన నివేదిక ఈ విదేశీ సంస్థాగత మదుపుదార్లు సాధించిన లాభాల స్థాయి గురించి పేర్కొంది. విదేశీ సంస్థాగత మదుపుదార్లు మారిషస్‌లో తామేర్పరుచుకున్న బూటకపు కంపెనీల ద్వారా నిధులను మళ్ళిస్తారని, ఇందువల్ల వారు కొల్లగొట్టిన మొత్తం పన్నుల చెల్లింపును కూడా తప్పించుకుంటుందని సెబి నివేదిక పేర్కొంది. ఈ విధంగా 1999 జనవరి నుండి 2001 మార్చి వరకు పై కుహనా సంస్థలు తీసుకొచ్చిన మొత్తం 777 కోట్ల రూ॥లు కాగా అవి భారతీయ స్టాక్ మార్కెట్ నుండి 3,677 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని కొల్లగొట్టి తరలించుకు పోయాయి. ముఖ్యమైన యఫ్.ఐ.ఐ.ల అనుబంధ సంస్థలుగా పనిచేస్తున్న అనేక కుహనా సంస్థల (ఓ.సి.బి.లు: వాస్తవంగా వీటివద్ద పైసా పెట్టుబడి కూడా వుండదు) గురించి క్రింది పట్టిక సూచిస్తుంది.

**భారీ లూటీ**

| కంపెనీ పేరు (ఓ.సి.బి.) | కంపెనీకి చెల్లించిన డబ్బు (డాలర్లలో) | తీసుకొచ్చింది (కోట్లలో) | తరలించింది (కోట్లలో) |
|---|---|---|---|
| బ్రెంట్ ఫీల్డ్ హోల్డింగ్స్ | 5,000 | 109 | 663 |
| వేక్‌ఫీల్డ్ హోల్డింగ్స్ | 5,500 | 234 | 2,298 |
| కెన్సింగ్‌టన్ ఇన్వెస్ట్‌మెంట్స్ | 5,500 | 79 | 424 |
| యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్స్ | 10 | 277 | 245 |
| ఫార్ ఈస్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ | 10 | 78 | 116 |

ఆధారం : స్టాక్ కుంభకోణంపై సెబి మధ్యంతర నివేదిక

అయితే ఈ భోగస్ కంపెనీల ఏజెంట్ల యంత్రాంగం (బ్రోకర్లు, ఇతరులు) తీసుకునే కమీషన్లు, 'అంతర్గత' సమాచారం ద్వారా సృష్టించే లాభాల వంటివి కూడా కలిపితే వాటి మొత్తం

లూటీ అవి బయటకు తరలించిన లాభాల కంటే ఎక్కువగానే వుంటాయి.

## కుంభకోణం దొంగలెవరు?

రోత పుట్టించే ఈ స్టాక్ వ్యవహారాల్లో, ఒప్పందాల్లో సమాజంలో విస్తృత ప్రాతిపదికన ప్రముఖులెందరికో పాత్ర వుండటమే కాదు, ప్రపంచీకరణకి సంబంధించిన ఆర్థిక ద్రవ్యవ్యవస్థ మొత్తంగా దీంట్లో ఇరుక్కుని వుండగా మరోవైపు మీడియా కేతన్‌పరేఖ్‌ని మాత్రమే స్టాక్ కుంభకోణంలో విలన్‌గా చిత్రీకరిస్తూ ముందుకు తెస్తోంది. ఈ కేతన్ పరేఖ్ సైతం అరెస్టై జైలు నుంచి విడుదలైనప్పుడు అఖండ స్వాగతం అందుకున్నాడు. ఆరోజు కె-10గా పేరొందిన సంస్థల షేర్ల ధరలు పైకి ఎగబాకాయంటే ఆశ్చర్య పడాల్సిందేముంది. మాధవపుర కోఆపరేటివ్ బ్యాంక్‌తో కలిసి బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్ చేసిన షేర్లకు చెల్లింపులను చేయలేక పోవడమే కేతన్‌పరేఖ్ అరెస్ట్‌కి దారితీసింది. షేర్ల ధరలు కుప్పగూలడంతో తాను తీసుకున్న రుణాలను ఇతడు తిరిగి చెల్లించలేక పోయాడు.

మొదటగా మనం రోత పుట్టించే ఈ ఒప్పందాలతో సంబంధమున్న కొద్దిమంది వ్యక్తులను పరిశీలిద్దాం. తర్వాత ఇటువంటి కుంభకోణాలకు, నేరపూరితమైన వంచనకు దారితీస్తున్న విధానాలను కూడా చూద్దాం.

ముందే చెప్పినట్లుగా ఈ కుంభకోణాల్లో అసలు విలనీలు ఎవరంటే కేతన్ పరేఖ్ వంటి వారి ద్వారా వ్యవహారాలు నడుపుతూ వచ్చిన విదేశీ సంస్థాగత మదుపుదార్లు తప్ప మరెవరో కారు. కేతన్ పరేఖ్ సైతం భారీ స్థాయిలో నిధులు సాధించడానికి బ్యాంకు ఛైర్మన్లతో పొత్తు కలిపాడు. గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ కొనుగోలును పైకెత్తేందుకోసం యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌తో చేతులు కలిపాడు. షేర్ల ధరలు పెంచడానికి, తన షేర్లను నిలుపుకోడానికి ఇతగాడు పరిశ్రమాధిపతులతోనూ, ప్రముఖ రాజకీయ నాయకులతో ద్రవ్య పెట్టుబడిదార్లతో పొత్తుగలిపాడు. సినీ పెట్టుబడిదారుడైన భరత్ షా-(మ్యాచ్ ఫిక్సింగ్‌లోనూ భాగస్తుడితడు) తో హెచ్.యఫ్.సి.యల్. డైరెక్టర్ వినయ్ మాలో తో ఇతడికి సన్నిహిత సంబంధాలున్నాయి. వీరు దావూద్ ఇబ్రహీం డబ్బు మార్పిడీ వ్యవహారాల్లో మునిగి వున్నట్లు పదే పదే ఆరోపణలొచ్చాయి. వినోద పరిశ్రమలోకి కేతన్ ప్రవేశించడంలో భరత్ షా కి కీలక పాత్ర వుంది. 2000 ఏప్రిల్ నెలలో అత్యంత ప్రముఖుల విందు పార్టీలో వీరిద్దరూ కలిసే పాల్గొన్నారు. హెచ్.యఫ్.సి.యల్. డైరెక్టర్ వినయ్ మాలో, ఆస్ట్రేలియాకి చెందిన ప్రముఖ కోటీశ్వరుడు కెర్రీ పాకర్, ఇంకా అమితాబ్ బచ్చన్‌తో సహా పలువురు ముఖ్యమైన సినీతారలు ఈ పార్టీకి హాజరైనారు. ఇక 'భూకంప బాధితుల సహాయార్థం' సమాజ్‌వాదీ పార్టీనేత అమర్‌సింగ్‌కి దాదాపు 21 లక్షల రూ॥ల చెక్‌ని కేతన్ పరేఖ్ బహిరంగంగానే అందించాడు.

పైగా, స్టాక్ ఎక్ఛేంజ్‌లనే నడపగలిగిన ప్రముఖ వున్నతాధికారులు/బ్రోకర్లు సైతం ఈ అవినీతికరమైన ఒప్పందాలలో లోతుగా మునిగితేలారు.

ఈ జాబితా ఇలా సాగిపోతూనే వుంటుంది. అయితే వేలాది మధ్యతరగతి కుటుంబాలను కుప్పగూల్చేసిన ఈ భారీ మోసంలో నిజమైన విలన్లు ఎవరంటే ప్రభుత్వమూ, దాని సరళీకరణ దశ నూతన ఆర్థిక విధానాలే తప్ప మరొకరు కాదు. ఇటువంటి లూటీకి వీలు కల్పించే వ్యవస్థను తయారు చేసింది వీళ్ళే. అయితే ఇంత జరిగాక కూడా విలన్లు ఏ చర్యా లేకుండా తప్పించుకొన్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల జోలికి ఎవరూ పోలేదు. కేతన్ పరేఖ్ జైలు బయటే అఖండ స్వాగతమందుకున్నాడు. స్టాక్ ఎక్ఛేంజ్‌లోని ఉన్నతాధికార్లు కేవలం రాజీనామా చేసి తమవంతు దోపిడీ సొత్తును పట్టుకెళ్ళారు. ఇక పరిశ్రమాధిపతులు తెరవెనుక నుండి నైపుణ్యంగా పావులు కదిపారు. ఇక ఈ అందరికంటే మిన్నగా 812 కోట్ల రూ॥ల ప్రభుత్వ బ్యాంకుల రుణాలను '90 ల మొదట్లో ఎగ్గొట్టిన అతిపెద్ద మోసగాడు, షేర్ల వ్యాపారి హర్షద్ మెహతా ముంబాయిలోని తన అత్యంత విలాసవంతమైన భవంతి నుండి విదేశీ కార్లలో జల్సాగా, నిర్భయంగా, స్వేచ్ఛగా తిరగడం కొనసాగిస్తూనే వున్నాడు.

## వ్యవస్థాగత లోపం

ఈ కుంభకోణంలో పాత్రధారులు చంబల్ బందిపోట్లకు మించినవారే అనటంలో సందేహమే లేదు. లక్షలాది జీవితాలను కుప్పగూల్చేసినందుకుగాను వీరిని విచారించి గరిష్ఠ శిక్షలు వేయాల్సిందే. అయితే ఈ విషపురుగులను పెంచి పోషిస్తున్న వ్యవస్థనే మొత్తంగా మార్చనంత కాలం శిక్షలు మాత్రమే సమస్యను పరిష్కరించలేవు.

గత మూడు సం॥లుగా పెట్టుబడి మార్కెట్లను నిస్సిగ్గుగా ప్రభావితం చేసిన తీరు గతంలో ఎన్నడూ జరగలేదు. వాస్తవంగా, యోగ్యత లేని చర్యల ద్వారా, పలుకుబడిని వాడుకోవటం ద్వారా, అవధులు మీరిన అవినీతి ద్వారా ఆర్థిక రంగాన్ని మొత్తంగా అత్యంత సంకుచిత ప్రయోజనాల కోసం కొల్లగొట్టడం జరిగింది. ఇటీవలి ప్రభుత్వ విధానాలను గమనించినా అవి ద్రవ్య మార్కెట్లలో మరింతగా సట్టా వ్యాపారాన్ని ప్రోత్సహించడానికే ముందుకు వచ్చాయని అర్థమౌతుంది. ఇటీవలి బడ్జెట్ సైతం దీనిమీదే ప్రధానంగా దృష్టి సారించింది.

గత కొద్ది సం॥లుగా స్టాక్ మార్కెట్‌లో బ్యాంక్ పెట్టుబడులకు సంబంధించిన రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శక సూత్రాలను గణనీయ స్థాయిలో సరళతరం చేశారు. ద్రవ్య సరళీకరణ క్రమంలో భాగంగా స్టాక్ ఎక్ఛేంజ్‌లను పైకెత్తేందుకోసం 1960 అక్టోబర్‌లో ఆర్.బి.ఐ. నూతన మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది. ఇవి బ్యాంకులను వాటి మొత్తం డిపాజిట్లలో 5 శాతం మేరకు షేర్లలో మదుపు చేయడానికి అనుమతించాయి. గత సం॥రం సెప్టెంబర్‌లో షేర్ మార్కెట్‌లో బ్యాంకులకు మరింతగా మదుపులు పెట్టేందుకు అనుమతిస్తూ సూత్రాలను మరింతగా సరళతరం చేశారు.

పైగా, షేర్లను రుణాల చెల్లింపుల సెక్యూరిటీలుగా జమచేసి వుంటే షేర్ బ్రోకర్లకు రుణాలను అందివ్వడానికి కూడా బ్యాంకులను అనుమతించారు. దీంతో సట్టా ప్రయోజనాల కోసం

బ్యాంకు నిధులను నిరంతరాయంగా వాడుకునేందుకు బ్రోకర్లకు అనుమతి దొరికింది.

స్టాక్ ఎక్చేంజ్‌లో గరిష్ట నిధులను వుంచేందుకుగాను (ప్రత్యక్షంగా లేక యు.టి.ఐ. లాంటి మ్యూచువల్ ఫండ్స్ రూపంలో) గత రెండు సం॥లుగా అన్ని రకాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను ప్రభుత్వం నిరంతరాయంగా తగ్గిస్తూ వచ్చింది.

ప్రభుత్వం చట్టబద్ధంగా, చట్ట విరుద్ధ రూపంలోనూ స్టాక్ ఎక్చేంజ్‌లో షేర్లపై అంచనాలను ప్రోత్సహిస్తూ వచ్చింది. వాటా కొనుగోళ్ళు, సట్టా సరకులు (ఫ్యూచర్స్ : భవిష్యత్తులో సరఫరా చేయడానికి కొని అమ్మిన సరకులు) వగైరా వాణిజ్య కాంట్రాక్టులలో వ్యాపారానికిగాను తలుపులు తెరిచేయటం ద్వారా ప్రభుత్వం స్టాక్ ఎక్చేంజ్‌లలో (చట్టబద్ధమైన) అంచనాల వ్యవహారాలను విస్తృతంగా పెంచేసింది. పైగా ఇది సమాంతర స్టాక్ (Badla) మార్కెట్ విషయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరించింది. 3,000 కోట్ల రూ॥లతో 32 శాతం లాభాలను అందిస్తున్న దేశంలోకెల్లా అతిపెద్ద సమాంతర షేర్ మార్కెట్‌తో సి.యస్.ఇ. సంబంధం పెట్టుకుంది.

వీటన్నింటికంటే భారత స్టాక్ ఎక్చేంజ్‌లపై విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఆధిపత్యాన్ని, ఆజమాయిషీని ప్రోత్సహించేందుకు వీలు కల్పించే పలు పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. యఫ్.ఐ.ఐ.లకు మారిషస్‌లో పన్నులు లేని కంపెనీల స్థాపనకు అనుమతించటం ద్వారా పన్నుల చెల్లింపులు లేకుండా దేశంలో సాధించిన భారీ లాభాలను బయటకు తరలించుకు పోవడానికి వాటికి ప్రభుత్వం అనుమతించింది. భారత షేర్ మార్కెట్‌లో యఫ్.ఐ.ఐ. పెట్టుబడుల పరిమితిని 49 శాతంకి పెంచుతూ ఈసారి బడ్జెట్‌లో మార్పులు చేశారు. 'భాగస్వామ్య పత్రాలు' వంటి సాధనాల ద్వారా యఫ్.ఐ.ఐ. కొనసాగించే కార్యకలాపాలపై కాగితాలలో రాసుకున్న ఆంక్షలకు సంబంధించి కూడా ప్రభుత్వం పలు దొంగదార్లను సృష్టించింది.

చివరగా దేశంలోని స్టాక్ ఎక్చేంజ్‌లను సరైన రీతిలో పనిచేసేలా చూసేందుకు ఏర్పడిన సెబి (SEBI) సైతం ఆంక్షలను విధించటం కంటే మాఫియాతో కుమ్మక్కవడానికే పరిమితమై పనిచేస్తోంది. ఇది కోడిపిల్లలను బాగా చూసుకోమని నక్కను కోరినట్లుగా వుంది. దొంగలు పడ్డ ఆర్నెల్ల తర్వాత మాత్రమే 'సెబి' మేల్కొంటోంది. ఉదా॥ 2000 సం॥రం పొడవునా షేర్ మార్కెట్లు స్పష్టంగా విపరీత కొనుగోళ్ళతో ఆకాశానికి ఎగురుతుంటే సెబి అధికారులు చేసిందేమీ లేదు. మార్కెట్ కుప్పగూలాక వారాల తర్వాత మాత్రమే వీరు మేల్కొన్నారు. ఇక తీసుకున్న చర్యలు సైతం ఏ విధంగానూ జరిగిన మోసాన్ని అడ్డుకునే స్థాయిలో లేవు. 1998లో హర్షద్ మెహతాతో కుమ్మక్కై షేర్ మార్కెట్‌లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ (అపార లాభాలను దండుకోవడానికి, ముందే తెలిసిన సమాచారంపై ఆధారపడి షేర్ల విలువలను మార్చేసే వ్యాపారం) లో పాల్గొన్నట్లుగా రుజువైన మూడు కంపెనీలు-వీడియోకాన్, బి.పి.ఎల్., స్టెరిలైట్‌లకు వ్యతిరేకంగా తేలికపాటి చర్యలను తీసుకోడానికే 'సెబి'కి మూడేళ్ళు పట్టింది. పైగా, 3,500 కోట్ల రూ॥ల విలువైన ప్రభుత్వ రంగ కంపెనీ బాల్కోలోని 51 శాతం షేర్లను 550 కోట్ల రూ॥ల నామమాత్ర ధరకే ప్రవాస భారతీయ కంపెనీ స్టెరిలైట్‌కి అమ్మేయటం ద్వారా ప్రభుత్వం ఇలాంటి కంపెనీలను మరింతగా ప్రోత్సహిస్తోంది. ఈ భారీ స్థాయి దగా పరిణామాలేవిటో ప్రభుత్వానికి బాగా తెలిసే వున్నప్పటికీ ఇలా జరిగింది.

కాబట్టి ఆర్థిక వ్యవస్థలోని ప్రపంచీకరణ, సరళీకరణల విధానం మొత్తంగా దేశంలోపలి సట్టా పెట్టుబడులకు ప్రత్యేకించి విదేశీ పెట్టుబడి కార్యకలాపాలకు మరింతగా వీలు కల్గించే మార్గంలో పోతోంది. క్రమక్రమంగా తమ పొదుపు మొత్తాలను కోల్పోతున్న పట్టణ మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులే దీంట్లో బాధితులు. ఈరోజు తమ పొదుపు మొత్తాలపై సురక్షితంగా లాభాలు అందుకునే మార్గం మధ్యతరగతికి ఏదీ లేదు. ఇందుకు సంబంధించి గతంలో వుండిన రక్షణ ఈరోజు లేదు. వాస్తవ ద్రవ్యోల్బణ రేట్ల కంటే తక్కువస్థాయికి ప్రభుత్వం వడ్డీరేట్లను తగ్గించింది. వందలాది యన్.బి.యఫ్.సి.లు, చిన్న బ్యాంకులు కుప్పగూలి పోతున్నాయి. రియల్ ఎస్టేట్ ధరలు అడుగంటి పోతున్నాయి. ఇక స్టాక్ మార్కెట్‌లో మోసాలు, మాయలు... ఒకటేమిటి మధ్యతరగతి ప్రజల పొదుపులకు వాస్తవంగానే నేడు రక్షిత స్థలం లేకుండా పోయింది.

అయితే పట్టణ మధ్యతరగతి ప్రజలు తమకు ఏం జరుగుతూందో తెలీని విధంగా దెబ్బమీద దెబ్బ తింటుండగా, విదేశీ పెట్టుబడిదారులు, వారి దళారీ ఏజెంట్లు నమ్మశక్యం కానంత లాభాలు దండుకుంటున్నారు. దీంట్లో చాలా భాగం విదేశాలకు తరలి పోతోంది. టి.వీ.ల, కంప్యూటర్ల, వస్తు వ్యామోహతత్వపు తళుకుబెళుకుల ముప్పేట దాడితో ఇప్పటికైతే చేష్టలు దక్కి క్రియాశూన్యులుగా వుంటున్న మధ్యతరగతి ప్రజానీకాన్ని పై చేదునిజం త్వరలోనే మేల్కొల్పుతుంది. మీడియా ప్రచార ఉధృతి ప్రభావంతో, తక్కువ కాలంలోనే డబ్బు సంపాదించడంపై పెరిగిన వారి ఆకాంక్షలు, జీవిత భద్రత, శాంతియుత జీవనం కోసం వారి ఆరాటం అనేవి నిరుద్యోగం, దగా, కుంభకోణాలు వగైరాల పెంట కుప్పలో చెదిరిపోయాయి. ఈ తరగతి ప్రజానీకం సైతం క్షీణిస్తున్న తమ ఉనికికి విప్లవమొక్కటే ఏకైక ప్రత్యామ్నాయంగా చూస్తుంది. ఈ వాస్తవాన్ని గుర్తించగానే వారిలో దాగివున్న విప్లవశక్తి రంగంమీదికి వస్తుంది. పట్టణ మధ్యతరగతిలోని అత్యధిక భాగం కానీ, మొత్తం సమాజం కానీ శూన్య భవిష్యత్తును ఎదుర్కొంటుండగా ప్రపంచీకరణ వెలుగు జిలుగులు అతికొద్దిమంది ఉన్నతవర్గ కుటుంబాలలోనే మెరుస్తున్నాయన్నదే ఆ వాస్తవం. ❑

**జూలై 28 నుండి ఆగస్ట్ 3 దాకా అమరవీరుల సంస్మరణ వారాన్ని పాటిద్దాం!**

**మన ప్రియతమ అమరుల ఆశయాల సాఫల్యం కోసం ప్రతిన చేద్దాం!!**

(4వ పేజీ తరువాయి...)

ప్రభుత్వం, చేనేత రంగంపై వేటుమీద వేటు వేస్తూ, దాన్ని పూర్తిగా అరక్షిత స్థితికి నెట్టేస్తూనే 'మీ ఉత్పత్తుల నాణ్యతను పెంచుకుని పోటీకి నిలబడండి' అంటూ సలహాలివ్వడమంటే ఎంత క్రూర పరిహాసం! 'నీ బిచ్చానికి దండం, కుక్కని మాత్రం ఉసిగొల్పకు' అని ప్రాధేయపడే బిచ్చగాడి పరిస్థితిలా తయారైంది చంద్రబాబు హయాంలోని రాష్ట్ర చేనేత రంగం పరిస్థితి! కాని, దండాలు పెట్టినా దండనలు తప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే - బడుగు బలహీన వర్గాల ప్రజలందరినీ మరింత మరింతగా దండిస్తూ బడాబాబులకి దండిగా లాభాల పంటలు పండించి పెట్టడమే తన పనిగా పెట్టుకుంది ప్రభుత్వం. మొన్నటి అంగన్‌వాడీల ఆందోళనపైన, నిన్నటి విద్యుత్ ఆందోళనపైనా చంద్రబాబు ప్రభుత్వం విరుచుకుపడ్డ తీరు గమనిస్తే రాష్ట్రంలో చేనేత రంగం 'పనిపట్టే' తీరులోనే బాబు ప్రభుత్వ ప్రయాణం వుందని గ్రహిస్తాం. కనుక ఈ ప్రభుత్వం 'పనిపట్టే' తీరులోనే ఇతర రంగాలలోని పీడిత, తాడిత ప్రజలందరితో కలిసి రాష్ట్రంలోని చేనేత కార్మికులంతా నడుం బిగించాల్సి వుంటుంది.

తాను ఎవరి ఉప్పు తింటున్నాడో ఆ దొరల బిడ్డ అర్జునుడి ప్రయోజనం కోసం తన అమాయక ఆటవిక శిష్యుడు ఏకలవ్యుడి బొటనవ్రేలుని అతడి చేతనే నరికించి మరీ తీసుకుపోయాడు క్రూర, నేర ఆచార్యుడు ద్రోణుడు! ఇది ఇతిహాసం! 16 మడతలతో అగ్గిపెట్టెలో ఇమిడేంతటి అతి సన్నని నాజూకు నేతతో కూడిన చీరను సిరిసిల్ల నేత కార్మికుడు నాటి వలస పాలన రోజుల్లో ఒక తెల్ల దొరకు బహూకరిస్తే, అంతటి గొప్ప చేనేత తమ మిల్లు బట్టల మార్కెట్‌కి శాపంగా వుంటుందనే అక్కసుతో ఆ బడుగు కార్మికుని బొటనవ్రేలుని నరికించాడుట ఆ తెల్లదొర! ఇదొక జనాంతిక చారిత్రక ఘటన! రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అపరద్రోణుడి పాత్ర నిర్వహిస్తోంది. అయితే నేత కార్మికులు ఏకలవ్యులుగా బలికారాదు! బ్రతకలేక చావుల్ని ఆశ్రయించే తీరు నుంచి రాష్ట్ర చేనేత కార్మికులు బయటపడుతూ బ్రతుకు కోసం, బ్రతుకు బాగు కోసం ప్రాణ త్యాగాలకి సైతం సిద్ధపడే సమరశీల పోరాటాలకి నడుం బిగించాలి. ❑

---

(39వ పేజీ తరువాయి...)

చెందిన ప్రాంతపు దళారులతో కూడ పోరాడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుంది. దానర్థం భూస్వామ్య, సామ్రాజ్యవాద సంకెళ్ళను తెంచివేసి భూమిలేని నిరుపేదలకు భూమిని పంచటం, విశాల ప్రజానీకం యొక్క జీవన ప్రమాణాలను పెంచటం, త్రాగునీటి, సాగునీటి సౌకర్యం కల్పించి, వ్యవసాయ ముడిసరకులను చౌకగా అందించి, రైతాంగం పండించిన వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించటం, అభివృద్ధి అంటే అర్థం తెలంగాణా ప్రాంతంలోకి తరలి వస్తున్న సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడికి అడ్డుకట్ట వేసి, ఈ ప్రాంతం నుండి సంపద, వనరులు బయటికి తరలిపోకుండా ఆపటం. అభివృద్ధికి అర్థం సమాజంలోని తీవ్ర అణచివేతకు గురౌతున్న సెక్షన్లు అయిన గ్రామీణ, పట్టణ పేదలకు, దళిత ప్రజానీకానికి, స్త్రీలకు, ఆదివాసీలకు సంపదను మరింత సమానంగా పంపిణీ చేయటం. అభివృద్ధికి అర్థం నిరుద్యోగ యువత ఉద్యోగ భద్రతకు, ప్రజల జీవితాల భద్రతకు హామీనివ్వటం. అభివృద్ధికి అర్థం ప్రజల ప్రజాస్వామిక హక్కుల్ని పరిరక్షించి, అంతులేని పోలీసు దుర్మార్గాలకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు స్వస్తి పలకటం, కల్లోలిత ప్రాంతాల చట్టాన్ని ఎత్తివేసి, పోలీసు క్యాంపుల్ని ఎత్తివేయటం. అభివృద్ధికి అర్థం అధికార వికేంద్రీకరణ లేక వాస్తవార్థంలో అధికారాన్ని సమర్పించటం. ఈ లక్ష్యాలు లేకుండా తెలంగాణా అభివృద్ధి గురించి మాట్లాడటంలో అర్థం లేదు. సరికదా, ప్రత్యేక తెలంగాణా ప్రజలకు ఎలాంటి లాభం చేకూర్చదు.

వివిధ సెక్షన్ల మధ్య అసమానతలు తగ్గనిదే, ప్రాంతీయ అసమానతలు తొలగిపోవు. అప్పుడు మాత్రమే ప్రత్యేక తెలంగాణా నినాదం, అక్కడ అణచివేయబడుతున్న కులాలు, వర్గాలు, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యాన్ని హక్కుగా అనుభవించ గలిగేటటువంటి, గౌరవ, మర్యాదల్ని పొందగలిగేటటువంటి ప్రజాస్వామిక తెలంగాణా నినాదమౌతుంది. తెలంగాణా భూస్వాములు, దళారులు, కోస్తా భూస్వాములు, దళారుల కంటే తక్కువ క్రూరులేమీ కాదు. పైగా, వాళ్ళంత బాగా వీళ్ళు కూడా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు సేవలందించే వాళ్ళే. కనుక, ప్రత్యేక తెలంగాణా పోరాటంలో బి.జె.పి., కాంగ్రెస్, టి.డి.పి., ఇంకా ఇతర పార్లమెంటరీ పార్టీలకు చెందిన ప్రతీఘాతకుల్ని పూర్తిగా ఎండగట్టాలి. వాళ్ళు నిజంగా ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణా కోసం పనిచేసే వాళ్ళైతే వాళ్ళ వాళ్ళ పార్టీలకు రాజీనామా చేసి, ప్రజల డిమాండ్లకు బహిరంగంగా తమ అంగీకారాన్ని ప్రకటించమని అడగాలి.


దోపిడీదారులు ఎల్లప్పుడూ ప్రజల మనోభావాలను ప్రజాభిమానాన్ని చూరగొన్న నినాదాలను ముందుకు తీసుకుపోవడానికి, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ప్రయోజనాలకు ద్రోహం చేయడానికి మాత్రమే వుపయోగించు కుంటారనేది చరిత్ర మనకు చూపించింది. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణా పోరాటంలో, ప్రజాస్వామిక తెలంగాణా కార్యక్రమాన్ని అమలు చేయడానికి, పునాది స్థాయి నుంచి ప్రజలు తమ స్వంత కమిటీలను ఏర్పాటు చేసుకుంటారు. ప్రత్యేక తెలంగాణా డిమాండుకు ప్రజాభిమానం పెరిగి, కేంద్రంలో అస్థిరత పెరుగుతూ, వివిధ రాజకీయ శక్తుల మధ్య వైరుధ్యాలు పెరిగి, రాజకీయ పార్టీల ఎన్నికల వత్తిళ్ళు పెరుగుతుండగా, పోరాటం ఒక స్థాయికి చేరిన తరువాత జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్‌లకు రాష్ట్ర ప్రతిపత్తి ఇచ్చినట్లు, ప్రత్యేక తెలంగాణా డిమాండును కూడా ఒప్పుకుంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమ ప్రయోజనాన్ని పీపుల్స్‌వార్ తన చేతిలోకి తీసు కుంటున్నదనే భయం కూడా పాలకవర్గాల ముందు భూతంలా కన్పిస్తున్నది. తెలంగాణాకు రాష్ట్ర ప్రతిపత్తి ఇచ్చేముందు క్రూర మారణకాండ జరిపించే అవకాశాలను ఎవరూ తోసిపుచ్చలేరు కూడా. కానీ, నిజమైన పోరాటం ప్రజాస్వామ్య తెలంగాణా చుట్టూనే కేంద్రీకృతమౌతుంది. ఈ కార్యక్రమం ద్వారా భూస్వామ్య, దళారీ తొత్తులను, ప్రజా వ్యతిరేక, అవినీతి సెక్షన్లను పూర్తిగా ఎండగట్టి, విశాల ప్రజా ఉద్యమం తన ప్రజాస్వామిక ఆకాంక్షలను సాధిస్తుంది. ❑

సరిహద్దు ఘర్షణలు

# భారత విస్తరణవాదంపై మరో ముష్టిఘాతం

నేపాల్‌లో భారత్‌పై వ్యతిరేకత పెల్లుబుకిన తరువాత, భారత విస్తరణవాదం మీద మరో గట్టి ముష్టిఘాతం తగిలించటం ఇపుడు బాంగ్లాదేశ్ వంతయింది. భారత పాలకులు ఒక పద్ధతి ప్రకారం, సరైన సమాచారం అందకుండా చేసే క్యాంపెయిన్ ద్వారా ఈ అంశం మీద గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తుండగా, వాళ్ళ మధ్యనున్న తీవ్ర వైరుధ్యాల వల్ల నిజం బయటికి పొక్కింది.

ఏప్రిల్ మధ్యలో జరిగిన సంఘటనలు మేఘాలయ-బంగ్లాదేశ్ సరిహద్దుకు దగ్గర్లోని 20 కుటుంబాలున్న ఖాళీ అనే చిన్న గ్రామం చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. పిర్దివా గ్రామం (బంగ్లాదేశీయులు దీన్ని పడువా అని పిలుస్తారు) బంగ్లాదేశ్‌కి చెందినదైనప్పటికీ, భారత్ స్వాధీనంలో వుంది. అక్కడ బి.ఎస్.ఎఫ్. ఔట్‌పోస్టు కూడా వుంది.




ఏప్రిల్ 15వ తేదీ రాత్రి 700 మంది బంగ్లాదేశ్ రైఫిల్స్ (బి.డి.ఆర్.) సైనికులు అకస్మాత్తుగా ఈ ఔట్‌పోస్టును చుట్టుముట్టి 20 మంది బి.ఎస్.ఎఫ్. పోలీసుల్ని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒక్క బుల్లెట్‌ని కూడా బంగ్లా రైఫిల్స్ కాల్చలేదు. గూఢచర్య బాధ్యతలోనున్న బి.ఎస్.ఎఫ్. 'జి' బ్రాంచ్‌గానీ, అక్కడికి 3 కి.మీ. దూరంలోని 'డాకీ'లో వున్న 'రా' (రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) గానీ బంగ్లా సైనికుల పథకాన్ని ఏ మాత్రం పసిగట్టలేక పోయాయి. బి.ఎస్.ఎఫ్. సైనికుల నిర్బంధం కొనసాగింది. రెండు దేశాల సైన్యాధికారుల ఉన్నతస్థాయి సమావేశం జరిగిన రెండు రోజుల తరువాత కూడా బి.ఎస్.ఎఫ్. గస్తీ కేంద్రం ముట్టడిని బంగ్లా రైఫిల్స్ ఎత్తివేయలేదు.

పిరిద్వాలో బి.ఎస్.ఎఫ్. పోలీసులు ముట్టడిలో వుండగానే, బి.డి.ఆర్. అదనపు బలగాలు సరిహద్దులకు చేరుతున్నాయని, బంగ్లాదేశ్ సైన్యం అప్రమత్తమైందని వార్తలు రావటం ప్రారంభమైంది. ఈ ప్రతిష్టంభనను బద్దలు గొట్టడానికి ఏదో ఒక తీవ్ర చర్య చేపట్టాలని ఢిల్లీలో హోంశాఖ భావించింది. దీంట్లో భాగంగా బి.ఎస్.ఎఫ్. బలగాలకు సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆజ్ఞలు జారీ చేయటమేగాక, పిరిద్వా ఔట్‌పోస్టును విడిపించేందుకు బేరసారాలు ఆడటానికి అక్కడికి 300 కి.మీ. దూరంలో వున్న బంగ్లాదేశ్ ఔట్‌పోస్టును ముట్టడించడానికి పథకం కూడా తయారైంది.

బోరై బారి ఔట్‌పోస్టు మీద దాడికి పథకం సిద్ధమైంది. బోరై బారి ఔట్‌పోస్టుకు ఎదురుగా వున్న బి.ఎస్.ఎఫ్. కంపెనీకి సహాయంగా వెంటనే మరో రెండు బి.ఎస్.ఎఫ్. కంపెనీలను పంపించారు. బి.ఎస్.ఎఫ్. డిప్యూటీ కమాండెంట్ బి.ఆర్. మండ్‌ని ఈ దాడికి నాయకత్వం వహించాలని ఆదేశించారు.

ఏప్రిల్ 18న మూడు కంపెనీల పటిష్టమైన బలగాలు సరిహద్దులు దాటి బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించాయి. ఎటువంటి ప్రతిఘటనను ఎదుర్కోకుండానే వారు బోరై బారి వైపుకు కదిలారు. తేలిగ్గానే విజయం సాధిస్తామనే ఉత్సాహంతో వాళ్ళు, బంగ్లాదేశ్ భూభాగంలోకి బాగా చొచ్చుకు పోయారు. అప్పుడు అకస్మాత్తుగా, బి.డి.ఆర్. (బంగ్లాదేశ్ రైఫిల్స్) బలగాల అండతో వెయ్యిమంది గ్రామస్థులు శివమెత్తినట్లు పొదల్లో నుంచి బయటికి దూకి బి.ఎస్.ఎఫ్. కంపెనీల మీద విరుచుకుపడి ఆంబుష్ చేశారు. ఊహించని ఈ భయంకరమైన దాడికి బి.ఎస్.ఎఫ్. పోలీసులు భీతిల్లిపోయి పిచ్చిపట్టినట్లు భారత సరిహద్దువైపు పరుగులు తీశారు. ఈ క్రమంలో పిరికి బి.ఎస్.ఎఫ్. తన మనుషుల్ని 18 మందిని పోగొట్టుకుంది. ఇద్దరు తప్పించుకోగా, 16 మంది పట్టుబడ్డారు. సంవత్సరాల తరబడి బి.ఎస్.ఎఫ్.పై పెరిగిన పగ, ద్వేషాల ఫలితంగా ఈ ఫాసిస్టు కుక్కల శరీరాలను చిన్నాభిన్నం చేశారు. చచ్చిన పందిని కట్టెకు కట్టి మోసినట్లు, బి.ఎస్.ఎఫ్. జవాను శవాన్ని గ్రామస్తులు మోస్తున్నట్లుగా దేశవ్యాప్తంగా పత్రికల్లో వచ్చిన ఫోటో, ఆ ప్రజల తీవ్ర అసహ్యాన్ని ప్రదర్శించింది. ఇది బి.ఎస్.ఎఫ్. బలగాలను మరింత ఘోరంగా అవమానించింది.

ప్రాథమికంగా సరిహద్దుకు ఇరువైపుల వున్న గ్రామస్థుల్లో బి.ఎస్.ఎఫ్.పై పెరిగిన ద్వేషం ఫలితమే బొరైబారి దగ్గర దాని భంగపాటుకు దారితీసింది. భారత్ వైపునున్న గ్రామస్థులు, సరిహద్దు అవతల వున్న తమ వారికి ఈ సమాచారాన్ని అందించారు. ఈశాన్య ప్రాంతమంతటా, తాను సృష్టించిన భయోత్పాతం, క్రూరత్వాలకుగాను బి.ఎస్.ఎఫ్. ఏవగింపుకు గురైంది. అక్కడ బి.ఎస్.ఎఫ్. బలగాలు యధేచ్ఛగా హత్యలు, మానభంగాలు, లూటీలకు పాల్పడ్డాయి. వాళ్ళు సరిహద్దుల వెంబడి స్మగ్లింగ్‌లో చురుగ్గా పాల్గొన్నారు. నిజానికి దీనికి కొద్దిరోజులు ముందు మణిపూర్‌లో బి.ఎస్.ఎఫ్. పట్టుకున్న నలుగురు

వ్యాపారులు కన్పించకుండా పోయారు. మణిపూరి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (మణిపూరి ప్రజావిముక్తి సైన్యం) కి వ్యతిరేకంగా బి.ఎస్.ఎఫ్. పెద్దఎత్తున దాడి ప్రారంభించిన చురాచంద్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇపుడు, మణిపూర్ మానవహక్కుల కమీషన్ పోలీసు డి.ఐ.జి.కి ఈ వ్యాపారుల ఆచూకీ కనుక్కోవాలని ఆదేశాలు జారీచేసింది. ఇటువంటి చర్యల వల్ల ప్రజలు బి.ఎస్.ఎఫ్. మీద పగ తీర్చుకొన్నారనటంలో ఆశ్చర్యం లేదు.

ఇప్పుడు, బొరైబారి దగ్గర భంగపాటుకి సంబంధించిన వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి బి.ఎస్.ఎఫ్., ప్రభుత్వం అనేక అబద్ధాలు వల్లిస్తున్నాయి. ఈ సంఘటనపై విచారణకు సంబంధించిన, ఆనవాళ్ళన్నింటినీ తుడిచేయడానికి అధికార్లు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. పేపర్లలో వచ్చిన వార్తల రికార్డులను ధ్వంసం చేయటం, బి.ఎస్.ఎఫ్. జవాన్ల నోళ్ళు మూయించటం, జవాన్లను వేరే చోటికి బదిలీ చేయటం వంటి తరచూ వాడే ట్రిక్కులు వుపయోగిస్తున్నారు. దాడిలో తప్పించుకున్న బి.ఎస్.ఎఫ్. జవాన్లను ఇద్దర్ని కన్పించకుండ అతిరహస్యంగా దాచిపెట్టారు. ఇక ప్రసార మాధ్యమాలు 20 నుంచి 40 మంది జవాన్లు మాత్రమే బంగ్లాదేశ్‌లో ప్రవేశించారని ప్రచారం చేస్తున్నాయి.

బి.ఎస్.ఎఫ్. హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుండగా, జరిగిన సంఘటనలపై హోంమంత్రి అద్వానీ కనీసం ఒక్క ప్రకటన కూడా చేయలేదు. ఈ పథకాల్లో తన భాగస్వామ్యం లేనట్లు నటిస్తూ, హోంమంత్రిత్వశాఖ స్థానిక బి.ఎస్.ఎఫ్. అధికారుల మీద నిందమోపడానికి ప్రయత్నించింది. అయితే బి.ఎస్.ఎఫ్. దీన్ని తీవ్రంగా ఖండించింది. నైతిక పతనానికి తోడు, ఈ నిందారోపణల్లో అనేకం ప్రసార మాధ్యమాల్లో వెల్లడయ్యాయి.

అంతేగాక, సాధారణ జవాన్ల పట్ల బి.ఎస్.ఎఫ్. అధికారుల, ప్రభుత్వం యొక్క కనికరం లేని వైఖరి చాలా త్వరగా బయటపడింది. హోంశాఖ కార్యదర్శిగానీ, జనరల్ ఆఫీసర్ ఆన్ కమాండ్ (తూర్పు కమాండు) గానీ సంఘటన జరిగిన స్థలాన్ని కనీసం సందర్శించలేదు. తమతోటి వారైన 16 మంది జవాన్లను యుద్ధరంగంలో వదిలేసి పారిపోవటమే కాదు, చివరకు మృతదేహాలనైనా వారి బంధువులకు అప్పగించడానికి బదులు, 'తురా' దగ్గర త్వరత్వరగా దహన సంస్కారాలు చేశారు. వారి దహన సంస్కారాలు జరిగేచోట ఒక మంత్రిగాని, సీనియర్ అధికారిగానీ లేడు. ఏప్రిల్ 20న బి.డి.ఆర్. బలగాలు మృతదేహాలను అప్పగించగా, హోంమంత్రిత్వ శాఖ ఏప్రిల్ 22న మాత్రమే నోరు విప్పింది.

ప్రభుత్వం పారా మిలటరీ బలగాలను దిగజార్చి, 'జాతి గౌరవాన్ని మంట గలిపిందని' మాజీ బి.ఎస్.ఎఫ్. డైరెక్టర్ జనరల్ ప్రకాశ్‌సింగ్ నిందించటంలో ఆశ్చర్యం లేదు. ఇటువంటి మొండివైఖరి వల్ల మొత్తం బలగాల నైతిక స్థైర్యం దెబ్బ తినగలదని కూడా అతడు ప్రకటించాడు.

అంతేగాక, అప్పటికే సైన్యం యొక్క నైతిక స్థైర్యాన్ని ఎంతో కొంత దెబ్బతీసిన తెహెల్కా బాగోతానికంటే, ఈ సంఘటనలు పతాక శీర్షికలకు ఎక్కాయి. తాము యుద్ధరంగంలో చస్తుంటే, తమపై అధికారులు, రక్షణశాఖ అధికార్లు తెరచాటున ఆయుధ బేరాల్లో కోట్లు సంపాదించుకుంటున్నారని జవాన్లు ఆలోచించటం ప్రారంభించారు.

**పిరిద్వా సంఘటన వెనుక నిజాలు**

రెండుదేశాల మధ్యనున్న సరిహద్దు ఒప్పందం ప్రకారం 'ప్రత్యర్థి స్వాధీనం'లో ('ఆక్రమిత భూభాగానికి' దౌత్యపరమైన పరిభాష) వున్న ప్రాంతాల్లో రోడ్లతో సహా ఎటువంటి 'రక్షణ నిర్మాణాలు' నిర్మించకూడదు. అయినప్పటికీ ఈ ఒప్పందాన్ని పూర్తిగా అతిక్రమిస్తూ బి.ఎస్.ఎఫ్. ఈ ప్రాంతంలో ఒక రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించింది.

సంవత్సరం క్రితం బంగ్లాదేశ్ రైఫిల్స్ బలగం పడువాలో ఈ రోడ్డును తొలగించమని బి.ఎస్.ఎఫ్.ను అడిగింది. ఈ అంశాన్ని గత సంవత్సరం జూన్‌లో మొదట ఇరుపక్షాల భద్రతాధికారుల మధ్య ఉత్తరాల ద్వారా ముందుకు తీసుకొచ్చారు. ఒక నెల తరువాత, సైన్యాధికారుల సమావేశంలో బి.డి.ఆర్. అధికార్లు దీన్ని మళ్ళీ గుర్తు చేశారు. కానీ ఎలాంటి స్పందనా లేదు. కొద్ది నెలల తరువాత బి.డి.ఆర్. అధికార్లు జరుగుతున్న పనిని ఆపి మార్చి 15 నాటికి వెనక్కువెళ్ళాలని బి.ఎస్.ఎఫ్.ను అడిగారు. ఆ తరువాత రోడ్డు నిర్మాణం పూర్తయిందన్న వార్తలు సరిహద్దులు దాటి బయటకు పొక్కినపుడు ఏప్రిల్ 15న ఈ ప్రాంతాన్ని బి.డి.ఆర్. బలగాలు చుట్టుముట్టాయి.

ఎట్టకేలకు బి.ఎస్.ఎఫ్. ఆ రోడ్డును తొలగించింది. పిరిద్వాలో ఎలాంటి హింసాత్మక ఘటనలు లేనప్పటికీ, కొద్దిరోజుల తరువాత 300 మంది బి.ఎస్.ఎఫ్. జవాన్లు బంగ్లాదేశ్‌లోని బొరైబారిని ముట్టడించడానికి పోయినపుడు పరిస్థితి అదుపు తప్పింది.

ఈ రెండు సంఘటనల్లో కూడా భారత ప్రభుత్వం, బి.ఎస్.ఎఫ్.లదే తప్పనేది స్పష్టం. తప్పును ఒప్పుకోవడానికి బదులు, బంగ్లాదేశ్ దాడి చేసిందనే అభిప్రాయం కలిగేటట్లు అనేక కట్టుకథలల్లి కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించారు.

ఇది ఖచ్చితంగా ఐ.ఎస్.ఐ. కుట్ర అని మొదట ప్రచారం చేశారు. ఆ తరువాత ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ బి.డి.ఆర్. బలగాల్లోని ప్రతిపక్షాల అనుకూల వర్గంతో కలిసి, ప్రధాన మంత్రి హసీనాను ఇరకాటంలో పెట్టి రాబోయే ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకోవడానికి ఈ పన్నాగం పన్నిందని ప్రచారం చేశారు. ఆ తరువాత, 'పాకిస్తాన్ అనుకూలుడు' బి.డి.ఆర్. చీఫ్ రహ్మాన్ ప్రభుత్వానికి తెలియకుండా ఈ కుట్ర పన్నాడనే కథనాన్ని ప్రచారం చేశారు. చివరగా, ఈ కథలేవీ అతక్కపోవటంతో, బంగ్లాదేశ్‌లో విస్తృతంగా ప్రజల్లో వ్యాపించివున్న భారత వ్యతిరేక భావాల కారణంగా ఎన్నికల్లో (జూలైలో జరగనున్న) గెలవడానికిగాను షేక్ హసీనాకి ఇటువంటి సంఘటన జరగటం, జరిపించటం అవసరమైందని చెప్పటం మొదలెట్టారు.

ఈ అబద్ధాల కోరులు మితిమీరి ప్రచారం చేస్తుండగా, చివరికి, పిరిద్వాలో రోడ్డు నిర్మించటం, బొరైబారి దగ్గర బంగ్లాదేశ్‌లోకి చొచ్చుకు రావటం తప్పేనని భారత ప్రభుత్వం అంగీకరించాల్సిన పనేముంది.

### భారత విస్తరణవాద దాదాగిరి

ఈ సంఘటనలపై భారత రాజకీయ నాయకుల ప్రతిస్పందన విస్తరణవాదుల దురహంకారాన్ని చూపిస్తున్నది. ఢాకా, ఢిల్లీల స్వాధీనంలో వున్న మ్యాపులు పిరిద్వా బంగ్లాదేశ్‌కి చెందిందే అయినప్పటికీ అది భారత స్వాధీనంలో వుందని చూపిస్తుండగా విదేశీ వ్యవహారాలు మరియు ప్రస్తుత రక్షణ మంత్రి అయిన జస్వంత్ సింగ్ బి.డి.ఆర్.ని పిరిద్వాలోకి చొరబడిందని నిందిస్తున్నాడు. ఈ దాడి ''అకారణమైనది, ముందు హెచ్చరికలు లేనిది'' అని 'దుస్సాహసం నేరం' అని కూడా అతడు గుడ్లు వురుముతున్నాడు. 'సైనిక దుస్తుల్లో వున్నవారిని క్రూరంగా హింసించి అవమానించటం భారత్ సహించదని, దీన్నంత తేలిగ్గా తీసుకోబోమని' పెద్ద పెత్తందారు తరహాలో ఇతగాడు బెదిరిస్తున్నాడు.

'ఉనికి కోసం భారత్‌కి రుణపడివున్న బడుగుదేశాలు ఇప్పుడు మమ్మల్నే బెదిరిస్తున్నాయని' శివసేన ఎం.పి. తీవ్ర కోపంతో ప్రకటించాడు. భజరంగదళ్ కన్వీనర్ జైన్ 'బంగ్లాదేశ్‌కి గుణపాఠం నేర్పాలని' డిమాండ్ చేస్తుండగా, వి.హెచ్.పి. అధ్యక్షుడు దాల్మియా నాయకత్వంలో బంగ్లాదేశ్ రాయభార కార్యాలయం ఎదుట ప్రదర్శన జరిపి షేక్ హసీనా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఇక విస్తరణవాదులకు ఏ మాత్రం తీసిపోని ఇతర పార్టీలు తమ ప్రతిస్పందనల్లో మరిన్ని హెచ్చరికలు చేస్తూ, రానున్న ఎన్నికల్లో బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత వ్యతిరేక శక్తుల చేతుల్లోకి పోతే, అది మరోసారి ఈశాన్య రాష్ట్రాల తిరుగుబాట్లను ఎగదోసే నిప్పుల కుంపటి అవుతుందని భయపెడుతున్నాయి. వాస్తవానికి ఈ ఒక్క సంఘటనలోనే కాక, రెండు దేశాల మధ్యనున్న సంబంధాలన్నింటిలో భారతదేశపు దాదాగిరి మనకు కన్పిస్తుంది.

దేశం విడిచి వెళుతూ కూడా బ్రిటీషు పాలకులు రగిల్చిపోయిన చిచ్చే ఈ సరిహద్దు ఘర్షణ. ఈ సమస్యను (1,400 కి.మీ. సరిహద్దుకుగాను భౌగోళిక ఇబ్బందులవల్ల 40.6 కి.మీకు సరిహద్దు ఏర్పాట్లు చేయలేదు. 6.5 కి.మీ. ప్రాంతం వివాదాస్పదంగా వుంది. పరిష్కరించేందుకు 1974లో ఇందిరా గాంధీ, షేక్ ముజిబుర్ రహమాన్‌ల మధ్య ఒక ఒప్పందం మీద సంతకాలు జరిగాయి. బంగ్లాదేశ్ వెంటనే దీన్ని అంగీకరించి, అమలులోకి తీసుకురావడానికి అవసరమైన చట్టపరమైన సవరణల్ని చేసింది. కానీ నేటి వరకు కూడా భారత్ దీన్ని అంగీకరించలేదు. బేరుబారి భూభాగాన్ని భారత్‌కి అప్పగిస్తే అందుకు బదులుగా అంగర్ పోటా, దేహగ్రామ్ భూభాగాలను వాటికి గల మార్గాన్ని బంగ్లాదేశ్‌కి తిరిగి అప్పగించాలనేది ఆ ఒప్పందంలోని ముఖ్యమైన నిర్ణయాల్లో ఒకటి. ఒప్పందం జరిగిన కొద్ది నెలల్లోనే బేరూబారిని భారత్‌కు అప్పగించగా, పరిమితమైన ప్రవేశ మార్గాన్ని బంగ్లాదేశ్‌కి ఇవ్వడానికి భారత్ 25 సంవత్సరాలు తాత్సారం చేసింది.

అంతేగాక, గత కొద్ది సంవత్సరాలుగా బి.ఎస్.ఎఫ్. కలహానికి కాలుదువ్వుతూ సరిహద్దు 'పవిత్రత'ను దూకుడుగా పాటిస్తున్నది. సరిహద్దు సమావేశాల్లో బంగ్లాదేశ్ ప్రభుత్వం దీన్ని గట్టిగా వ్యతిరేకించింది. వాస్తవంగా, 53 ఘర్షణలు జరిగి, అందులో ఇద్దరు బి.డి.ఆర్. జవాన్లతో సహా 45 మంది బంగ్లా దేశీయులు చనిపోయారని గత రెండు సంవత్సరాలుగా బంగ్లాదేశ్ చేస్తున్న ఫిర్యాదులపై భారత్ ఉద్దేశ్యపూర్వకంగానే ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నది. ఈ ఘర్షణల్లో భారతీయులు చనిపోయింది 10 మంది లోపే. బంగ్లాదేశ్ ప్రభుత్వం అనేక సందర్భాల్లో భారత్ ప్రభుత్వానికి తన నిరసనలు తెలియజేసి, బంగ్లాదేశ్‌లోని భారత హైకమీషనర్‌ను ఆరుసార్లు పిలిపించుకుని నష్టపరిహారాన్ని కూడా డిమాండ్ చేసింది. బి.ఎస్.ఎఫ్. చర్యకు భారత్ ఏ మాత్రం బాధపడలేదు. అలాంటిది ఇటీవలి సరిహద్దు సంఘటనపై భారత్ చేస్తున్న గావుకేకలు ఏడుపులంతా తన జవాన్లు ఎక్కువమంది చనిపోయారనే.

అంతేగాక, బంగ్లాదేశ్ విముక్తి ప్రారంభ కాలంలో (1971) కూడా, విస్తృతంగా దోపిడీలకు దిగిన భారత్ జవాన్లు బంగ్లా ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి బంగ్లాదేశ్‌లోనే బంగ్లా ప్రజలను పరాయీకరణపాలు చేశారు. బంగ్లా దేశీయులు ఈ షాక్ నుండి ఇంకా తేరుకోకముందే భారతీయ మార్వాడీ వ్యాపారుల రూపంలోని నూతన తరహా బందిపోట్లు నాసిరకం సరకులతో బంగ్లా స్థానిక మార్కెట్‌లను ముంచెత్తారు.

ఫర్క్కా డ్యామ్ విషయంలో కూడా ఇదే జరిగింది. కలకత్తా రేవులో పేరుకుపోయిన బురద తొలగించటానికి అనే మిషతో భారత్ ఏకపక్షంగా గంగాజలాలను ఉపసంహరిస్తూ, పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా డ్యామ్ ద్వారా గంగా జలాలను హుగ్లీ నదిలోకి మళ్ళిస్తూ సుమారు 20 సంవత్సరాలుగా బంగ్లాదేశ్ ఆర్థిక స్థితిని, పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీసి కల్లోలం సృష్టిస్తోంది. డ్యామ్ ఉపయోగంలోకి రావటానికి ముందు న్యాయమైన నీటి వాటా ఒప్పందం కుదుర్చుకుంటామని బంగ్లాదేశ్‌కి భారతదేశం పదే పదే హామీలిచ్చింది. కానీ, 1994లో డ్యామ్ ఉపయోగంలోకి వస్తే, నీటి వాటా ఒప్పందం 1996లో జరిగింది.

మరోసారి బంగ్లాదేశ్‌లోని మోంగ్లా రేవును నేపాల్ ఉపయోగించుకోవడాన్ని భారతదేశం సంవత్సరాల తరబడి ఒప్పుకోకుండా తాత్సారం చేసింది. ప్రస్తుతం షరతులతో ఇందుకు ఒప్పుకుంది.

వాణిజ్య సంబంధాల విషయం తీసుకుంటే, ఎనిమిది సంవత్సరాల క్రితం బంగ్లాదేశ్ విదేశీ సరకుల అదనపు భారిత సగటు (weighted average)ను 17% సుంకాన్ని తగ్గించింది. ప్రత్యేకించి భారతదేశం నుండి వస్తున్న సరుకులమీద 12% తగ్గించింది. దీనితో పోల్చుకుంటే, భారతదేశం ఈ సుంకాన్ని ఇటీవల మాత్రమే 25%కి తగ్గించింది. బంగ్లాదేశ్ ఆర్థిక స్థితి చాలా బలహీనంగా వున్నందువల్ల బంగ్లాదేశ్‌తో వాణిజ్యంలో ఉదారంగా

వ్యవహరించాల్సింది పోయి భారతదేశం కనీసం బంగ్లాదేశ్ కల్పించిన సౌకర్యాలు కూడా కల్పించలేదు. అంతేగాక, బంగ్లాదేశ్ ఆచరణాత్మకంగా పరోక్ష పన్నులన్నింటిని రద్దు చేయగా, భారత్ బంగ్లాదేశ్ సరుకులమీద ఆరురకాల పరోక్ష పన్నులు విధించింది. ఈనాడు అభివృద్ధి చెందిన ప్రపంచానికి బయట భారత సరుకులకున్న ఒకే ఒక పెద్ద మార్కెట్ అయిన బంగ్లాదేశ్ ఎగుమతి వ్యాపారంలో భారత్ వాటా 6.5 శాతంగా వుంది. అధికారికంగా, అనధికారికంగా బంగ్లాదేశ్‌కి భారత్ వార్షిక ఎగుమతుల విలువ సుమారు 3 బిలియన్ డాలర్లు. బంగ్లాదేశ్ భారత సరుకులు గుమ్మరించే స్థలంగా మారింది. కానీ బంగ్లాదేశ్ సరుకుల్ని భారత్‌లోకి రానివ్వకుండ అడ్డుకుంటున్నది. బంగ్లాదేశ్‌కున్న పుష్కలమైన సహజవాయు వనరులను కొల్లగొట్టాలని భారతదేశం ఇప్పుడు ఎంతకైనా తెగబడుతున్నది.

ఇదీ భారత్ - బంగ్లాదేశ్ సంబంధాల చరిత్ర.

### భారత పాలకవర్గాలకు చెంపపెట్టు

పిరిద్వాలో నిర్మించిన రోడ్డును భారత్ బలవంతాన తొలగించడమే కాదు, బొరైబారిలో ముక్కు పగలగొట్టు కోవడమేగాక, హోంమంత్రిత్వ శాఖ, బి.ఎస్.ఎఫ్.ల మధ్య నింద, ప్రతినిందలతో బి.ఎస్.ఎఫ్. నైతిక స్థైర్యం బాగా దెబ్బతిన్నది. 'గొప్ప' అణుశక్తి, పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలున్నాయని విర్రవీగే భారత్ తన జగడాలమారి విన్యాసాలకుగాను దెబ్బమీద దెబ్బ పడి ఇప్పుడు నిస్సహాయంగా చూస్తున్నది.

**సరిహద్దులో జరిగిన ఈ సంఘటనలేవీ బంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలిసి జరగలేదని నమ్మించడానికి భారత పాలకులు ప్రయత్నించారు. దీన్ని సైతం బంగ్లా ప్రభుత్వం వెంటనే వెనక్కు కొట్టింది. వాస్తవంగా, సైనికపరమైన పరాభవానికి తోడుగా రాజకీయంగా కూడా వరుసగా ఎదురుదెబ్బలు తగలడంతో భారత విస్తరణవాదులకు తల తిరిగి కళ్ళు బైర్లు కమ్మాయి.**

శూన్యరేఖ (జీరోలైన్)కు 150 మీటర్లలోపు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదనే అంతర్జాతీయ నియమాన్ని ఉల్లంఘించి పడువా గ్రామాన్ని భారత భూభాగంతో కలిపే రోడ్డు నిర్మాణం ప్రారంభించిన తరువాతనే, 1971 నుండి బి.ఎస్.ఎఫ్. తన ఆధీనంలో వుంచుకున్న బంగ్లాదేశ్ గ్రామం పడువా (భారతీయులకు పిరిద్వా) లోకి బి.డి.ఆర్. దళాలు ప్రవేశించాయని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సయ్యద్ మొయజ్జమ్ ఆలీ బహిరంగంగా ప్రకటించాడు.

సరిహద్దు సమస్యలన్నిటికి శాశ్వత పరిష్కారం ఇవ్వడానికి 1974 నాటి ముజిబ్-ఇందిరా ఒడంబడిక పూర్తిగా అమల్లోకి తీసుకురావాల్సిన అవసరాన్ని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి అజాద్ గట్టిగా నొక్కి చెప్పాడు.

షేక్ హసీనా యూరప్ నుండి తిరిగొచ్చేటపుడు మే నెలలో భారత్‌ను సందర్శించి, ఉద్రిక్తతల్ని తొలగించడానికి ప్రధాన మంత్రుల స్థాయిలో చర్చలు జరుపుతుందని, ఈ సంఘటనల తర్వాత వెంటనే భారత పత్రికలు వార్తలు వెలువరించాయి. భారత్ కూడా చర్చల కోసం అధికారుల బృందాన్ని ఢిల్లీకి ఆహ్వానించింది. అయితే షేక్‌హసీనా ఢిల్లీలో ఆగరని కొద్దిరోజుల తర్వాత బంగ్లా ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో చెప్పింది. అధికారుల బృందాన్ని ఢిల్లీకి పంపవలసినంత అత్యవసరం ఏమీలేదని, భారత్ చర్చలు కావాలనుకొంటే ఢాకాకు రావలసిందని కూడా వాళ్ళు చెప్పారు.

కానీ, సరిహద్దు సంఘటనలు జరిగిన వారం రోజుల తర్వాత భారత విస్తరణ వాదానికి మరో పెద్ద ముష్టిఘాతం తగిలింది. బంగ్లాదేశ్, పాకిస్థాన్ నావికాదళంతో కలిసి బంగాళాఖాతంలో పూర్తిస్థాయి నావికాదళ విన్యాసాలు నిర్వహించింది. బంగ్లాదేశ్ సముద్ర జలాల సరిహద్దుల్లోపల రెండు దేశాల మధ్య జరిగిన ఉమ్మడి విన్యాసాల్లో 3 పాకిస్థానీ ఓడలు, రెండు బంగ్లాదేశ్ ఓడలు పాల్గొన్నాయి. ఈ అవమానానికి తోడు, బంగ్లాదేశ్ (విన్యాసాలకు ఆతిథ్యమిచ్చినది)గాని, పాకిస్థాన్‌గానీ అంతర్జాతీయ సంప్రదాయ అనుసారం భారత్‌కు సమాచారమివ్వలేదు. అరేబియా సముద్రంలో వుంటున్న పాకిస్థాన్‌కు చెందిన 3 ఓడలు శ్రీలంక జలాల గుండా ప్రయాణించి భారత జలాల్లోకి ప్రవేశించకుండానే బంగాళా ఖాతంలోకి చేరుకున్నాయి. భారత పాలకుల్ని మరింత దిగ్భ్రాంతి పరచేటట్లుగా, విన్యాసాలు పూర్తి అయిన తరువాత పాకిస్థాన్ ఓడలు మూడూ ఏప్రిల్ 26 సాయంత్రం మయన్మార్ (బర్మా) వైపు వెళ్ళాయి. మయన్మార్ నావికాదళంతో కూడా ఇటువంటి విన్యాసాలు నిర్వహించడానికే అవి వెళ్ళాయి.

కనుక, దక్షిణాసియా పెత్తందారు భారతదేశం ఉపఖండంలో రోజురోజుకీ ఏకాకిగా మారుతోంది. మళ్ళీ మళ్ళీ బంగ్లాదేశ్ ముష్టిఘాతాలు తిన్న తర్వాత కూడా భారత్ చేష్టలుడిగి పోవటం చూస్తే ఊబిలో దిగిన భూతాన్ని తలపిస్తున్నది. దాని ఆయుధాల గుట్టలు, పెద్ద సైనిక బలగాలు వాస్తవంగా, భారత ప్రజలతో సహా దక్షిణాసియా ప్రజలందరి నిత్య నిరసనను ఎదుర్కొంటున్న కాగితం పులులే. ఈరోజు ఈశాన్య రాష్ట్రాల్లో, కాశ్మీర్‌లోనే కాక, దేశ వ్యాప్తంగా ప్రజలు భారత విస్తరణవాదానికి వ్యతిరేకంగా తయారు అవుతున్నారు. తమ వందిమాగధులు వెర్రివేకలు వేస్తున్నప్పటికీ భారత పాలకవర్గాలు పెంచి పోషించిన జాతీయ దురహంకారం రంగు మాసిపోవటం మొదలైంది.

ఈరోజు, దక్షిణాసియా ప్రజలంతా భారత విస్తరణవాదంపై పోరాడటానికి ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ పోరాటంలో భారత ప్రజలు కీలక పాత్ర పోషించి పొరుగు దేశాల మీద, జాతీయోద్యమాల మీద, భారత విస్తరణవాదుల అన్ని రకాల ఆధిపత్యాన్ని, ఆయుధాల ఝుళిపింపులను, కయ్యానికి కాలు దువ్వటాన్ని క్రియాశీలకంగా వ్యతిరేకించి తీరాలి. దక్షిణాసియాలో భారత విస్తరణవాదం ప్రధాన ప్రతీఘాతకశక్తి. అది ఉనికిలో వున్నంతకాలం భారత ప్రజలతో సహా దక్షిణాసియా ప్రజలు స్వేచ్ఛా వాయువుల్ని పీల్చలేరు. దాన్ని కూకటివేళ్ళతో పెకలించినప్పుడే, నిజమైన సమానత్వం, పరస్పర నమ్మకం, శాశ్వత స్నేహం పునాదిపై దక్షిణాసియా దేశాల ప్రజలమధ్య సంబంధాలు పునర్నిర్మితమౌతాయి. ❑

# బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఏ. పతనం ప్రారంభం

ప్రభుత్వ విధానాలపట్ల ప్రజల వ్యతిరేకత, ఈ ఎన్నికల్లో ఎన్.డి.ఏ. కూటమిని ఓడించటంలో, బి.జె.పి.కి పట్టిన దుస్థితిలో ప్రతిఫలించింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 794 అసెంబ్లీ సీట్లకుగాను బి.జె.పి.కి దక్కింది. 11 సీట్లు, ఎన్.డి.ఏ. కూటమికి మొత్తంగా దక్కింది 78 సీట్లు (10%) మాత్రమే. వారి దుర్మార్గమైన ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలు, ప్రజా ఉద్యమాలపై వారి దురహంకారపూరిత దాడులు, ప్రత్యేకించి అమెరికా వంటి సామ్రాజ్యవాదులకు పూర్తిగా దాసోహమనటం, అన్నిరకాల అవినీతి కుంభకోణాల్లో పీకలలోతు కూరుకు పోవటం వంటివి ఎన్నికల్లో వారి స్థానమెక్కడో చూపించాయి. వారి హిందూ మతోన్మాదం ఈ రాష్ట్రాల్లో కొద్ది శాతం హిందూ ఓట్లను కూడా దక్కించుకోలేక పోయింది.

ఎన్నికల 'విశ్లేషకులు' హ్రస్వదృష్టి, పక్షపాత ధోరణులతో పూర్తి అవాస్తవాల్ని చూపించారు. కాషాయ కూటమిని కీర్తించటంలో తమవంతు భాగంగా బెంగాల్‌లో తృణమూల్‌కు తమిళనాడులో డి.ఎం.కె.కు ఊడిగం చేశారు. ఎన్నికల జోస్యాలన్నీ మమతాబెనర్జీ, కరుణానిధిల ముఖ్యమంత్రిత్వానికి మితిమీరిన ప్రాధాన్యతనిచ్చాయి. ఎట్టకేలకు ఇద్దరు కూడ ఎన్నికల్లో తుడిచి పెట్టుకుపోయారు. మొత్తానికి ప్రసార మాధ్యమాలు వాటి కిరాయి మనుషులు ఎన్నికల సరళిని విశ్లేషించటం కంటే ఎక్కువగా పనికిమాలిన రాజకీయ పార్టీల చెత్త ప్రచారాన్ని ఎక్కువగా ప్రోత్సహించారనేదే వాస్తవం.

మరి ప్రజలముందు మరొక ప్రత్యామ్నాయం లేదు. కనుక కాషాయ ముఠాను పడగొట్టటానికి అక్కడున్న ప్రధాన ప్రతిపక్షానికి ప్రజలు ఓట్లేశారు. ఇక అదే అవినీతి రొచ్చులో మునిగిన కాంగ్రెస్ (ఐ), బి.జె.పి. ఆర్థిక విధానాలన్నింటినీ సమర్థించేదే. అవినీతి మయమైన ఏ.డి.ఎం.కె.ది అదే పాట. ఇక పచ్చి అవకాశవాద వామపక్షాలదీ అదే జపం. వాస్తవానికి ఆర్థిక సంస్కరణల దుర్మార్గమైన విధానాలలో వేటిపట్ల కూడా ఈ పార్లమెంటరీ పార్టీలకు అభ్యంతరం లేదు. వారి ఆందోళనంతా వాటిని ఇంత త్వరగా అమలులోకి తీసుకొస్తుండటం గురించి మాత్రమే. జయలలిత, గెహ్లోట్, దిగ్విజయ్‌సింగ్, క్రిష్ణ, విలాస్‌రావ్ దేశ్‌ముఖ్, ఎవరైతేనేమి వారి వారి రాష్ట్రాల్లో బి.జె.పి.తో సమానంగా అత్యుత్సాహంతో ఆర్థిక సంస్కరణలు అమలు జరుపుతున్నారు.

ఇక వామపక్షాల ఉద్దేశ్యంలో ప్రపంచబ్యాంకు నిర్దేశించిన విధానాలను వేగంగా అమలు చేయటం పట్లనే వ్యతిరేకతగాని, వాటి సారాంశం పట్ల వ్యతిరేకతేమీ లేదు. కాకుంటే ఆర్.ఎస్.ఎస్.లోని స్వదేశీ జపం చేసే వర్గం మాదిరిగా, సంస్కరణల పట్ల వ్యతిరేకత ప్రదర్శించడానికి అవి గొంతు చించుకొని అరుస్తాయంతే. అది కూడ కేవలం ప్రజల మద్దతు నిలబెట్టుకోవడానికే. వాస్తవానికి, ఈ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు ప్రజల్ని కదిలించిందేమీ లేదు. అవి అధికారంలో వున్న పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో వాటి విధానాలే దీన్ని రుజువు చేశాయి. ఇక బెంగాల్‌లో తమ విజయంమీద ఎంతటి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటే, కేరళలో కేవలం 29% ఓట్లు మాత్రమే పొంది సాధించిన (అదికూడ కేరళ కాంగ్రెస్(ఐ)లో తీవ్ర ముఠా కొట్లాటలుండగా) తమ దారుణ ఓటమిని కప్పిపుచ్చుకోవడానికి బెంగాల్ విజయాన్ని వాడుకుంటున్నారు.

నిజమైన ప్రతిపక్షం నిలబడింది అస్సాంలోనే. ఇక్కడ ఉల్ఫా ఎన్నికలను బహిష్కరించమని ప్రజలకు పిలుపునిచ్చింది. పేద హిందువుల (బీహార్ కూలీలు) పై జరిగిన మారణకాండ తనకు అపకీర్తి తెచ్చిన క్రమంలో, ఎ.జి.పి. ప్రభుత్వం క్రూర నియంతృత్వాన్ని అమలు జరిపి భయోత్పాతం సృష్టించినప్పటికీ, ఎ.జి.పి. నాయకులనేకమందిని ఉల్ఫా మట్టు బెట్టింది. ఎ.జి.పి.-బి.జె.పి. కూటమి యొక్క ఫాసిస్టు మత రాజకీయాలపై ఉల్ఫా గట్టిగా దాడి చేసింది. భారత పాలకుల దాస్య శృంఖలాల నుంచి అస్సామీ ప్రజల విముక్తిని ఉల్ఫా గట్టిగా డిమాండ్ చేసింది. బంగ్లాదేశీ 'కాందిశీకుల' సమస్యపై మత విద్వేషాలు రెచ్చగొట్టాలని బి.జె.పి.-ఎ.జి.పి. కూటమి అనేక విఫలయత్నాలు చేసినప్పటికీ, ఘోరంగా విఫలమైంది. ఇన్ని చేసినప్పటికీ అధికార ఎ.జి.పి.కి 126 సీట్లకు కేవలం 40 సీట్లు (32%) దక్కితే, బి.జె.పి.కి కేవలం కొన్ని సీట్లు మాత్రమే దక్కాయి.

అంతేగాక, దేశంలోని అన్నిచోట్ల ఎన్నికలపట్ల ఎక్కువమంది (40 నుండి 50 శాతం) ఆసక్తి చూపక పోవటం, ఓటు వేయక పోవటం జరిగింది. ఇందులో ఓటువేయనివారే ఎక్కువమంది. దీనివల్ల ఏ పార్టీ కూడ 20% నుండి 30% కంటే ఎక్కువ ఓట్లు దక్కించుకోలేక పోయింది. ఇక పోల్ అయిన ఓట్లలో కూడ ఎక్కువ శాతం అన్ని పార్టీలు రిగ్గింగ్, గూండాల్ని వుపయోగించి ఓట్లేయించినదే. బి.జె.పి./కాంగ్రెస్ (ఐ) లు రిగ్గింగ్‌లో మొరటు పద్ధతులు అవలంభిస్తే, సి.పి.ఎం. నాజూకైన, నైపుణ్యమైన పద్ధతులు అవలంభించింది. మమతా బెనర్జీ బి.జె.పి.వైపునుండి కాంగ్రెస్ వైపుకు దూకటం (మరలా వెనక్కు రావటం) లాంటి పిచ్చిచేష్టలు చేసి చేజేతులా అప్రతిష్ఠ తెచ్చుకోగా, బెంగాల్‌లో సి.పి.ఎం.కి అనుకూలమైన ఎన్నికల యంత్రాంగం, కండబలం కలిసి పెద్ద మొత్తంలో ఓట్లు తెచ్చి పెట్టిందనటంలో అనుమానం లేదు. వీటన్నింటిని బట్టి చూస్తే, ఓటుహక్కున్న వాళ్ళలో దాదాపు సగం మంది ఓట్లేయలేదనేది వాస్తవం.

ఏమైనప్పటికీ ఉదాసీనంగా వుండటమనేది ఈ ఎన్నికల బూటకపు తంతుకు సమాధానం కాదు. పైగా, మౌనంగా వుండటాన్ని పాలకవర్గాలు అంగీకారంగా తీసుకుంటాయి. ఎన్నికల బహిష్కరణలో చురుగ్గా పాల్గొనే వాళ్ళే ఈ అవినీతి వ్యవస్థను ఎదిరించే వాళ్ళుగా ప్రజల ముందు నిలబడగలరు. దోపిడీ పాలకవర్గాలకు మాత్రమే వుపయోగపడే బూటకపు ప్రజాస్వామ్యాన్ని నిజమైన వ్యవస్థగా చూపించి ప్రజల్ని

మోసగించడానికే ఈ బ్రహ్మాండమైన ఎన్నికల మోసపుతంతు జరుగుతున్నది. ప్రజల నిరసన బ్రద్ధలవ్వకుండా, ప్రభుత్వ వ్యతిరేక ఓటుకు పరిమితం చేస్తూ, ఎన్నికలు దోపిడీ వ్యవస్థకు రక్షణ కవాటంగా ఉపయోగపడుతున్నాయి. ఈరోజు ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వెళ్ళగ్రక్కడానికి ప్రజలు ఎన్నికల్ని ప్రధాన మార్గంగా ఎంచుకుంటున్నారని, ప్రతి ఎన్నికల్లో అధికారంలో వున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెలువడుతున్న ఫలితాలే నిరూపిస్తున్నాయి. ప్రజల ఈ నిరసన ప్రతిసారీ ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా కాక, మరోమార్గం తీసుకుంటే మాత్రం అది విప్లవంగా బ్రద్దలౌతుంది. అందుకే ప్రజల కోపాగ్ని విప్లవంగా బ్రద్దలు కాకుండా ప్రక్కదారి పట్టించడానికి దోపిడీ పాలకవర్గాలు మత విద్వేషాలు, పాకిస్తాన్ వ్యతిరేకోన్మాదం వంటి వాటిని ప్రజల్లో రెచ్చగొడుతున్నాయి. ఇక ఎన్నికల తంతు కూడ ప్రజల్ని ప్రక్కదారి పట్టించే ముఖ్యమైన విధానమే. ఈ ఎన్నికల తతంగాన్ని గొంతెత్తి కీర్తించే పని నెత్తికెత్తు కోవటంలో ప్రసార మాధ్యమాల సంగతి సరే సరి.

ఐదేళ్ళకు, మూడేళ్ళకు అవసరమైతే ఏడాదికే ఎన్నికలు వస్తున్నాయి, పోతున్నాయి. కానీ, ప్రజల జీవన స్థితిగతులు మాత్రం నానాటికీ దిగజారి పోతున్నాయి. ప్రస్తుత ప్రపంచీకరణ/సరళీకరణ కాలంలో ఏ పార్టీ అధికారంలో వున్నా ప్రజల జీవన స్థితివేగంగా దిగజారి పోతూనే వున్నది. బి.జె.పి., కాంగ్రెస్, సి.పి.ఐ./ సి.పి.ఎం. లేక అనేక ప్రాంతీయ పార్టీలు అధికారాలు వెలగబెడుతున్న చోట్లన్నింటా, ప్రజల జీవన ప్రమాణాల్లో కొద్దిపాటి తేడా తప్ప ఎలాంటి మెరుగుదల లేదు. ప్రభుత్వ విధానాలు, ఆయా పార్టీలు దోపిడీ వర్గాలకు సేవలు చేసే మార్గాల్లో కొద్దిపాటి తేడా మాత్రమే తప్ప, అన్ని పార్టీలు ఒక్కటే. ఒకరు దూకుడుగా హిందూ మతోన్మాదాన్ని ఉపయోగిస్తే, మరొకరు మృదువుగా ఉపయోగించే వారు. ఇక మరికొందరు కుహనా లౌకికవాదులు. ప్రస్తుత తీవ్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితిలో, ప్రజలపై జరుగుతున్న ప్రపంచీకరణ/ సరళీకరణ దాడుల్లో పాలక వర్గాలు హిందూ మతోన్మాదానికి, ఫాసిస్టు ప్రభుత్వ విధానాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నాయి. తమ నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడకుండా ఆపగలిగేది ఇదొక్కటేనని వాళ్ళు భావిస్తున్నారు.

కానీ దీనికి కూడ పరిమితులున్నాయి. సంక్షోభం, కుంచించుకు పోతున్న ఆర్థిక వ్యవస్థలు కలిసి అధికార కుమ్ములాటల్ని పెంచుతున్నాయి. నేటి పాలకుల్లోనే ముఠా కొట్లాటలు మునుపటి కంటే ముదిరిపోయాయి. తెహెల్కా భాగోతం, మంత్రి పదవుల కోసం ఎన్.డి.ఏ. కూటమిలోని భాగస్వామ్య పక్షాల పాకులాటలు, అవినీతి, అక్రమాలలో రాజకీయ ప్రత్యర్థుల అరెస్టులు, స్థానిక స్థాయిలో అసమ్మతివాదుల వ్యక్తిగత దిగజారుడు తనాలు, బి.జె.పి.తో సహా అన్ని పార్టీలలోని కుక్కల కొట్లాటలు వంటివి పాలకులుగా వీళ్ళ అసమర్థతని చూపిస్తున్నాయి. అధికారం కోసం కుమ్ములాటలు, నీచమైన ప్రాకులాటలు వీటి పట్ల ప్రజల్లో మరింత అసహ్యాన్ని పెంచుతున్నాయి. ఇక ఈ రొచ్చు ముఖాల్ని ఏ హిందూ మతోన్మాదం కాపాడలేదు.

అయినప్పటికీ, ప్రజలకు మరో ప్రత్యామ్నాయం కన్పించక ఏదో ఒక దొంగకు ఓటు వేస్తున్నారు. లేకుంటే మౌనంగా వుంటున్నారు. కానీ కుళ్ళి కంపు కొడుతున్న ఈ పార్లమెంటరీ రాజకీయాలకు ఒక ప్రత్యామ్నాయం వుంది. అదే విప్లవం. ఈ విప్లవం సోషలిజం పునాదిపై సర్వ మానవ సమానత్వాన్ని సాధించే సమాజాన్ని నిర్మించే వైపు వేసే మొదటి అడుగుగా, దున్నేవారికే భూమి ప్రాతిపదికన వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, నేటి సాంఘిక, ఆర్థిక వ్యవస్థను మార్చివేసి, ప్రజలందరికీ కూడు, గూడు, నీడ, సమాన హక్కులు అందించే మౌలిక ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మిస్తుంది. ఈ ప్రక్రియ నేడు ప్రారంభమై, ఎ.పి., ఎన్.టి., డి.కె., బీహార్ వంటి దేశంలోని కొద్ది ప్రాంతాల్లో కొంతవరకు బలం పుంజుకున్నది. బీజ ప్రాయంలో వున్న ఈ ప్రత్యామ్నాయమే దేశ ప్రజలందరి ప్రత్యామ్నాయంగా ఎదగనున్నది. 1967-70ల స్వల్పకాలంలో దేశమంతటా ఇదొక నూతన ఆశాజ్యోతిగా ఎదిగింది. కాని, రాక్షస నిర్బంధంతో నక్సల్బరి అణచివేయబడింది. కాని, ఈరోజు విప్లవం మరొకసారి పైకెగసింది. వెలుగురేఖ చీకటిని చీల్చుతున్నది. మధ్య భారతంలోని విశాల ప్రాంతాల్లో ప్రజల నూతన రాజ్యాధికారం ఎదుగుతూ, ప్రజా గెరిల్లా సైన్యం ఆవిర్భవించి, అపజయాల నుండి సి.పి.ఐ.(ఎం-ఎల్) దృఢంగా పైకెగసి, మూడు దశాబ్దాల సుదీర్ఘకాలం తరువాత మహత్తరమైన తన 9వ కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించుకుని, ప్రాథమిక స్థాయిలోనైనా సరే విప్లవ రాజకీయాలను దేశంలోని 11 రాష్ట్రాలకు వ్యాపింపజేసి అరుణ పతాకను సుదృఢంగా పైకెత్తి పట్టింది.

అవును నూతన ఆశాజ్యోతి ఎదుగుతున్నది. కానీ, దేశంలోని విశాల ప్రజానీకంలో ఇది వేళ్ళూనుకోవలసి వున్నది. ఒకసారి ఇది జరిగిన తరువాత, ఇక ప్రజలకు ఒక పార్టీ కాకుంటే మరొక పార్టీకి ఓటేయవలసిన అవసరంగానీ, మౌనంగా వుండవలసిన అవసరంగానీ లేకుండా నిజమైన ప్రత్యామ్నాయం దొరుకుతుంది. అప్పుడే బూటకపు ఎన్నికలను ప్రజలు తిప్పికొడతారు. దొంగ నాయకుల్ని వారి రాజకీయ పార్టీలను తన్ని తరుముతారు. ఓట్లడగడానికి వచ్చే దొంగ నాయకుల ముఖాలపై కుళ్ళిన కోడిగుడ్లు (బాంబులు కూడ) విసురుతారు. వాళ్ళ సభలు, సమావేశాల్ని బహిష్కరించటమేగాక, మొత్తం ఈ బూటకపు ఎన్నికల విధానాన్నే ప్రజలు బహిష్కరిస్తారు. అప్పుడే ప్రతివ్యక్తి నిజమైన పౌరుడుగా గుర్తింపు పొంది, బూటకపు ప్రజాస్వామ్యంలో పోయిన ఓటుహక్కు కోసంగాక, నిజమైన తమ మౌలిక హక్కులను డిమాండు చేసే ఆత్మవిశ్వాసం గల వ్యక్తులుగా ఎదుగుతారు.

నూతన యుగపు అరుణోదయం ప్రారంభమై, మధ్య భారతపు నడిబొడ్డు నుండి ఆ వెలుగురేఖలు విరజిమ్మటం మొదలైంది. నేడు మనల్ని పరిపాలిస్తున్న దోపిడీ దొంగలు మోసాల, బూటకపు ప్రజాస్వామ్యపు ముసుగుల చాటున ఇంకెంతో కాలం మనలేరు. 'పచ్చి విషం గక్కే' ముఖాలను మరుగుపరుస్తున్న మాయపొరల్ని నూతన మేలుకొలుపు ఒక్కొక్కటిగా చించివేస్తున్నది. నేడు డంభాచారాలు పలుకుతున్న ఈ పందికొక్కుల్ని చరిత్ర పెంటకుప్ప పైకి విసిరేసి, ప్రజలే నిజమైన చరిత్ర నిర్మిస్తారు. ❑

'మేడే' ప్రదర్శనలు

# ప్రపంచవ్యాప్తంగా పెల్లుబుకుతున్న ప్రజాందోళనలు

గత సంవత్సరం లండన్, బెర్లిన్, ఇంకా ఇతర ప్రదేశాల్లో సమరశీలంగా జరిగిన మేడే నిరసన ప్రదర్శనల తర్వాత ఈ సంవత్సరం నిరసన ప్రదర్శనలు మరింత విస్తృతంగా వ్యాపించాయి. దశాబ్దం క్రితం ''కమ్యూనిజం అంతమైందని, దాని చరిత్ర ముగిసిందని'' బూర్జువా వర్గం ప్రకటించగా, నేడు ప్రపంచవ్యాప్తంగా మేడే ప్రదర్శనలేకాక, సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనలు కూడా పుంజుకోవటం మనం చూస్తున్నాం. ప్రపంచీకరణ వ్యతిరేక నిరసనకారుల ప్రదర్శనల నుండి పెద్ద ఎత్తున పోలీసు బలగాల రక్షణ లేకుండా సామ్రాజ్యవాదులు ఒక్కటంటే ఒక్క మీటింగ్ కూడా జరపలేక పోయారు. నైస్, సిన్సినాటి (Cincinatti) క్విబెక్‌లలో జరిగిన గొప్ప ప్రజా నిరసన చర్యలతోపాటు హార్వర్డ్‌లో ప్రపంచీకరణ సదస్సుకు వ్యతిరేకంగా బైఠాయింపు కొనసాగింది. ఇక్కడ, అమెరికాకు చెందిన అత్యంత ఉన్నతశ్రేణి విద్యార్థులు తమ క్యాంపస్‌ని నిర్వహిస్తున్న ఉద్యోగుల 'జీవనభృతి''ని డిమాండు చేస్తూ రెండు వారాల పాటు ఆందోళన కొనసాగించారు.

ఈ సంవత్సరం మేడే లక్షలాదిమందిని వీధుల్లోకి తీసుకొచ్చింది. లండన్, జ్యూరిచ్, ఇంకా ఆస్ట్రేలియాలోని అనేక నగరాల్లో కార్మికవర్గ ఉత్సవాలు వీధి పోరాటాలతో జతగూడగా, ప్రజలు పోలీసులతో దొమ్మీలకు దిగారు. నిరుద్యోగం, తదితర ప్రపంచీకరణ దుష్ఫలితాలు వంటి నిర్దిష్టమైన డిమాండ్లపై ప్రజలు ప్రదర్శనలు నిర్వహించి, స్టాక్ ఎక్స్ఛేంజీ, బహుళజాతి కంపెనీలు, మెక్‌డొనాల్డ్ మొదలైన సామ్రాజ్యవాద చిహ్నాలను లక్ష్యాలుగా ఎంచుకొని దాడులు చేశారు. ''లాభాలకంటే ప్రజలు ముఖ్యం'' వంటి నినాదాలతో, పర్యావరణం, నిరాయుధీకరణ, మూడవ ప్రపంచ దేశాల దారిద్ర్యం ప్రపంచీకరణ వ్యతిరేకత, పెట్టుబడిదారీ విధాన వ్యతిరేకత వంటి వివిధ అంశాలను ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు.

**లండన్**

గత సంవత్సరపు హింసాత్మక నిరసనల తరువాత, ఈ సంవత్సరం వేలాది ప్రదర్శనకారులతో అమీతుమీ తేల్చుకోడానికి, కొట్లాటకు కూడా సిద్ధమై, పెద్దఎత్తున 10,000 మంది పోలీసుల్ని మోహరించారు. మధ్య (సెంట్రల్) లండన్ పోలీసు బలగాల రక్షణ దుర్గంలా కన్పించింది. ప్రారంభంలోనే ప్రతి ప్రదర్శనకారుణ్ణీ అణువణువు సోదా చేసి, ఆటంకాలు కలిగించినప్పటికి రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు.

లండన్‌లో 10,000 మంది కార్మికులతో కూడిన ఊరేగింపు, సైకిళ్ళతో జరిగిన మరొక పెద్ద ఊరేగింపులు శాంతియుతంగా ప్రారంభమై, తరువాత హింసాత్మకంగా మారాయి. సైకిలిస్టులు సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేసి నగరంలో ట్రాఫిక్‌ను నిలిపివేశారు. మిట్ట మధ్యాహ్నానికి అనేక ప్రదర్శకుల గుంపులు ఊరేగింపులో చేరడానికి చేసిన ప్రయత్నాలను పెద్దఎత్తున మోహరించిన పోలీసులు అడ్డుకోవటంతో ఊరేగింపు హింసాత్మకంగా మారింది. ఒక ప్రదర్శకుల గుంపు మెక్‌డొనాల్డ్ పేరున్న బోర్డును పీకిపడేసి ప్రధానమంత్రి వుండే ఇంటి మీదికి రాళ్ళు రువ్వారు. ప్రదర్శనకారులు షాపుల అద్దాలు పగులగొట్టి, కార్లను తలక్రిందులు చేసి, చెత్తకుండీలను రోడ్డుమీదికి విసిరేసి, బార్‌క్లేస్ బ్యాంక్ కిటికీలను పదే పదే పగలగొట్టారు. ఆక్స్‌ఫర్డ్ వీధి (ప్రధాన బహుళజాతి కంపెనీల వినియోగ వస్తువులు అమ్మే షాపులు, ఆఫీసులుండే వీధి) దగ్గర ప్రదర్శనకారులు పోలీసు శ్రేణుల్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించగా, దొమ్మీ జరిగి 10 మంది గాయపడగా, 42 మందిని పోలీసులు అరెస్టు చేశారు. చీకటిపడిన తరువాత ప్రదర్శనకారుల గుంపులు పోలీసుల నిఘా నుండి తప్పించుకుపోయి, షాపులున్న వీధిలో చొరబడి ఆస్తులు ధ్వంసం చేశాయి.

**యూరప్‌లోని మిగతా ప్రాంతాల్లో...**

ప్రపంచ స్వేచ్ఛా మార్కెట్ దుష్ప్రభావాలకు వ్యతిరేకంగా వందల వేల కార్మికులు ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు, పెట్టుబడిదారీ విధాన వ్యతిరేక కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు జరిపి యూరప్ అంతటా మేడే ఉత్సవాలతో వీధుల్ని ఎరుపెక్కించారు.

బెర్లిన్‌లో మరోసారి అత్యంత మిలిటెంట్ కార్యక్రమం జరిగింది. ఒక దశాబ్ద కాలంగా మేడే వుత్సవాల సందర్భంగా బెర్లిన్ వీధుల్లో చెలరేగుతున్న హింసాత్మక చర్యలను అడ్డుకునేందుకోసం దేశమంతటి నుండి 9,000 మంది పోలీసుల్ని రప్పించి వీధుల్లో మోహరించారు. కానీ, పాలకుల చర్యలకు ప్రజల కోపం తారాస్థాయికి చేరింది. ఫాసిస్టుల ఊరేగింపులను కూడా బహిష్కరిస్తున్నట్లు సాకు చెబుతూ ప్రభుత్వం మొదట ఊరేగింపును బహిష్కరించింది. ప్రభుత్వం కార్మికుల ప్రదర్శనలపై నిషేధాన్ని కొనసాగించగా, మరోవైపున న్యాయస్థానాలు ఫాసిస్టుల ప్రదర్శనల మీద నిషేధాన్ని ఎత్తివేశాయి.

బెర్లిన్‌లో వేకువజామునే ఘర్షణ ప్రారంభమైంది. బెర్లిన్ గోడ దగ్గర జరిగిన సంఘటనతో సహా మునుపటి బెర్లిన్‌లో రెండు వేర్వేరు చోట్ల వేకువనే ఘర్షణలు జరిగాయి. ప్రదర్శనకారులు చీకటి మాటున కొన్ని బారికేడ్లకు నిప్పంటించారు. పోలీసులపై జనం రాళ్ళు, సీసాలు విసిరారు. వీధుల్లో మంటలు రాత్రిపూట ఆకాశాన్ని మైళ్లపొడవునా ప్రకాశింపజేశాయి. ప్రదర్శనకారులతో జరిగిన పోరాటాల్లో పోలీసులు వాటరకానన్లు, రబ్బరు బుల్లెట్లు ఉపయోగించారు. 40 మందికి పైగా ప్రదర్శనకారులు అరెస్టు కాగా అనేకమంది పోలీసులు గాయపడ్డారు.

దేశమంతటా మేడే ఊరేగింపులు జరిగిందానికి సాక్ష్యంగా, జర్మనీలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ఫ్రాంక్‌ఫర్ట్‌లో వెయ్యికి పైగా ప్రదర్శనకారులు పోలీసులతో చేసిన దొమ్మీలో 100 మంది ప్రజలు అరెస్టయ్యారు. హాంబర్గ్‌లో బారికేడ్లు నిలబెట్టగా, ఘర్షణలకు, కొద్దిపాటి అరెస్టులకు దారితీసింది.

ఫ్రాన్స్‌లో వేలాదిమంది ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు ఇటీవల బహుళజాతి కంపెనీలు విధించిన ఉద్యోగాల కోతపై కేంద్రీకరించి దేశమంతటా పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహించారు.

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్) నగరంలో జరిగే సాంప్రదాయిక మేడే ఊరేగింపు చివర్లో, వామపక్ష అతివాదులకు, పోలీసులకు జరిగిన ఘర్షణలో డజన్లకొద్దీ ప్రజలు అరెస్టయ్యారు. వందలాది ప్రజలు నల్లబట్టలు ధరించి, తలలకు దెబ్బలు తగలని టోపీలు పెట్టుకుని పోలీసుల మీద రాళ్ళు, రంగుడబ్బాలు విసరగా, పోలీసులు వాటర్ క్యానన్లు, రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఆస్ట్రియాలో ఫాసిస్టు పార్టీ అధికారం కోసం మళ్ళీ తలెత్తగా, వెనువెంటనే దానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీని ఫలితంగా, ఉద్యోగ భద్రతకు పిలుపునిస్తూ వియన్నాలో లక్షమందితో పెద్దఎత్తున మేడే ప్రదర్శన జరిగింది. ఇటలీ, గ్రీసులోని వివిధ నగరాల్లో కూడా పెద్ద పెద్ద ఊరేగింపులు జరిగాయి. గ్రీసులో ఏప్రిల్ 26న జరిగిన సాధారణ సమ్మెకు వెనువెంటనే జరిగిన పరిణామానికి సాక్ష్యంగా మేడే రోజున ఏథెన్స్ వీధుల్లో 2 లక్షల మంది కార్మికులు ఊరేగింపు జరిపారు.

**ఆస్ట్రేలియా**

దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో స్టాక్ ఎక్చేంజీ ఆఫీసులను ముట్టడిస్తుండగా పోలీసులకు ప్రదర్శనకారులకు మధ్య అసంఖ్యాకం అయిన ఘర్షణలు జరిగాయి. సిడ్నీ, పెర్త్, బ్రిస్బేన్ నగరాల్లో ప్రదర్శనకారులతో పోలీసులకు జరిగిన ఘర్షణల్లో లెక్కలేనన్ని అరెస్టులు జరిగాయి. ప్రదర్శనకారులమీద దాడుల్లో పోలీసులు చాలా దుర్మార్గంగా ప్రవర్తించారు. ఒకరోజు గడిచిన తరువాత, ప్రదర్శనకారులు తమ కేంద్రీకరణను పార్లమెంటు మీదికి, పెద్ద కార్పోరేషన్ల మీదికి, సిడ్నీలోని ప్రధానమంత్రి కార్యాలయాల మీదికి గురిపెట్టారు. మెల్బోర్న్, కాన్‌బెర్రా, అడిలైడ్‌లలో నిరసనలు శాంతియుతంగా జరిగాయి. సిడ్నీలో వందలాది ప్రపంచీకరణ వ్యతిరేక నిరసనకారులు అశ్వికదళ పోలీసులతో దొమ్మీకి దిగారు. ఇద్దరు పోలీసులు ఆస్పత్రిపాలు కాగా మరో 18 మంది గాయపడ్డారు. బ్రిస్బేన్‌లో ప్రదర్శనకారులు స్టాక్ ఎక్చేంజీని ముట్టడించటానికి ప్రయత్నించారు. మెల్బోర్న్‌లో 2,000 మంది ప్రదర్శనకారులు గుమికూడి మెక్‌డోనాల్డ్ రెస్టారెంట్ మీద నినాదాలు గుప్పించి, ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

## అమెరికా శిఖరాగ్ర సమావేశం ముట్టడి

*స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (యఫ్.టి.ఏ.ఏ.) మీద సంతకాలు చేయడానికి ఉత్తర, దక్షిణ అమెరికా దేశాల నుండి 34 మంది నాయకులు పాల్గొన్న క్విబెక్ నగరంలో జరిగిన అమెరికా శిఖరాగ్ర సదస్సును విచ్ఛిన్నం చేయడానికి నిర్ణయించుకున్న వేలాది ప్రదర్శనకారులు దాన్ని ముట్టడించారు.*

*ఏప్రిల్ 20న, ప్రదర్శనకారుల్ని సమావేశ స్థలానికి రాకుండా కాంక్రీటు దిమ్మెలకు చుట్టి ఏర్పాటు చేసిన 3 మీటర్ల ఫెన్సింగ్ తీగను ప్రదర్శనకారులు ధ్వంసం చేసి, ప్రారంభోత్సవాలను కొన్ని గంటల పాటు వాయిదా వడేటట్లు చేశారు. పోలీసులు వదే వదే కవచ శకటాల నుండి వాటర్ క్యానన్లు ఉపయోగించటంతో పాటు టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్లు కాల్చగా, అమెరికా ఖండంలోని వివిధ దేశాల నుండి వచ్చిన ప్రపంచీకరణ వ్యతిరేక ప్రదర్శనకారులు, అమెరికా సామ్రాజ్యవాద ప్రముఖుడు బుష్‌తో పాటు పాలకులను రక్షించడానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పరిధిలో అనేకచోట్ల ముట్టడి వాతావరణాన్ని సృష్టించారు. కళ్ళను మండించే బాష్పవాయువు పోలీసులు దిగ్బంధించిన ప్రాంతమంతా కమ్ముకుని సమావేశ వేదికయిన భవంతి కంతల గుండా లోనికి సైతం ప్రవేశించి, ప్రజలకు వ్యతిరేకంగా తమ కుట్రలను బయట వేలాదిమంది వ్యతిరేకిస్తున్నారన్న విషయాన్ని సమావేశమైన అధ్యక్షులకు ప్రధానమంత్రులకు స్పష్టంగా గుర్తు చేసింది.*

*1999లో సియాటిల్‌లో జరిగిన నిరసనకంటే క్విబెక్ నిరసన కార్యక్రమం చాలా పెద్దది. ముఖానికి నల్లని ముసుగులు తొడుక్కున్న మిలిటెంట్లు, దెబ్బలు తగలకుండా హెల్మెట్లు, షీల్డ్‌లు పెట్టుకుని వచ్చిన పోలీసులతో శనివారం ఉదయాన్నే పోరాటానికి దిగారు. వాళ్ళు పేపర్‌తో తయారు చేసిన మండుతున్న బంతుల్ని ఫెన్సింగ్‌లోకి విసిరారు. సదస్సు జరిగినన్ని రోజులు, సమావేశ స్థలానికి బయట, నాయకులున్న చోటుకు కేవలం 800 మీటర్ల దూరంలో వున్న స్థలాల్లో పోలీసులతో దొమ్మీలు జరుగుతూనే వున్నాయి.*

### ప్రపంచ వ్యాప్తంగా మేడే ప్రదర్శనలు

రష్యా అంతటా ఉద్యోగాలు, మెరుగైన వేతనాలు, ధరల అదుపును డిమాండు చేస్తూ పెద్ద పెద్ద ప్రదర్శనలు జరిగాయి. మాస్కోలోనే 15,000 మందికి పైగా పాల్గొన్న ఊరేగింపులు అనేకం జరిగాయి. ఉక్రెయిన్‌లో అధ్యక్షుడు గద్దె దిగాలని, అతని పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో ఇటీవల పెరిగిన ఆగ్రహానికి కొనసాగింపుగా అనేక నగరాల్లో పెద్ద పెద్ద ఊరేగింపులు జరిగాయి. అదే విధంగా హంగరీ, బల్గేరియా, రుమేనియా, సెర్బియా, పోలెండులలో కార్మికులు ఊరేగింపులు జరిపారు.

మధ్య, దక్షిణ అమెరికాలో పన్నుల పెంపును, యూనియన్లపై నిరుద్యోగంపై ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మేడే ప్రదర్శన కారులు వీధుల్లోకొచ్చారు. పదుల వేల సంఖ్యలో కార్మికులు పన్నుల

పెంపును వ్యతిరేకిస్తూ మెక్సికో నగరంలో నిరసన జరిపారు. అర్జెంటీనాలో నిరసనకారులు ముఖాలకు ముసుగులు కప్పుకుని నిరుద్యోగాన్ని రూపు మాపే ఆర్థిక ప్రమాణాల కోసం పిలుపునిచ్చారు.

ఆసియా దేశాల్లో, అదే విధంగా ఆఫ్రికా దేశమైన జింబాబ్వేలో కూడా బలమైన నిరసనలు చోటు చేసుకున్నాయి.

జపాన్‌లో ఎక్కువగా ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితంగా పెరిగిన నిరుద్యోగాన్ని వ్యతిరేకిస్తూ, దేశ వ్యాప్తంగా 13 లక్షల మంది ప్రజలు ట్రేడ్ యూనియన్ ఊరేగింపుల్లో పాల్గొన్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ప్రభుత్వం ప్రారంభించిన ఆర్థిక పునర్నిర్మాణానికి, ఏప్రిల్‌లో దేవూ మోటార్ కార్మికులపై జరిగిన పోలీసుల దాడులకు వ్యతిరేకంగా 20,000 మంది కార్మికులు నిరసన జరుపుతూ 15,000 మంది పోలీసుల్ని ఎదుర్కొన్నారు. తైవాన్‌లో కూడా ఉద్యోగాలు కావాలని, ప్రభుత్వ ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, వేలాది నిరుద్యోగులు, యూనియన్ కార్యకర్తలు, రాజధాని తైపేలో ఊరేగింపు జరిపారు.

**సామ్రాజ్యవాద వ్యతిరేకత నుండి కమ్యూనిజం వైపుకు...**

పెట్టుబడిదారీ విధానానికి ఏకైక ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని పీడిత ప్రజలు గ్రహించడానికి ఇంకెంతో కాలం పట్టదు. రివిజనిస్టులు కమ్యూనిజానికి తెచ్చిన అప్రతిష్ట వల్ల అనేక సెక్షన్ల ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. రష్యా, చైనా, వియత్నాం, తూర్పు యూరప్ మొదలైన దేశాల్లో అధికారం రివిజనిస్టుల చేతుల్లోకి పోవటం, కమ్యూనిజం పేరుతో వాళ్ళు పూర్తిగా భ్రష్టు పట్టడం రివిజనిస్టు ట్రేడ్ యూనియన్ల అవినీతి, పెత్తందారీతనం, అధికారంలో వున్న రివిజనిస్టుల నియంతృత్వ, నిరంకుశ విధానాలన్నీ కలిసి కమ్యూనిజాన్ని అప్రతిష్ట పాలు జేశాయి. రివిజనిస్టులంటే కమ్యూనిస్టులు కాదని, లెనిన్ చెప్పినట్లు కార్మిక వర్గ ఉద్యమంలోనే వున్న బూర్జువాలు తప్ప మరొకటి కాదని అప్పుడు ప్రజలు తెలుసుకోలేక పోయారు. కమ్యూనిజాన్ని బయటినుండి చేసే దాడులతో నాశనం చేయలేమని బూర్జువా వర్గం తెలుసుకుని, కమ్యూనిస్టుల్ని రివిజనిస్టులుగా మార్చడానికి తన ఏజెంట్లను కార్మికవర్గ ఉద్యమంలోకి పంపింది. ఈరోజు కూడా, కార్మికవర్గాన్ని మోసం చేస్తున్న ఈ దేశద్రోహుల ఆధ్వర్యంలోనే అనేక మేడే ఊరేగింపులు జరుగుతున్నాయి.

కానీ రివిజనిజాన్ని బ్రద్దలుకొట్టిన తరువాత మాత్రమే పోరాట చొరవ పెరుగుతుంది. ఈ పోరాటాల్లో పాల్గొంటున్న వేలాదిమంది పర్యావరణవాదులు, అరాచకవాదులు, ఇంకా పెటీబూర్జువా విప్లవకారులు సామ్రాజ్యవాద వ్యవస్థను అసహ్యించుకుంటున్నారు. కానీ, వీళ్ళ దగ్గర నిర్దిష్టమైన ప్రత్యామ్నాయం లేదు. వీరిలో నిజాయితీ చిత్తశుద్ధి కల్గిన వాళ్ళు కమ్యూనిజం వైపే తిరుగుతారు. ప్రజలు తమంతటతాముగా నిజమైన కమ్యూనిస్టులకు, బూటకపు కమ్యూనిస్టులకు మధ్య తేడా తెలుసుకున్నపుడు, నిజమైన కమ్యూనిస్టు (మావోయిస్టు) లకు వివిధ రకాల రివిజనిస్టులకు మధ్య స్పష్టమైన విభజన రేఖ ఏర్పడినప్పుడు పై మార్పు చాలా తేలికగానే జరుగుతుంది. ❑

## పి.కె.కె. సంపూర్ణ లొంగుబాటు

రెండేళ్ళ క్రితం వరకూ కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పి.కె.కె.) ప్రత్యేక కుర్దిష్ జాతి కోసం పోరాడుతున్న ఒక జాతీయ విప్లవ పార్టీగా పేరుపొందింది. అయితే ఆ తర్వాత నుండి అది జాతీయ సంస్కరణవాద పార్టీగా మారిపోయింది.

పి.కె.కె. నేత ఒకలాన్ అరెస్టతో లొంగుబాటు వేగం పుంజుకుంది. పి.కె.కె.కి ద్వంద్వ స్వభావముంది కాబట్టి ఈ లొంగుబాటు గురించి ముందునుంచి ఊహించిందే అయినప్పటికీ కేవలం నెలరోజుల లోపే సంపూర్ణ లొంగుబాటు జరిగిపోతుందని ఎవరూ ఊహించలేదు. సిద్ధాంతపరమైన లొంగుబాటు నుండి అంతిమంగా సైనికపరమైన లొంగుబాటు వరకూ లొంగుబాటు క్రమం పూర్తయ్యేందుకు ఇతరులకు... ఉదాహరణకు పాలస్తీనా పోరాటానికి సం॥ల కాలం పట్టింది.

ఒకలాన్, పి.కె.కె. నాయకత్వం లొంగుబాటు పూర్తయ్యాక వారికి సంబంధించిన 10 వేల మంది గెరిల్లా బలగంలో మూడింట ఒకవంతు బలగం రద్దు కాగా మిగిలిన వారిలో చాలామంది ఇతర దేశాలకు వెళ్ళిపోయారు. ఇపుడు టర్కీలో పి.కె.కె.కి సంబంధించిన గెరిల్లాలు కేవలం 150 మంది మాత్రమే కొనసాగుతున్నారు. వీరు సైతం నిజంగా పోరాడుతున్న వారిని నిర్మూలించే లక్ష్యంతోనే పనిచేస్తున్నారు. కుర్దిస్తాన్ విముక్తి కోసం సాయుధ పోరాటాన్ని కొనసాగించాలని కోరుకుంటున్న పి.కె.కె. నాయకత్వం వెంటాడి చంపుతోంది. లొంగుబాటు తర్వాత ఇంతవరకూ 300 మంది పి.కె.కె. గెరిల్లాలు ఇలా చంపబడ్డారు. ఇంకా ఘోరంగా, డెర్సిమ్ రీజియన్‌లో సాయుధ పోరాటాన్ని కొనసాగించాలనుకున్న ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులను సైతం ఈ విధంగానే చంపేశారు.

అయితే 'పి.కె.కె. విప్లవ పంథా యోధులు'గా తిరిగి సంఘటితమైన అనేకమంది గెరిల్లాలు ఇప్పటికీ ప్రతిఘటిస్తూనే వున్నారు.

టర్కీకి చెందిన 10 లక్షల మంది సైన్యంలో మూడున్నర లక్షల మంది సైనిక బలగాన్ని గతంలో పి.కె.కె.కి వ్యతిరేకంగా సమాయత్తపరిచారు. ఇప్పుడు రాత్రికి రాత్రే ఈ సైనిక బలగాలతో చాలామందిని టి.కె.పి./యం.యల్.పై ప్రధానంగా దృష్టిపెట్టేలా తరలించేశారు. గత నాలుగు దశాబ్దాల కాలంలో నలుగురు టి.కె.పి./యం.యల్. పార్టీ ప్రధాన కార్యదర్శులను, ఇతర అత్యున్నత నాయకులను, వందలాదిమంది కేడర్‌ని అమెరికా, ఇజ్రాయిల్ దన్ను కలిగిన టర్కీ ఫాసిస్ట్ రాజ్యం పొట్టన బెట్టుకుంది. ప్రపంచంలోకెల్లా పాశవిక శక్తుల్లో ఒకటైన టర్కీ రాజ్య వ్యవస్థను ఎదుర్కొంటూనే మావోయిస్టు ప్రజాయుద్ధం అభివృద్ధి చెందుతూ వుంది. ప్రపంచంలోనే అత్యంత వ్యూహాత్మక ప్రాంతమైన టర్కీలో మావోయిస్టు ఉద్యమం పెరుగుదల ప్రపంచంలోని నిజమైన విప్లవకర శక్తులకు గొప్ప ఆశావహ దృష్టిని కల్పిస్తుంది. ❑

(చివరి పేజీ తరువాయి...)

అవకాశాలతో తీవ్ర వెనుకబాటు ప్రాంతాలుగా మిగిలి పోయాయి.

''విభజించు పాలించు'' అనే బ్రిటీషు విధానం ప్రకారం ఐక్యత, సుస్థిరతలను దెబ్బతీయడానికి ఉద్దేశ్యపూర్వకంగా జాతుల్ని వివిధ ప్రాంతాలలో విభజించారు, అదే బ్రిటీషు పాలనా కాలంలో వివిధ జాతులు స్వయం నిర్ణయాధికార హక్కును సాధించుకోవడానికి భాషా ప్రాతిపదికన చేసిన రాష్ట్రాల పునర్నిర్మాణ ఉద్యమం ఒక ప్రధాన పోరాట రూపంగా ముందుకొచ్చింది.

1947 లో బ్రిటీషు పాలకులు భారతదేశం విడిచి వెళ్ళినపుడు వాళ్ళు ఏర్పాటు చేసిన రాష్ట్రాలతోపాటు 561 సంస్థానాలున్నాయి. వివిధ ప్రావిన్స్‌లు, జాతి రాజ్యాల మధ్య జాతులు విభజింపబడిన సంక్లిష్టమైన పరిస్థితుల కారణంగా ఒకే భాష మాట్లాడుతూ కూడా వివిధ ప్రావిన్స్‌లు, స్థానిక రాష్ట్రాల మధ్య విభజింపబడిన ప్రజలు నివసించే భౌగోళిక ప్రాంతాల మధ్య జాతీయ చైతన్యం భిన్న రూపాలు తీసుకోవటం మనకు కన్పిస్తుంది.

ఆ విధంగా బ్రిటీషు వలసపాలన, ఆ తరువాత 50 సంవత్సరాల అర్ధవలస, అర్ధభూస్వామ్య పాలన రెండూ కలిసి భారతదేశంలోని వివిధ ప్రాంతాలు, జాతుల మధ్య తీవ్ర అసమానతలకు దారితీశాయి. ఈ అసమానాభివృద్ధి జాతీయ చైతన్యానికి, జాతులు తమ హక్కుల్ని వ్యక్తపరచటానికి దారితీయటం మాత్రమేగాక, ప్రాంతీయ చైతన్యం, ప్రాంతీయ గుర్తింపు ఇంకా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లు లేక జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్, విదర్భ, తెలంగాణా మొదలైన డిమాండ్లు ముందుకు వచ్చినట్లు ప్రాంతీయ ఆకాంక్షల ప్రాతిపదికన స్వయం నిర్ణయాధికారానికి సంబంధించిన ఇతర పోరాట రూపాలకు కూడా దారితీసింది. వీటిలో కొన్ని జాతులకు వాటికి సంబంధించిన భౌగోళిక ప్రాంతాల్లో ఒక వుమ్మడి భాష అనేది లేకపోగా, మరికొన్ని అదే భాష మాట్లాడుతున్న పెద్దజాతిలో భాగమైపోయినాయి. ఇటువంటి అనేకానేక డిమాండ్లు భారత పాలకవర్గాలు ఎంచుకున్న అభివృద్ధి వ్యూహం మేరకు భవిష్యత్తులో తలెత్తినున్నాయి.

జాతి (నేషన్) లేక, జాతి (నేషనాలిటీ) అనే సాంప్రదాయక నిర్వచనానికి సరితూగని ఇటువంటి ఉద్యమాలకు ఎవరైనా ఎందుకు మద్దతివ్వాల్సి వుంది? ప్రాంతీయ వివక్షత, అసమానతల ప్రాతిపదికన జాతిని విభజించాలనడాన్ని ఎవరైనా ఎలా సమర్థించుకోగలరు? ఒకే రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం నుండి ఇటువంటి అనేకానేక డిమాండ్లు తలెత్తడానికి ఇది దారితీయదా? ఇటువంటి ప్రశ్నలు సదవగాహన గల కొద్దిమంది మధ్యతరగతి మేధావులతో పాటు కొంతమంది పిడివాద మార్క్సిస్టులు కూడా వేస్తున్న ప్రశ్నలు.

ఒకే భాష, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, మానసిక ప్రవృత్తి కలిగి ఒక భౌగోళిక ప్రదేశంలో నివసించే స్థిరమైన ప్రజాసమూహాన్ని జాతి (నేషన్) లేక జాతి (నేషనాలిటీ) అని పిలవటం మనకు తెలిసిందే. పశ్చిమ యూరప్‌లో భూస్వామ్య విధానానికి, మధ్యయుగపు రోమన్ క్యాథలిక్ చర్చిల తీవ్ర అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో జాతులు పుట్టుకొచ్చాయి. పెట్టుబడిదారీ అభివృద్ధే భూస్వామ్య సామ్రాజ్యాల స్థానంలో జాతి రాజ్యాలు ఆవిర్భవించడాన్ని సాధ్యపర్చింది. బ్రిటీషు ఆధిపత్యానికి వ్యతిరేకంగా బ్రిటీషు, ఫ్రెంచి ఇంకా ఇతర వలస ప్రజలు చేసిన పోరాట ఫలితంగా అమెరికన్ జాతి ఆవిర్భవించింది. అమెరికన్లు ప్రధానంగా బ్రిటీషు వాళ్ళైనప్పటికీ, ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక ప్రాంతం, మనస్తత్వం కలిగి వున్నందువల్ల వాళ్ళు ప్రత్యేక సార్వభౌమాధికారం గల రాజ్యాన్ని కోరుకున్నారు.

సాధారణంగా, అభివృద్ధి చెందిన జాతుల లేక బహుళజాతి రాజ్యాల పాలకవర్గాల నుండి భరించరాని అణచివేతకు గురైనప్పుడు మాత్రమే ఒక పెద్ద రాజ్యం నుండి ఒక జాతి విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారాన్ని కోరుకుంటుంది. నిజమైన ప్రజాస్వామ్య స్థాపన, అన్ని జాతుల, భాషల సమానత్వం వున్నంతవరకు ఏ జాతి కూడా విడిపోవటం గురించి ఆలోచించదు.

భారత ప్రజలందరికీ భూస్వామ్యం సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం సాధారణ శత్రువులు కాగా కొన్ని ప్రాంతాలకు స్థానిక దళారీలనే అదనపు శత్రువు కూడా వుంటున్నాడు. అదే రాష్ట్రంలోని బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాల నుండి వచ్చిన ప్రాంతీయ దళారులు సామ్రాజ్యవాదులతో, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులతో కుమ్మక్కై వెనుకబడిన ప్రాంతాల సంపద, వనరులను దోపిడీ చేసి అక్కడి ప్రజలను రాజకీయంగా, సాంస్కృతికంగా అణచివేసి ఆ ప్రాంతాలను వాస్తవంగానే తమ సొంత వలసలుగా మార్చుకుంటున్నారు. ఇది అనివార్యంగా ప్రాంతీయ గుర్తింపు సమస్యకి, ప్రాంతీయ చైతన్యంకి దారితీయడమేగాక ఇంకా ప్రత్యేక రాష్ట్ర డిమాండుకు భౌతిక పునాదిని సైతం కల్పిస్తోంది.

ఈ విధంగా ఒక జాతిలోని ఒక భాగం, అదే జాతిలోని బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం నుండి సవతి తల్లి పెంపకం లాంటి వివక్షతను ఎదుర్కొంటూ, ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండు చేసినపుడు ఆ డిమాండుకు మద్దతివ్వక పోవటం సరైనదేనా? అభివృద్ధి చెందిన ప్రాంతం నుండి అధికారంలోకి వచ్చిన గ్రూపు అమలు చేసే అణచివేతను కమ్యూనిస్టులు అనుమతించవచ్చా? ఏ రకమైన జాతి మత, ప్రాంత, లింగ, వర్ణ దోపిడీ పీడనలనైనా వ్యతిరేకించటమే కమ్యూనిస్టు లక్షణం. అలా వ్యతిరేకించక పోతే అలాంటి వారు కమ్యూనిస్టులుగా వుండటం మాట అటుంచి, కనీస ప్రజాస్వామికవాదులుగా కూడా వుండలేరు. ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు, మానసిక ప్రవృత్తి తదితర అంశాలపై ఆధారపడి తమ స్వంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే నిర్ణయం అనేది ఆ ప్రాంతంలోని స్థానికుల ప్రజాస్వామిక హక్కు. అందువల్ల పీడిత జాతుల పోరాటాలకు మద్దతివ్వటంలో వర్తించే కారణాలు ఇటువంటి పోరాటాలకు కూడా వర్తిస్తాయి.

అంతర్జాతీయ పెట్టుబడి పెద్దఎత్తున చలనంలో వుంటూ, త్వరిత లాభాల కోసం వెదుకులాటలో సాపేక్షికంగా బాగా అభివృద్ధి చెందిన మెరుగైన మౌలిక సదుపాయాలతో కూడిన ప్రాంతాలకు పెట్టుబడి ప్రవహిస్తున్న నేటి ప్రపంచీకరణ పరిస్థితుల్లో ప్రాంతీయతా హక్కు కోసం (రీజనల్ అజర్షన్) డిమాండ్ చేసే

ధోరణి మరింతగా పెరుగుతుంది. ఈ పరిస్థితి ఒకే జాతి లేక బహుళ జాతి రాజ్యంలో ప్రాంతీయ అసమానతల్ని పెంచుతూ వెనుకబడిన ప్రాంతాల్ని మరింత వెనుకబాటు స్థితిలోకి నెడుతుంది. ఈ వెనుకబాటు ప్రాంతాలు అభివృద్ధి చెందిన ప్రాంతాలకు సేవలందించే వెనకతట్టు ప్రాంతాలుగానే కొనసాగుతాయి. మీదు మిక్కిలి, నయా ఉదారవాద విధానంలో పాలకవర్గాలు కనీస సాంఘిక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను కూడ సరిగా అమలు చేయకపోవటంతో, వెనుకబడిన ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రత్యేకించి పీడిత ప్రజలు ఘోరంగా దెబ్బతింటారు. ఇది ప్రాంతీయ స్వపరిపాలన, రాష్ట్ర ప్రతిపత్తిల కోసం మరింత ఎక్కువగా డిమాండు చేయటానికి దారితీస్తుంది. ఇటువంటప్పుడు సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలతోనేకాక, తమ జాతిలోనే అభివృద్ధి చెందిన ప్రాంతాల పెట్టుబడిదారుల నుండి కూడా దోపిడీకి గురౌతున్న వెనుకబడిన ప్రాంతాల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు మద్దతునివ్వటం అనే విషయంపై మార్క్సిస్టు- లెనినిస్టులు స్పష్టత కలిగి వుండాలి.

ఒకే భాష మాట్లాడుతున్న లేక ఒకే విశాల జాతిగా ఏర్పడిన ప్రజలు ఒకే రాష్ట్రంలో వుండాలి అనే వాదన ఆచరణాత్మక దృక్కోణం నుంచి, సిద్ధాంత పరమైన దృక్కోణం నుంచి కూడా సరైన ప్రతిపాదన కాదు. ఇటువంటి దృక్కోణం నుంచి ఆలోచించే వాళ్ళంతా హిందీ మాట్లాడే ప్రాంతాలన్నింటినీ ఒకే రాష్ట్రం కిందికి తీసుకురావాలని లేక బెంగాలీ భాష మాట్లాడే అస్సాంలోని ప్రాంతాలతో సహా తూర్పు, పశ్చిమ బెంగాల్ అంతటిని కలిపి గ్రేటర్ బెంగాల్‌గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు సైతం చేసేటటువంటి తర్కానికి కట్టుబడి వాదిస్తుంటారు.

చారిత్రకంగా కూడా ఆస్ట్రియాకు చెందిన జర్మన్లు సార్వభౌమాధికారం గల జాతి రాజ్యంగానే ఆవిర్భవించారుగానీ, జర్మనీలో భాగంగా వుండాలని కోరుకోలేదు. ఈ సందర్భంగానే జర్మన్లు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకం కావాలి అనే నినాదంతో హిట్లర్ జర్మన్ జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టాడు. కొసావో ప్రజలు ఆల్బేనియన్ జాతికి చెందినప్పటికీ, చాలాకాలంగా యుగోస్లావియాలో భాగంగానే వున్నారు. ఇప్పుడు వాళ్ళు ఆల్బేనియాలో భాగంగా వుండటం కోసం కాక, తమ సార్వభౌమాధికారం కల్గిన రాజ్యం ఏర్పాటు కోసం పోరాటం ప్రారంభించారు. అలాగే ఇంగ్లీషు మాట్లాడే ప్రజలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వ్యాపించి, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మొదలైన ప్రత్యేక రాజ్యాలు ఏర్పాటు చేసుకున్న చరిత్ర కూడా వుంది. భారత దేశంలో బ్రిటీషు పాలనలో జరిగినట్లు ప్రజల్ని విడదీయడంలో భాగంగా ఒక జాతిని విభజించి ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పరిస్తే దాన్ని తప్పక వ్యతిరేకించాలి. కానీ ప్రజలు తమకు తాము ప్రత్యేక రాజ్యం ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటే, దానికి మద్దతివ్వక పోవటం సరైంది కాదు.

వాస్తవంగా, ఒకే జాతికి చెందిన అభివృద్ధి చెందిన ప్రాంతాల నుండి అధికారంలోకి వచ్చిన ఉన్నతవర్గాల అణచివేతకు తాము గురౌతున్నామని, అభివృద్ధి చెందిన ప్రాంతం వల్ల తాము అన్ని రకాలుగా వివక్షతకు గురవుతున్నామని వెనుకబడిన ప్రాంతాల ప్రజలు భావించినంత కాలం, అలాంటి జాతిని నిజమైన సమగ్రత, సమైక్యత కల్గిన జాతిగా ఎవరూ భావించలేరు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడినపుడు అది ప్రజల ఐక్యతను దెబ్బతీయక పోగా, సమానత్వ ప్రాతిపదికన గట్టి పునాదిపై రెండు ప్రాంతాల ప్రజల మౌలిక ఐక్యత పెరుగుతుంది.

వాస్తవంగా, ఒకే జాతి లేక, వుమ్మడి భాష ప్రాతిపదికన కలిసి జీవించడానికి ప్రజలు సంసిద్ధంగా లేనప్పటికీ, వివిధ ప్రాంతాల ప్రజలు ఒకరికొకరు విడిపోకుండా బలవంతంగా ఆపటమనేది సత్ఫలితాలను ఇవ్వకపోగా, ఆ రెండు ప్రాంతాల ప్రజలెప్పుడూ చైతన్యరహితంగానే వుండాలని కోరుకునేటటువంటి, మరియు శాశ్వతంగా ఆ ప్రజల్ని విడదీసి వుంచే క్రమంలో ఒకరిపై ఒకర్ని రెచ్చగొట్టేటటువంటి పాలకవర్గాల చేతుల్లో ఇది పావుగా కూడా మారుతుంది. అయితే ఇందుకు విరుద్ధంగా, ప్రాంతాలను వివిధ రాష్ట్రాలుగా విభజించటం అనేది వాస్తవంగా రెండు ప్రాంతాల ప్రజల మధ్యను విరోధానికి గల అవకాశాలను తగ్గించి, విభజన తరువాత ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా సమైక్య పోరాటానికి గట్టి పునాదిని ఏర్పరుస్తుంది. వివిధ ప్రాంతాల ప్రజలు ఒకరిపై ఒకరు పరస్పర అపనమ్మకం, అనుమానాలతో వుంటున్నంత కాలం, ఒక ప్రాంతం కంటే మరో ప్రాంతం తక్కువగా చూడబడుతూ, దోపిడీకి గురౌతున్నంత కాలం, వెనుకబడిన ప్రాంతాల ప్రజలు భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలే తమ ప్రధాన శత్రువులనేది గుర్తించకుండా, అభివృద్ధి చెందిన ప్రాంతాల ప్రజల్నే తమ శత్రువులుగా భావించేటట్లు పాలకవర్గాలు వారిని ప్రక్కదారి పట్టిస్తాయి. పాలకవర్గాలు సంక్షోభ పరిస్థితిలో పడిన ప్రతిసారీ ఇలాగే జరుగుతుంది. ఇటువంటి ప్రాంతాల్ని ప్రత్యేక రాష్ట్రాలుగా విభజించటమనేది ప్రజల మధ్య అపనమ్మకం, ఉద్రిక్తతల్ని తగ్గించటమేగాక, రెండూ ప్రత్యేక రాష్ట్రాలుగా వుంటున్నప్పటికీ, ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఆ ప్రజల్ని ఐక్యపరుస్తుంది.

### ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణా విలీనం - సంక్షిప్త చరిత్ర

చారిత్రకంగా చూస్తే, తెలుగు మాట్లాడే మిగతా ఆంధ్ర ప్రజానీకంతో తెలంగాణా ప్రాంతం వాస్తవంగా కలిసి వుండలేదు. రాయలసీమ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలున్న ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి. ఈ ప్రాంతాలు ఎల్లప్పుడూ చాలా వెనుకబడిన ఆర్థిక వ్యవస్థలనూ, తమ తమ ప్రత్యేక భూభాగాల్ని, సంస్కృతిని కలిగి వుండేవి.

1956 నవంబర్‌లో మిగతా తెలుగు మాట్లాడే ప్రాంతాలతో విలీనమయ్యే వరకు తెలంగాణా ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా వుండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యేవరకు ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు ఒకే ఐక్య ఆర్థిక వ్యవస్థ అన్నది లేదు. హైదరాబాద్ రాష్ట్రంలో మూడు వేరు వేరు జాతులున్నాయి. అవి తెలుగు మాట్లాడే తెలంగాణా; రాయచూర్, గుల్బర్గా, బీదర్ జిల్లాలతో కూడిన కన్నడ మాట్లాడే ప్రాంతం. ఔరంగాబాద్, ఉస్మాన్‌బాద్, లాతూర్, నాందేడ్ మొదలైన జిల్లాలతో కూడిన మరాఠీ మాట్లాడే మరట్వాడా ప్రాంతాలు. ఇక బ్రిటీషు

ప్రావిన్స్‌లలో చూస్తే - మద్రాస్ ప్రెసిడెన్సీలో కన్నడ మాట్లాడే బళ్ళారి జిల్లా, కొడుగు మాట్లాడే కూర్గు జిల్లాలతోపాటు తెలుగు, తమిళ అనే రెండు ప్రధాన జాతులుండేవి. బొంబాయి ప్రెసిడెన్సీలో మరాఠీ, గుజరాతీ, కన్నడ భాషలు మాట్లాడే జాతుల విశాల భూభాగాలుండేవి. తెలుగు, కన్నడ, గుజరాతీ, మరాఠీ, భాషలు మాట్లాడే జాతులు వారి వారి భాషల ప్రాతిపదికన ఏకం కావాలనే డిమాండు అధికార మార్పిడీ తరువాత వేగవంతమై చివరికి 1950ల మధ్యలో ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకు దారితీసింది.

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు విషయానికొస్తే రాయలసీమ తన స్వప్రయోజనాల రీత్యా, బాగా అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంతో విలీనం కావటానికి మొదట సిద్ధంకాక పోయినప్పటికీ, ఆ ప్రాంతం యొక్క సాగునీటి సౌకర్యాల, విద్య అభివృద్ధిని పరిరక్షించే షరతుపై 1937 నాటి శ్రీ బాఘ్ ఒడంబడిక ద్వారా చివరికి విలీనం జరిగింది. ఆ విధంగా మొదట తెలుగు మాట్లాడే కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలు మద్రాసు ప్రెసిడెన్సీలోని తమిళ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఐక్యమై, 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నారు. ఇక వందల సంవత్సరాల పాటు నిజాం ప్రభుత్వం క్రింద భూస్వామ్య వెనుకబాటుతనంలో మగ్గిపోయిన తెలంగాణా ప్రజలు, తాము ఒకే రాష్ట్రంగా విలీనమైతే, కోస్తాంధ్ర నుండి వచ్చి స్థిరపడినటువంటి బాగా అభివృద్ధి చెందినవారు తమ ప్రాంతాన్ని అణచివేస్తారని భయపడ్డారు.

కాని, కోస్తాంధ్ర భూస్వాముల, ధనికవర్గాల డేగకళ్ళు పుష్కలంగా వనరులున్న తెలంగాణా ప్రాంతంపై పడ్డాయి. సారవంతమైన కోస్తా భూముల్లో వ్యవసాయం ద్వారా సాధించిన మిగులు పెట్టుబడిని మదుపు చేయడానికి వాళ్ళకు ముడిసరుకుల వనరులు, మార్కెట్లు కావలసి వచ్చాయి. అంతేగాక, హైదరాబాద్ మాదిరిగా రాజధానిగా సేవలందించే నగరం ఆంధ్ర రాష్ట్రంలో లేనే లేదు. అందువల్ల ఆంధ్ర పెట్టుబడిదారులు తెలంగాణాలోని స్వంత భూములకు సంబంధించిన ప్రయోజనాలున్న భూస్వాముల (ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కమ్యూనిస్టులతో ముప్పు వుంటుందని భయపడిన వాళ్ళతో) తో ఒప్పందాల బేరసారాలు ప్రారంభించి, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

రెండు ప్రాంతాల సమస్యల్ని పరిశీలించిన తరువాత 1955లో రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం గుర్తించి ప్రభుత్వానికి సమర్పించిన అంశాలను ఇక్కడ గమనించటం చాలా ముఖ్యమైనది. విలీనం విషయంలో ఆంధ్ర ప్రాంతపు ఆధిపత్యం వల్ల భవిష్యత్తులో ఏర్పడే ప్రమాదాన్ని అది సూచించింది.

*''ఆంధ్రతో కలిసిపోతే, ఆంధ్ర ప్రజలతో వుండే సంబంధాల్లో తమకు తక్కువ స్థానం దక్కుతుందని, ఈ భాగస్వామ్యంలో ఒనగూడే ప్రయోజనాలన్నింటిని ప్రధాన భాగస్తులు త్వరగా దక్కించుకుంటారని, తెలంగాణాను కోస్తాంధ్ర తన వలస ప్రాంతం క్రిందికి మారుస్తుందని వాస్తవంగా తెలంగాణా ప్రజలు భయపడ్డారు''. ఆంధ్ర ప్రాంతంలో అత్యధిక మెజారిటీ అభిప్రాయం పెద్ద, ఐక్య రాష్ట్రంకే అనుకూలంగా వుండగా తెలంగాణాలో ప్రజాభిప్రాయం ఇంకా స్థిరమైన రూపం దాల్చాల్సిన స్థితిలోనే వుందని* కూడా రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం నివేదిక ప్రకటించింది.

1961 సాధారణ ఎన్నికల తరువాత ఆంధ్రతో ఐక్యత సాధించే ప్రాతిపదికన హైద్రాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే, హైదరాబాద్ రాష్ట్రంలోని మూడింట రెండు వంతుల శాసన సభ్యులు ఈ ఐక్యతకు అనుకూలంగా మద్దతిస్తే, ఇది ఆంధ్రతో పాటు తెలంగాణా ప్రయోజనానికి అనుకూలంగా వుంటుందని ఆ నివేదిక సిఫారసు చేసింది. *''రెండు రాష్ట్రాల నిజమైన ఐక్యతకు అవసరమైన ఆమోదయోగ్యమైన ప్రజాభిప్రాయాన్ని సాధించడానికి, భవిష్యత్తులో రాగల ప్రమాదాల గురించిన భయాలను తొలగించడానికి''* ఈ విధమైన స్వల్ప విరామదశ ఒకటి అవసరమని అప్పట్లో భావించబడింది.

*''ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలు ప్రయోజనాలు ఒకటేనని, ఈ ప్రయోజనాలు రెండు ప్రాంతాల ప్రజల్ని దగ్గర చేస్తాయని''* ఆశిస్తున్నట్లుగా ఆ నివేదిక భావించింది. *''రెండు ప్రాంతాల ఐక్యతకు అనుకూలమైన పరిస్థితులు వాస్తవ రూపం దాల్చకపోతే, తెలంగాణా ప్రజల మనోభావాలు రెండు రాష్ట్రాల ఐక్యతకు వ్యతిరేకంగా స్థిరంగా రూపుదిద్దుకున్నట్లయితే అప్పుడిక తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగానే కొనసాగాల్సి వుంటుందని''* ఆ నివేదిక హెచ్చరించింది. కానీ ఈ హెచ్చరికల్ని లెక్కచేయకుండా తెలంగాణాలోని కాంగ్రెస్ నాయకత్వం కేంద్రం వత్తిడికి తలొగ్గి 1956లో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకం చేసింది.

**ఒప్పందంలోని కొన్ని ముఖ్యమైన అంశాలు:**

1. తెలంగాణా ప్రాంతానికి రాష్ట్ర శాసనసభ నుండి ప్రాంతీయ స్టాండింగ్ కమిటీని ఏర్పరచి, ప్రత్యేక విషయాలకు సంబంధించిన విధాన నిర్ణయాలను ఈ కమిటీ అభిప్రాయానికి పంపాలి.

2. ఈ కమిటీ ఇచ్చే సలహాను రాష్ట్ర విధానసభలో ప్రభుత్వం సర్వ సాధారణంగా అంగీకరించాలి.

3. అభివృద్ధి, ఆర్థిక ప్రణాళిక, స్థానిక స్వపరిపాలన, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, ప్రాథమిక, ద్వితీయ విద్య, తెలంగాణా ప్రాంతంలోని విద్యా సంస్థల్లో ప్రవేశాల క్రమబద్ధీకరణ, మద్య నిషేధ చట్టం, వ్యవసాయ భూముల అమ్మకం, కుటీర, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయం, సహకార సంఘాలు మొదలైన రంగాలను ఈ ప్రాంతీయ కమిటీ నిర్వహిస్తుంది. ఈ ఒడంబడికపైన పది సంవత్సరాల తరువాత తిరిగి ఒక సమీక్ష జరుగుతుంది.

4. అప్పటి హైదరాబాద్ ముల్కీ చట్టంలోని నివాస నిబంధనలైన ముల్కీ నిబంధనల (తెలంగాణా ప్రాంతాల్లో 12 సం॥ నివసించి వుండటం) ను ఉద్యోగ నియామకాల విషయంలో కూడా కొనసాగించాలి.

5. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల మధ్య ఖర్చు చేసే నిధుల పంపిణీ రెండు ప్రాంతాలకు తగు నిష్పత్తిలో వుండాలి. తెలంగాణా ప్రాంతం నుండి వచ్చే ఆదాయపు మిగులును ఆ ప్రాంత అభివృద్ధిపై

ఖర్చు చేయడానికి నిల్వ చేయాలి.

6. తెలంగాణాలోని సాంకేతిక విద్యతో సహా వున్నటువంటి విద్యా సౌకర్యాలను తెలంగాణా విద్యార్థుల కోసం పరిరక్షించి మరింత మెరుగు పరచాలి.

7. మంత్రివర్గంలో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు వరుసగా 60:40 నిష్పత్తిలో సభ్యులుండాలి. తెలంగాణాకు సంబంధించిన 40% మంత్రుల్లో తెలంగాణా నుండి ఒక ముస్లిం సభ్యుడుండాలి. ఒక ప్రాంతానికి చెందినవారు ముఖ్యమంత్రిగా ఎన్నికైతే, మరొక ప్రాంతానికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి.

ఈ ఒప్పందంలో తెలంగాణాను దాని వెనుకబాటు తనం నుంచి బయటపడేసే చట్టపరమైన నిబంధనలుగాని, తగినంత నదీజలాలను ఇచ్చే నిబంధనగాని ఏమీలేదు. అంతేగాక ఒప్పందం జరిగిన నిబంధనలు కూడా కాగితాలకే పరిమితమయ్యాయి. ఆంధ్ర నుండి వలస వచ్చినవారికి వ్యవసాయ భూముల్ని అమ్మేయటం ఎక్కువైంది. ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తృతమైన సారవంత భూముల్ని ఆ ప్రాంతపు వెనుకబడిన రైతాంగానికి పదో పరకో ఇచ్చి గుంజుకున్నారు. స్థానికుల కోసం రిజర్వు చేసిన ఉద్యోగాలు ఆంధ్ర వలసదారులతో భర్తీ చేశారు. బోగస్ సర్టిఫికేట్లతో కాలేజీల్లో సీట్లు వలసాంధ్రులు ఎగరేసుకు పోయారు. తెలంగాణా అభివృద్ధికి కేటాయించిన నిధులు పెద్దఎత్తున కోస్తాంధ్రకు మళ్ళించబడ్డాయి. నదీ జలాలను కోస్తా ప్రాంత భూముల సాగుకు ఉపయోగిస్తుంటే, తెలంగాణా మాత్రం భూస్వామ్య వెనుకబాటుతనంలోనే మగ్గుతున్నది. తెలంగాణా ప్రాంతపు సంపద, వనరులను పద్ధతి ప్రకారం సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలకేగాక, ఆంధ్రా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కూడ కొల్లగొట్టారు.

ఈ వెనుకబాటుతనానికి వ్యతిరేకంగా నాన్‌గెజిటెడ్ ఆఫీసర్లు, విద్యార్థులు, యువకులు, మేధావులు వీధుల్లోకొచ్చి 1969లో మిలిటెంట్ పోరాటం చేశారు. 370 మందికి పైగా ప్రజలు వుద్యమంలో తమ ప్రాణాలర్పించారు. ఉద్యమం అదుపు తప్పి పోతోందని గుర్తించిన స్వార్థపరులు రంగంలోకి దిగి, రెండు ప్రాంతాలపై ఒప్పందం కుదుర్చుకున్నారు. అట్లే, తెలంగాణా ఉద్యమ నాయకత్వం ప్రజల ప్రయోజనాలకు ద్రోహం చేసి ఆంధ్ర ప్రాంత దళారీలతో రాజీ చేసుకుంది. అయినప్పటికీ, ప్రత్యేక తెలంగాణా భావన ఆ ప్రాంత ప్రజల మనస్సుల్లో చాలా దృఢంగా వుందని, 1971 మధ్యంతర ఎన్నికల్లో తేలింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌లోని అసమ్మతివాదులైన భూస్వామ్య శక్తులతో నిండిన తెలంగాణా ప్రజాసమితి తెలంగాణాలోని 14 పార్లమెంటు సీట్లకుగాను 10 స్థానాల్లో గెలిచింది.

1973లో, ముల్కీ నిబంధనలు రాజ్యాంగ బద్ధమైనవే అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటంతో, కోస్తాంధ్రకు చెందిన అధికారంలోని ధనికవర్గాలు మేల్కొని ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఉద్యమం మొదలుపెట్టారు. ఆంధ్రకు చెందిన సొంత ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం 6 అంశాల సూత్రాన్ని ఒకదాన్ని ప్రవేశపెట్టింది. ఈ సూత్రం తెలంగాణా ప్రజలకు వున్న హక్కుల్ని కూడా ఈ క్రింది పద్ధతుల్లో లాగేసుకుంటుంది.

1. ముల్కీ నిబంధనల్ని ఎత్తివేసి, తెలంగాణా స్థానికులకు అందుబాటులో వున్న కొద్దిపాటి ఉద్యోగావకాశాలను కూడా లేకుండా చేయటం.
2. ప్రాంతీయ స్టాండింగ్ కమిటీని రద్దు చేయటం.
3. తెలంగాణా నుండి వచ్చే ఆదాయ, వ్యయాలను ప్రత్యేకంగా చూపించే సంప్రదాయాన్ని నిలిపివేయటం.
4. రెండు ప్రాంతాలను 7జోన్ల క్రింద విభజించి, హైదరాబాద్‌ను ప్రత్యేక జోన్‌గా ఏర్పాటు చేయటం.
5. స్థానికులుగా అర్హత కల్పించటానికి ముల్కీ నిబంధనలోని 15 సంవత్సరాల నివాస కాలాన్ని 4 సం॥లకు తగ్గించటం.

6 అంశాల సూత్రాన్ని అమలు చేయటం వల్ల రెండు ప్రాంతాల ప్రజల మధ్య అసమానతలు మరింత ఎక్కువై ప్రాంతీయ అసమానత పెరగడానికి దారితీసింది. సాగునీటి సౌకర్యం, విద్యుదుత్పత్తి మరియు పంపిణీ, విద్య విషయాల్లోగానీ ఉపాధి కల్పన విషయంలోగాని తెలంగాణా ప్రజల హక్కుల్ని ఆంధ్రా పెట్టుబడిదారులు ఒక పథకం ప్రకారం గుంజుకున్నారు. ముల్కీ నిబంధనల్ని వదిలేసిన తర్వాత ఉద్యోగాల్లో తెలంగాణా వాటా 42% నుండి 10%కి పడిపోయింది. ఈరోజు 14 లక్షల ప్రభుత్వోద్యోగాల్లో తెలంగాణా వాటా 2 లక్షలు, ఇది కూడా చాలా క్రింది స్థాయి ఉద్యోగాలు మాత్రమే 1956లో తెలంగాణాను కలుపుకు నేటప్పుడు 2:1 నిష్పత్తిలో ఉద్యోగాలుండాలనే ఒప్పందాన్ని అటకెక్కించారు. తెలంగాణాలోని 96,000 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకుగాను 16,000 మంది మాత్రమే ఆ ప్రాంతానికి చెందినవారు. ఉన్నతాధికార బృందాన్ని, న్యాయస్థానాలను చాలావరకు కోస్తాంధ్ర ప్రాంతపు వ్యక్తులతో నింపేశారు. రాష్ట్ర సగటు అక్షరాస్యత 44% వుంటే, తెలంగాణాలో అక్షరాస్యత 37%.

తెలంగాణా ప్రాంతంలోని సాగునీటి వసతి, పారిశ్రామికీకరణకు సంబంధించిన నిజాలు మరింత తేటతెల్లమే. రాష్ట్రం మొత్తం భూ విస్తీర్ణంలో తెలంగాణా విస్తీర్ణం 41.75% కాగా, 1991 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో తెలంగాణా 39.22% జనాభా కలిగి వుంది. తెలంగాణాలోని మొత్తం సాగుభూమిలో నీటి వసతి వున్న భూమి 22.84% మాత్రమే. 1955-56లో తెలంగాణాలో వ్యవసాయం క్రింద వున్న భూమి 46,57,188 హెక్టార్లైతే అది 1992-93 నాటికి 38,93,617 హెక్టార్లకు తగ్గిపోయింది. అదే సమయంలో కోస్తాంధ్ర ప్రాంతంలో సాగులో వున్న భూమి 35,25,924 హెక్టార్ల నుండి 38,67,306 హెక్టార్లకు (10%) పెరిగింది.

కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు పరంపరగా అవలంభించిన పక్షపాత విధానాల వల్ల, తెలంగాణాను బొత్తిగా నిర్లక్ష్యం చేయటంవల్ల అక్కడ సాగుభూమి విస్తీర్ణం తగ్గిపోయింది. 30-40 సంవత్సరాల క్రితం ప్రణాళికలు

రూపొందించినప్పటికీ ఏ సాగునీటి ప్రాజెక్ట్ కూడా పూర్తి కాలేదు. పెద్దఎత్తున బాకాలూదుకుంటున్న శ్రీశైలం ఎడమగట్టు కాలువ ఇప్పటికీ పెండింగులోనే వుంది. జూరాల, ఇచ్చంపల్లి, భీమునికాల్వ ఇంకా ఇతర ప్రాజెక్టులు నానాటికీ కృశించి పోతున్నాయి. ఆ విధంగా తెలంగాణాలో 10 లక్షల హెక్టార్లకు సాగునీటి వసతి కల్పించడానికి మంజూరు చేసిన 12 ప్రాజెక్టుల నిర్మాణంలో కన్పించే అభివృద్ధి చాలా కొంచెమే. వీటితో పోల్చుకుంటే తెలుగుగంగ ప్రాజెక్టుకి ప్రకటించిన 12 సంవత్సరాల్లో, ప్రతి సంవత్సరం తగినంత నిధుల కేటాయింపుతో త్వరగా పనులు జరుగుతూ వచ్చి ఎంతో దూరంలో వున్న చెన్నై నగరానికి ఇప్పటికే మంచినీరు అందిస్తున్నది. అతిపెద్ద హాస్యాస్పదమైన అంశమేదంటే, దక్షిణ భారత దేశంలో ప్రవహించే గొప్ప నదులైన గోదావరి, కృష్ణా నదులు ప్రధానంగా తెలంగాణా గుండానే ప్రవహిస్తున్నాయి. 69% కృష్ణా పరీవాహక ప్రాంతం (ఆయకట్టు) దక్షిణ తెలంగాణాలో వుండగా, 79% గోదావరి పరీవాహక ప్రాంతం ఉత్తర తెలంగాణా ప్రాంతంలో వుంది. సంవత్సరాల తరబడి ఎడారిగా మారుతున్న తెలంగాణాలో భూములకు సాగునీటి వసతి చాలా కష్టంగా వుంటోంది. ప్రతి సంవత్సరం తెలంగాణాలోని ఏదో ఒక భాగం మీదనో, లేదా కొన్ని భాగాలు లేదా మొత్తం ప్రాంతం మీదనో తీవ్రమైన కరువు దెబ్బతీస్తున్నది. ఈ ప్రాంతానికి లాభాన్ని చేకూర్చేటటువంటి నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురౌతుండగా, తెలంగాణాలోని స్థానిక ప్రజల భూముల్ని ముంచివేసి, ఆంధ్ర ప్రాంతానికి సేవచేసే పులిచింత, పోలవరం ప్రాజెక్టులను ప్రోత్సహించటం జరుగుతోంది. పాలకవర్గాల పక్షపాత, మొండివైఖరుల కారణంగా పూర్తిగా కృష్ణా పరీవాహక ప్రాంతంలో వున్న దక్షిణ తెలంగాణాలోని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలు రెండూ కరువుకు కేంద్ర స్థానాలుగా మారటం అత్యంత హాస్యాస్పదమైన అంశం. లోతైన బోరుబావులు వేయించుకోగలిగిన వాళ్ళకు అవే ప్రధాన సాగునీటి వనరులయ్యాయి. కానీ భూగర్భ జలాలమీద పెరిగిన ఒత్తిడి వల్ల బోరుబావులు కూడా ఎండిపోతున్నాయి. అంతేగాక, చెరువుల ద్వారా అందుతున్న సాగునీటి వసతి సగానికి తగ్గింది. 1956-57లో తెలంగాణాలో దాదాపు 447 లక్షల హెక్టార్ల చెరువుల క్రింద సాగవుతుంటే, ఇప్పుడది 2.26 లక్షల హెక్టార్లకు తగ్గింది. పంపుసెట్లమీద ఎక్కువగా ఆధారపడటమనేది తెలంగాణా రైతాంగాన్ని నిలకడలేని విద్యుత్ సరఫరామీద ఆధారపడేటట్లు చేసి అనేకసార్లు పంట నష్టానికి, తత్ఫలితంగా పెద్దఎత్తున రైతాంగ ఆత్మహత్యలకు దారితీస్తున్నది.

ఈనాడు తెలంగాణాలోని అనేక ప్రాంతాల్లో త్రాగునీటికి కూడ కరువు ఏర్పడటంతో, సాగునీటి మాటెత్తటమే కష్టమైంది. నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఫ్లోరిన్ నీరు తప్ప త్రాగటానికి వేరే గతి లేదు. నదీ జలాల మళ్ళింపు, భూగర్భ జలాలు అడుగంటి పోవటం, చెరువులు శిథిలమైపోవటం, ప్రత్యేకించి స్థానికుల భూములు చౌకగా దండుకున్న కోస్తాంధ్ర వలస ప్రజలు మితిమీరి ఎరువులు, పురుగుమందులు వాడటం లాంటివన్నీ కలిసి తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలు ఎడారిగా మారడానికి దారితీస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నుండి ప్రతి సంవత్సరం కనీసం 10 లక్షల మంది కూలీలు పనికోసం ఎంతో దూరంలో వున్న నర్మదాలోయ వంటి ప్రాంతాలకు, ఉత్తర భారత దేశంలోని ఇరత ప్రాంతాలకు వలస పోతున్నారు. పాలమూరు కూలీల చెమట ఇంకని ప్రాజెక్టు భారతదేశంలో లేదంటే అతిశయోక్తి కాదు. ఆకలిచావుల సంఖ్య పెరగని సంవత్సరమే లేదు. ఆ విధంగా పాలమూరు కరువుజిల్లా, వలసజిల్లా, ఆకలిజిల్లా అనే పేరునే సార్థకం చేసుకుంటున్నది.

ఇక తెలంగాణాలో పారిశ్రామిక రంగం పరిస్థితి మరీ దయనీయం. 1947 తర్వాత పారిశ్రామికీకరణ ప్రధానంగా హైదరాబాద్ నగరానికి, రంగారెడ్డి జిల్లాకు పరిమితమైంది. కానీ ఈ పరిశ్రమలు సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా మూసివేత పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలైన ఆల్విన్ ఆటో, రిపబ్లికన్ ఫోర్జ్ కంపెనీలు ఇప్పటికే మూతపడగా, నిజాం చక్కెర ఫ్యాక్టరీ, గోదావరి ఖనిలోని ఎఫ్.సి.ఐ., మిర్యాలగూడ చక్కెర మిల్లుతో పాటు అంతర్గావ్, సిర్పూర్, సర్‌సిల్క్ మిల్లులు కూడా మూసివేతను ఎదుర్కొంటున్నాయి. తెలంగాణాలో వున్నటువంటి మధ్యతరహా, పెద్ద తరహా పరిశ్రమల్లో ఎక్కువ భాగం కోస్తాంధ్ర, బయటి రాష్ట్రాల సంపన్న వర్గాలకు చెందినవే. తెలంగాణాలోని 10,000 మధ్యతరహా, పెద్దతరహా పారిశ్రామిక సంస్థలకుగాను 1,250 సంస్థలే స్థానికులవి. 6,000 సంస్థలు కోస్తా ప్రాంత పెట్టుబడిదారులవి కాగా, మిగతావి బయటి రాష్ట్రాల వారివి. మరీ ఘోరమేమిటంటే, ఈ సంస్థల్లో పనిచేసే కార్మికుల్లో 23% మాత్రమే తెలంగాణాకు చెందిన వారు.

ఆ విధంగా తెలంగాణా ప్రాంతం నాలుగు రకాల పీడనకు గురౌతున్నది. దేశంలోని అన్ని ప్రాంతాలకు మల్లే భూస్వామ్య-సామ్రాజ్యవాద-దళారీ నిరంకుశ బూర్జువా కూటమి యొక్క దోపిడీ అణచివేతలకు తెలంగాణా గురవ్వటమే కాక, తోడేళ్ళు పచ్చి పరాన్నభుక్కులు, పీడకులైన కోస్తా భూస్వాముల, కోస్తా ప్రాంతీయ దళారీ బూర్జువాల దోపిడీకి కూడా గురౌతున్నది. ఈ ఆంధ్రా పెట్టుబడిదారులు ఇప్పుడు దళారీ నిరంకుశ పెట్టుబడితో, సామ్రాజ్యవాద పెట్టుబడితో బాగా కుమ్మక్కై, చంద్రబాబు నాయుడి టి.డి.పి. ప్రభుత్వ అండతో, ఆంధ్రప్రదేశ్‌లో సామ్రాజ్యవాదుల అత్యంత నమ్మకమైన ఏజెంట్లుగా ఎదిగారు. ఆంధ్రాలోని దళారీ బూర్జువాలకు వ్యతిరేకంగా చేసే పోరాటం అంటే సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ బూర్జువాలకు వ్యతిరేకంగా చేసే పోరాటం కూడా అవుతుంది.

**అర్ధవలస-అర్ధభూస్వామ్య తెలంగాణా కాదు, ప్రజాస్వామ్య తెలంగాణే నిజమైన పరిష్కారం.**

కమ్యూనిస్టుల దృష్టిలో అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అనేగానీ, కొద్దిమంది ధనికుల అభివృద్ధి అని కాదు. ప్రజలు ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని ముందుకు తీసుకొస్తున్నారంటే దానర్థం వారి నిజమైన అభివృద్ధికి హామీనిచ్చే రాష్ట్రం కావాలనేదే. భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువాలతోపాటు అభివృద్ధి

(తరువాయి 25వ పేజీలో...)

# అసమానాభివృద్ధి ఫలితమే ప్రత్యేక తెలంగాణా పోరాటం
# ప్రత్యేక తెలంగాణా సాధనకు రాజీలేని పోరాటమే మార్గం

1940ల చివరలో చెలరేగిన ఉజ్వలమైన సాయుధ తిరుగుబాటుకు చెందిన ఐదు దశాబ్దాల వీరోచిత సాయుధ పోరాట చరిత్ర కలిగిన తెలంగాణా మరోసారి ప్రజా తిరుగుబాటుకు సిద్ధంగా వుంది. సి.పి.ఐ. (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] నాయకత్వంలో ఉత్తర, దక్షిణ తెలంగాణా గెరిల్లా జోన్లలో వర్గపోరాటం సైతం తీవ్రతరమౌతుండగా, అనేక ఇతర శక్తులు తమ పార్టీ పంథాను కూడా ప్రక్కకు నెట్టి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదంతో ముందుకు వస్తున్నాయి. 1969లో సంవత్సరం పాటు ప్రజా పోరాటంగా వెల్లువెత్తి తీవ్రరూపం తీసుకున్న (తర్వాత నాయకత్వ విద్రోహానికి గురైన) ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదం 1990ల ద్వితీయార్థంలో మరోసారి ప్రజాభిమానాన్ని చూరగొన్నది. 1996 నుండి సభలు, ఊరేగింపులు జరగటం ఎక్కువవుతూ, గత సంవత్సరం జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ఆవిర్భావం తరువాత ప్రత్యేక తెలంగాణా పోరాటం మరింత ఊపందుకుంది. ప్రజల మనసుల్లో ప్రత్యేక తెలంగాణా భావన ఎంత దృఢంగా వుందంటే, ఏ పాలకవర్గ పార్టీ కూడా ఈ డిమాండ్‌ను బహిరంగంగా వ్యతిరేకించే ధైర్యం చేయటం లేదు. బి.జె.పి. సైతం 1998 పార్లమెంటు ఎన్నికల్లో ''ఒక ఓటు రెండు రాష్ట్రాలు'' నినాదంతోనే ముందుకు వచ్చినప్పటికీ, కేంద్రంలో అధికారం దక్కించుకున్న తరువాత, తన భాగస్వామ్య పార్టీ అయిన టి.డి.పి. వత్తిడికి తలొగ్గి, తెలంగాణా సమస్యపైన మాట మార్చింది. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో టి.డి.పి.కి చెందిన చంద్రశేఖర్‌రావు శాసనసభ డిప్యూటీ స్పీకరు పదవికి రాజీనామా చేసి తెలంగాణా రాష్ట్రసమితి పార్టీని స్థాపించి ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలోకి బుల్లెట్‌లాగా దూసుకొచ్చాడు. ఈరోజు తెలంగాణాలో ప్రజలు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై గట్టిగా నిలదీస్తుండటంతో, దాదాపు అన్ని పార్టీలు కూడా దీనికి మద్ధతివ్వడమా? లేక తెలంగాణా ప్రజలకు దూరం కావటమా? అనే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. అందువల్ల కాంగ్రెస్, బి.జె.పి. ఆఖరికి అధికార టి.డి.పి.కి చెందిన తెలంగాణా ప్రాంత రాజకీయ నాయకులు కూడా ఈ డిమాండ్‌ను బహిరంగంగా బలపరచటమో లేక మౌనంగా వుండటమో చేస్తున్నారు.

వామపక్షాలుగా పిలువబడుతున్న రివిజనిస్టు సి.పి.ఐ., సి.పి.ఐ.(యం) మరియు యం.యల్.యమ్. సిద్ధాంత బాకా వూదుతున్న జనశక్తి, న్యూ డెమాక్రసీ పార్టీలు తెలంగాణా ప్రజలు ప్రత్యేక జాతికి చెందినవారు కాదని, విశాల తెలుగుజాతిలో భాగంగానే వారు ఆవిర్భవించారని, ప్రత్యేక రాష్ట్ర నినాదం తెలుగుజాతి విచ్ఛిన్నానికే దారి తీస్తుందనే సాకుతో, ప్రత్యేక తెలంగాణా డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నాయి. ప్రాంతీయ అసమానతలు పెరుగుతున్న కారణంగా, ప్రాంతీయ గుర్తింపు పునాదిపై ముందుకొస్తున్న ఇటువంటి ఉద్యమాలపట్ల మార్క్సిస్టు పార్టీల వైఖరి ఏ విధంగా వుండాలి? ప్రాంతీయత పునాదిగా గల్గిన ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని గాని, స్వయం నిర్ణయాధికార హక్కునుగాని మార్క్సిజం వ్యతిరేకిస్తుందా? తెలంగాణాకు సంబంధించినంత వరకు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ఎంతవరకు న్యాయమైనది? మొదట ఈ ప్రశ్నకు సంబంధించిన సిద్ధాంతపరమైన అంశాలను, తరువాత ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర డిమాండు గురించి యధాతథంగా పరిశీలిద్దాం.

### అసమానాభివృద్ధి పెట్టుబడిదారీ విధాన నియమమే!

అసమాన ఆర్థిక, రాజకీయ అభివృద్ధి అనేది పెట్టుబడిదారీ విధానంలోని ఒక ముఖ్యమైన లక్షణం మరియు పరమ నియమం అనే విషయం మనకు తెలిసిందే. సామ్రాజ్యవాద పరిస్థితుల్లో ఈ లక్షణం ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య, ఒకే దేశంలోని వివిధ జాతుల మధ్య, ఒకే జాతి ప్రజలు నివసిస్తున్న జాతి రాజ్యంలోని వివిధ ప్రాంతాల మధ్య కూడా ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా తీవ్ర అసమానతలను కల్గించే దుష్ఫలితాలను ఇస్తుంది. సామ్రాజ్యవాద పరిస్థితుల్లో జాతుల, ప్రాంతాల అసమానాభివృద్ధి అనేది ఒక సాధారణ నియమంగా మారింది. భారతదేశం లాంటి వలసల్లో ఇది మరింత దుష్పరిణామాలకు దారి తీసింది.

200 సంవత్సరాల బ్రిటీషు వలసపాలన భారతదేశంలోని వివిధ ప్రాంతాల, జాతుల అభివృద్ధిలో తీవ్ర అసమానతలకు దారితీసింది. మొత్తం దేశం వ్యవసాయాంగంగా, బ్రిటీషు పరిశ్రమకు ముడిసరుకు అందించే వనరుగా మార్చబడింది.

ఒక దేశం లేదా భౌగోళిక ప్రదేశంలోని ఆర్థిక, సాంఘిక, రాజకీయ అసమానాభివృద్ధి అక్కడి ప్రజల చైతన్యంలో కూడా అసమానాభివృద్ధికి దారితీస్తుందనేది ఒక సాధారణ సూత్రం. బహుళ జాతులున్న భారతదేశంలో జాతి రాజ్యాలలోని సామాజిక ఆర్థిక అభివృద్ధి స్థితిపై ఆధారపడి వివిధ జాతుల మధ్య వివిధ కాలాల్లో జాతీయ చైతన్యాభివృద్ధి జరిగింది. ఆ విధంగా బ్రిటీషు వలసవాదుల అవసరాల మేరకు కోస్తా తీర ప్రాంతాలు, దేశంలోని కొన్ని ఎంపిక చేయబడిన ప్రాంతాలు పారిశ్రామిక, వాణిజ్య, రవాణా, సమాచార సంబంధాల రంగాల్లో కొంత వరకు అభివృద్ధి చెందగా, ఇతర ప్రాంతాలు ఎటువంటి మార్పులేని భూస్వామ్య ఉత్పత్తి విధానంతో, చాలా కొద్దిపాటి విద్య, ఉద్యోగ

(తరువాయి 38వ పేజీలో...)